శ్రీసర్వజన పుస్తకభాండాగారము,

**Registered No. M. 1287.** చందాపోస్టేజీతో రు 3-4-0.

తృతీయవర్షము.] స్సెప్టెంబరు 1919. [సంచిక 2.

శ్రీసర్వజన పుస్తకభాండాగారము,
[illegible]పురము.

ఆంధ్రసేవ, పిఠాపురము, గోదావరిజిల్లా.

శ్రీవిద్వజ్జనమనోరంజనీముద్రాక్షరశాల, పిఠాపురము.

## రాజపోషకులు

శ్రీ పిఠాపురం రాజాగారగు శ్రీ రాజా రావు వేంకట కుమార మహీ
పతి సూర్యారావు బహద్దరుగారు.

శ్రీ ఇజ్జతా సార్ శ్రీ కందుకూరు బాలసూర్యప్రసాదరావు బహద్దరు
వారు, దేవిడిజమీందారుగారు.

శ్రీ రావు వేంకటసూర్యారావుగారు, విరవ.

శ్రీ రాజా కందుకూరు లక్ష్మీప్రసాదరావుపంతులుగారు,
ఉర్లాం జమీందారుగారు.

## పోషకులు.

శ్రీ రాజా మేకా వెంకటాద్రి అప్పారావుబహద్దరుగారు,
వుయ్యూరుజమీందారుగారు, నూజవీడు.

శ్రీ చెలికాని లచ్చారావుగారు, చిత్రాడ.
జమీందారు (ఎర్నగూడెంవగైరా)

## సహాయులు.

శ్రీమాన్ కందాళం శేషావతారముగారు, పిఠాపురము.

శ్రీ రావు (కఅప) వెంకటాద్రివుగారు, పిఠాపురము.

మద్దుల రామయ్యగారికుమాళ్లు వెంకట చినరాజు శ్రేష్టిగారు,
వర్తకులు, యేలూరు.

బాలాంత్రపు సుందరరామయ్యగారు, కాకినాడ.

---

## చందావివరము.

| | | | |
|---|---|---|---|
| చందాదారులకు సంవత్సరమునకు పోస్టేజితో | | | రు 3-4-0 |
| సహాయులకు | ,, | ,, | 6-4-0 |
| పోషకులకు | ,, | ,, | 12-4-0 |
| ప్రధానపోషకులకు | ,, | ,, | 25-4-0 |

రాజపోషకులకు వారివారి చిత్తానుసారము.

శ్రీ

# ఆంధ్రసేవ.

తెలుఁగుమాసపత్రిక.

ప్రతిమాసాదిని వెలువడును.

పత్రికాధిపతి—అద్దంకి మాధవశాస్త్రి.

శ్రీలనొసంగు సత్కళ లశేషము నాంధ్రమునందుఁ దెల్పఁగాఁ
జాలినయట్టి ప్రోడ లనిశంబు శ్రమింపడి జాణఁజేయఁ దాఁ
జేలినపత్రికాంగన యిదే చనుదెంచెడు నిష్ఠ ధాత్రియై
శీలముగల్గు నాంధ్రులకు సేవయొనర్పఁగ నాంధ్రసేవనాన్.

విషయానుక్రమణిక.


1. స్వవిషయము.
2. ఆంధ్రులకొకహెచ్చరిక.
3. ఆత్మనివేదనము—మ. రా. రా. కూచి నరసింహంగారు B.A. Head-Master, R. Ch. High School, Pithapuram.
4. భగవద్గీతాసారము—మ. రా. రా. పేరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.
5. విమర్శనమన నేది?—మ. రా. రా. అయ్యలసోమయాజుల సుబ్బారావుగారు బి.ఎ.ఎల్.టి
6. హంపి.
7. పాఠశాలలయందలివిద్య.
8. అంటుమామిడితోఁట—మ. రా. రా. వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు.
9. హిందూదేశీయార్థికశాస్త్రము—మ. రా. రా. చివుకుల నరసింహంగారు బి. ఎ.

# ఆంధ్రసేవాపత్రికావిషయము.

ఆంధ్రభాషాభిజ్ఞులారా !

క్రిందటి నెలసంచిక తమకుఁ జేరిన తర్వాత నాంధ్రసభ లనంతపురమున జయప్రదముగఁ గొనసాగినవి. ఆంధ్రోద్యమమువట్ల మొదట విముఖతఁ జూపినవారలు సుముఖులుగ నుండుట యొకశుభసూచకముగ దేశమునందంతట భావింపఁబడుచున్నది. ఇదియే యొక్క సత్యమును బోధించుచున్నది. కాలముయొక్క మాహాత్మ్యమిట్టిదని యెవ రూహింపఁగలరు ? నిన్న నసాధ్యమయినపని నేడు సాధ్యమగుచున్నది. దీనికంతకును నిరంతరకృషియే ముఖ్యకారణము. కావునఁ బట్టుదలఁ గలిగి పనిచేయుటయందు లక్ష్యముంచి 'యాంధ్రసేవ' యొక్క రెండవసంచిక తమచెంతకు వచ్చుచున్నది. మొదటిసంచికకును రెండవసంచికకును భేదము తమకే స్పష్టపడఁగలదు. ఇటులనే నిరంతరకృషి వలన మారుచు సురూపమును బడయ నుత్సహించుచు నట్టియుత్సాహసాఫల్యమునకుఁ దమసాహాయ్యము నపేక్షించుచున్నది.

ఆంధ్రసేవ చిరకాలము విహితకృత్యముల నెరవేర్చుఁగాక !

ఆంధ్రసంఘము తత్కార్యనిర్వహణమున నమితసుఖములఁ బడయుఁగాత !

మంగళం మహాత్ శ్రీ శ్రీ శ్రీ.

# ఆంధ్రులకొక హెచ్చరిక.

యుద్ధము ముగిసినది. సౌఖ్యమునొందుదినములు వచ్చినవా? దూరముగఁ బోవుచున్నవి. ఏల? మానవునిజీవనమున కాధారములగువస్త్రాహారములు మనదేశమునఁ గరవగుచున్నవి విదేశీయులు—ముఖ్యముగా నమెరికావాసులును జపానీయులును—ప్రపంచవర్తకమునంతను దామే యాక్రమించుకొని యమితలాభములఁ బొందఁ దలఁచుచున్నారు. వారియుద్దేశములు సఫలమునొందినయెడల మనకు మిక్కిలి నష్టమువాటిల్లునని క్రిందటిసంచికలోఁ దెలుపఁబడినది. యుద్ధమునందుఁ దటస్థముగానున్న దేశములలోనికి జర్మనీదేశపువర్తకులు బాటసారులవలె వెడలి తమసరకులను మిక్కిలిగ నాదేశీయులు కొనునట్టి యొడంబడికల నప్పుడే చేసికొనినట్లును, ఆయొడంబడికల ఫలితముగ నట్టిదేశీయు లనేకులు జర్మనీవారికి సరకులను సప్లయిచేయుట కార్డరుల నిచ్చినట్లును తెలియవచ్చుచున్నది.

యుద్ధము జర్మనీకిఁ బ్రతికూలముగ జరుగుటచే నిట్టిసందర్భములలో జర్మనీ యేమియుఁ జేయలేకపోయినను యుద్ధము ముగియుకాలమున మొదట మధ్యవర్తిగను, తరువాత మిత్రమండలికి పక్షముగను వచ్చిన యమెరికావాసు లీసమయమును వృథవోనీయక తమవర్తకమును బూర్తిగ వృద్ధినొందించుకొనుట కమితప్రయత్నముల సల్పుచున్నారు. ఆంగ్లేయదేశీయులుగూడ వారివర్తకపుధాటిని జూచి భయపడుచున్నారు. అందులకుఁ దగినకట్టుదిట్టములఁ జేయఁజూచుచున్నారు. ఇట్టిసందర్భములలో నవీనవర్తకపద్ధతు లెవ్వియో యనుభవజ్ఞానము వలనఁ దెలిసికొనని హిందూదేశీయులగతి యేమి? అమెరికావారవ

లంబించుచున్నమార్గములు కొన్ని యీక్రిందియంశములవలనఁ దెలియనగును.

ఐరోపాఖండములోని యుత్తరదేశములగు డెన్మార్కు, 'స్కాండినేవియా' (నార్వే, స్వీడను దేశములు)యుఁ బూర్వము జర్మనీదేశమునుండి నేలబొగ్గును దెప్పించుకొనుచుండెడివి. యుద్ధసమయమున వారికిఁ గావలసినబొగ్గు నాంగ్లేయదేశ మంపెను. డెన్మార్కుదేశములోని యొకపత్రిక యిటులఁ దెలుపుచున్నది :—

"యుద్ధసమయమున మాకప్పడప్పు డొక్కొక్కపర్యాయము వచ్చినబొగ్గుకంటె నెక్కువమొత్తమును గడచినజనవరిలో మే మాంగ్లేయదేశమునుండి తెప్పించుకొంటిమి. కాని జర్మనీనుండి మేము తెప్పించుకొనుదానికి సమానమైన మొత్త మెన్నఁడును రాలేదు. ఇప్పుడు జర్మనీదేశమునుండి బొత్తిగా నేమియు వచ్చుటలేదు."

మరియొకపత్రిక యిట్లు పెద్దయక్కరములతోఁ బ్రచురించుచున్నది.

"డెన్మార్కుదేశమునకుఁ గావలసినంత నేలబొగ్గు నమెరికా యీయఁగలదు. ధర యింగ్లీషుబొగ్గువలె చవుక."

ఐదులక్షలటన్నులబొగ్గప్పుడే పంపుటకు బేరము స్థిరపడి సరకును బట్టుకొనిపోవుటకుఁ బ్రభుత్వమువారి యనుజ్ఞకూడఁ దీసికొనఁబడినదఁట.

ఈవిధముగనే యిటలీదేశముఁగూడ ముప్పదియైదువేలటన్నులబొగ్గు నాంగ్లేయదేశమునుండి తెప్పించుకొనుటకు 'కంట్రాక్టు' ను చేసికొని యందలి ముప్పదివేలటన్నులసరకున కొడంబడికను రద్దుచేసికొని యమెరికానుండి తెప్పించుకొనుచున్నదఁట.

నేలబొగ్గునకు మిక్కిలి ప్రసిద్ధినొందిన యాధునిక వర్తకవ్యాపార

ములయం దారితేరిన యాంగ్లేయదేశ మిట్లు వెనుకఁబడవలసివచ్చు చుండుటచే నిఁక హిందూదేశముగతి చెప్పవలసిన దేమి?

తమవర్తకమును వృద్ధిచేసికొనుట కమెరికావా రవలంబించు పద్ధతు లింకను గొన్ని కలవు.

"నలుబదియైదుకోట్లరూపాయలు మూలధనముగల న్యూయార్కులోనుండు 'ఇర్వింగు నేషనల్ బ్యాంకు' (Irwing National Bank) యొక్క డైరక్టరులు తమవ్యాపారమును డెన్మార్కు, నార్వే, స్వీడను దేశములలో వృద్ధినొందించుటకుఁ దమప్రతినిధి నొకనిని బంపియున్నారు."

అమెరికాలోని మరియొక యెగుమతికంపెనీ యొక్క ప్రతినిధి డెన్మార్కులోని యొకరితో నీక్రిందివిధముగ మాట్లాడెను.

"అమెరికనులము స్కాండినేవియాతో నెక్కువ దగ్గరసంబంధమును గలుగఁజేసికొనుటకు నిశ్చయించుకొన్నాము. మేము మీదేశములోని స్థితిగతులను బాగుగఁ బరిశీలించినాము. మేము మీదేశమున కెగుమతులను జేయుటకుఁ బూర్తియైన ప్రయత్నములను జేయుచున్నాము. ప్రస్తుతము మా కోడలులేకపోయినను మీయోడలు సదుపాయముగ నుండును. మాసరకునంతను బట్టుకొనిపోవుటకుఁ దగిన విశాలముగలవి. మాప్రభుత్వమువారు మాకుఁ జేయూతనొసఁగి వర్తకులమగు మేమందఱమును గలిసి విదేశములలోఁ గొనుసరకులను తక్కువధరలకే కొనునట్టి సంఘములుగ నుండుట కనువగుచట్టములను జేయుచున్నారు. అవసరమయినయెడలఁ బ్రభుత్వమువారు ధనసహాయమునుగూడఁ జేసెదరు."

ఈవిధముగ నమెరికనులు తమవర్తకమును వృద్ధినొందించుకొనుటకు బద్ధకంకణులయి యున్నట్లును, వారిప్రభుత్వమువారు వారికిఁ

జేయూత నొసఁగుచున్నట్లును, వారిసరకులు వచ్చుటకుఁ దగినన్ని యోడలుకూడ లభ్యమయినట్లును పైవిషయములవలన స్పష్టమగుచున్నది. ఇట్టిసమాచారము లాంగ్లేయులనే యాందోళనపఱచుచున్నవి. ఇఁక హిందూదేశీయులగతి యేమి? అప్పుడే యమెరికానుండి కాగితము మొదలయినవి మనదేశమునకు వచ్చుచున్నవి. ఒక్కసారి విదేశీయులు మనదేశమున వర్తకపుటేర్పాటులను గావించుకొనినయెడల వారితో సమముగ సరకులనాడెమందుఁగాని, ధరయందుఁగాని దేశీయులు పోటీకి నిలువలేరు.

అట్టిగొప్పమూలధనముతో సంఘముల నెట్లు నెలకొల్పఁగలమా యనుసందేహ మక్కఱలేదు. సహకారపద్ధతిని గొన్ని వర్తకశాలలు బయలువెడలవలసియున్నది. ఆలసించిన మించిపోవును. విదేశీయులదయకుఁ బాత్రులమయి నిరంతరముగఁ బరసహాయమున నుండుటయా? యన్నవస్త్రాదులకయిన నితరసహాయ మక్కఱలేకుండ గడపుకొనుటయా? ఏదిమంచిదో బుద్ధిమంతు లాలోచించి కార్యసిద్ధికిఁ గడంగుదురుగాక!

ఉ. సీతక రాజ్యముంగొనిన ♦ చేతను సీతలతిక్కఁ గన్ననే
రీతిఁ గొందునంచనకు ; ♦ హృద్భ్రమ మేగును దానిచేయి నీ
చేతనుఁబట్టఁగానె ; యటు ♦ సేయక వెఱ్ఱితొలంగుదాఁక నా
నాతిఁగఁ జేసికోననిన, ♦ నానుడిచొప్పడి నవ్వఁబాటగుఁ. 27

క. తరములుపది యటు నిటుపది
తరములు సుతనిచ్చు నెంటఁ ♦ దరియించెసుం
దరతరుఁ డుదారగుణుఁడౌ
వరుఁడు భవాదృశుఁడు కంటఁ ♦ బడునే రామా! 28

క. వలదనుచు నన్నుఁ గసరినఁ
దలఁగక నా వెఱ్ఱిబిడ్డఁ ♦ ద్వత్పదపద్మం
బుల పైనిడి నాపాపా
వళిఁదుల్చక తోఁగువాఁడఁ ♦ బ్రమదాంబుధిలోన్. 29

## అవతారములు.

ఉ. మానవలేఁబుట్టి దేహమును ♦ మానవలె నన్నము చేతఁ బెంచి, సౌ
ఖ్యావహసంస్థితిన్ముదము ♦ సంది, విపద్దశఁ గుందికుంది, మా
త్రోవనె కాలమున్గడపి ♦ క్రుంకిన రాముఁడు దేవుఁడే! యటం
చీవలికొందఱేచి నిను ♦ హేళనచేసెద ; రద్దినత్యమా? 30

సీ. నూనూగుమీసము ♦ ప్రాయమునాఁడె
కూరయాతాటకఁ ♦ గూల్చినతఁడు
కదలింపలేక భూ ♦ కాంతులెందఱో చన్న
విల్లెత్తి యవలీల ♦ విఱిచినతఁడు
పల్లవంబులఁబోలు ♦ పదములతాఁకున
శిలనలివేణిఁగాఁ ♦ జేసినతఁడు
రణసహాయులుగఁ ది ♦ ర్యగ్జంతుసంతతిఁ
గొని శత్రువులఁ బొ ♦ గొన్నయతఁడు

గీ. కదనభూమిని రావణు ♦ కనుల కెదుట
వెనుక నీప్రక్క నాప్రక్క ♦ వివిధవస్తు
వితతి శ్రీరామమయము గా ♦ వించినతఁడు
పలుకఁజెల్లునె మావంటి ♦ వాఁడటంచు ? 31

ఉ. దుష్టవిహంతకైక పరి ♦ తుష్టినిజెందఁగఁ దండ్రివాక్యముల్
భ్రష్టముగాకయుండ నిజ ♦ పత్నినిగొంచుఁ జతుర్దశాబ్దముల్
కష్టములన్గణింపకురు ♦ కాననవాసముచేసినట్టి యా
శిష్టచరిత్రు మానవులఁ ♦ జెప్పినచొప్పునఁ జెప్పనొప్పనే ? 32

ఉ. సోదరుఁడౌట, లక్ష్మణుఁడు ♦ సుప్తుని రాముని నేమిసేయునో
నేఁదలఁగంగరాదనుచు ♦ నెమ్మిగుహుండును, బోదు నమ్మఁగా
రాదని లక్ష్మణుండు, నిశ ♦ రక్షణజాగరులైన పూజ్యనిర్
మాద్యశుఁడంట వట్టి మతి ♦ మాలినమాటగదా రఘూద్వహా! 33

శా. అమ్మా ! రాజ్యభరమ్ము బిడ్డకుఁ బ్రశాం ♦ త్యాపాదకారణ్యవా
సమ్మున్నాకిడి, నీసపత్నిసుతుప ♦ క్షంబుంటె ; యోగీశభో
గ్యమ్మౌసౌఖ్యము నీకృపామహిమ ల ♦ భ్యంబయ్యెనా, కిట్టిప్రే
మమ్మున్జూపుదు రెవ్వ ? రన్నజగతీ ♦ మాన్యుండు సామాన్యుఁడే? 34

ఉ. శ్రీదయితుండు రాముఁడె ధ ♦ రిత్రి భరింపవలంతి ; దానికి
న్నేఁ దగనంచు దుఃఖమెద ♦ నివ్వటిల న్భరతుండువోయి య
న్నా ! దయసేసి పాలనమొ ♦ నర్పుమటన్న, నటుల్లొనర్పఁగాఁ
గాదదినీవె చేయుమని ♦ క్రమ్మఱఁబంపినవాఁ డలంతియే! 35

సీ. అన్నచే నవమాన ♦ మందివిభీషణుం
డరుదెంచి యాకస ♦ మందునిల్వఁ
గపివీరులితఁడు [illegible] ♦ [illegible]సుఁడు వధ్యుఁడటన్న
నంతయునాలించి ♦ యులఁతిసన్న

శ్రీ సర్వజన పుస్తక భాండాగారము
రాజమహేంద్రవరము.

చెలువైన మోవిపైఁ ♦ జిందులు ద్రొక్కఁగాఁ
గెలఁకు సనున్న సు ♦ గ్రీవుఁ గాంచి
ప్రాణమిత్రమ! నీవు ♦ త్వరితంబుగా నేగి
శరణాగతుని విభీ ♦ షణుని దెమ్ము

గీ. శత్రుసోదరుఁడనుచట్టి ♦ శంకవలదు
శరణు! శర! ణని రావణా ♦ నుజుఁడె వచ్చి
యభయ మడిగిన నొసఁగెద ♦ నన్న సత్య
వ్రాబ్ధి మావంటి మానవుఁ ♦ డనుట తగునె? 36

చ. వివిధనదీజలంబుల వి ♦ భీషణు లంకకు రాజుఁ జేసినాఁ
డవు రఘురామ! రావణుఁడె ♦ డంకతనంబుతె యెప్పుడేనియుఁ
భవదమలాంఘ్రిపద్మముల ♦ పైఁబడ నేమియొసంగె? దన్న నా
ప్రవిమలమా నయోధ్యయని ♦ పల్కిన రాజు మనుష్యమాత్రుఁడే!

ఉ. కొంకక యెంత వేఁడిన వి ♦ ఘూర్ణితభంగరటన్మహాబ్ధి యా
టంకము సేయ మంతనము, ♦ డంబు నడంచి కలంచి పూర్తిగా
నింకఁగఁ గొట్టుదు నడలి; ♦ నేవి ధనుర్విశిఖంబు? లన్నదై
త్యాంక మనోవిభాసి మను ♦ జావళి యందలివాఁడె రాఘవా! 38

సీ. రావణుండు శుకసా ♦ రణనామచారయు
గ్మంబును రిపురహః ♦ స్యం బెఱుంగఁ
బంపఁగా వారలు ♦ వానరాకారులై
ప్లవగసేనలఁ జొరఁ ♦ బాఱియుండ
వారికపటవృత్తి ♦ వానరుల్గనుఁగొని
వధముకై రాముస ♦ న్నిధికి వారిఁ
గొంపోయినప్పుడు ♦ చంపఁగా రాదని
రాయుధచారుల ♦ నలఁతిబంట్లు

గీ. నంపు వేగులఁ గడుగార • వించి శ్రీతనదు
బలమునంతయుఁ జూపి మీ • ప్రభుని కెల్లఁ
జెప్పుఁడని కూర్మిఁ బంపిన • చిత్రనృపతి
నరుఁడనిపించుటకు నెట్లు • నాల్క యాడు? 39

సీ. ముల్లోకములకును • దల్లియౌ జానకి
మృదులాంకమున శిరం • బిడి సుషుప్తి
వివశుఁడై త్రిజగతీ • పిత రాముఁడుండఁగాఁ
గాకాసురుఁడయుక్త • కార్యమొండు
చేసిన నాద్రోహి • చేఁత సీతవలనఁ
దెలిసి వెంటనె దర్భ • దీసి వాని
పైని బ్రహ్మాస్త్రంబు • వఱుపఁ దద్బాధచేఁ
బరువిడి పరువిడి • నరులసురల

గీ. వేఁడియసురుఁడు గతిలేక • వెండివచ్చి
చాఁగిలంబడఁ గరుణించి • "చావుదప్పి
కన్నులొట్టపోయె" ననువా • క్యంబు నిజము
చేసినటువంటి ప్రోడ కిం • చిజ్జ్ఞనరుఁడె? 40

మ. అలమందోదరి తారయున్ మహిత బా • హాదర్పధీరత్వముల్
గలనాథుల్ రఘురాముచే హతులుగాఁ • గాఁ గ్రోధదుఃఖాత్మలై
పలుదుర్భాషలనాడవచ్చి వివశ • త్వంబంది దేవస్తుతుల్
సలుపం జొచ్చిన దివ్యతేజుఁడరయ • న్సామాన్యుఁడా మర్త్యుఁడే! 41

చ. వనుపడె మాధురీమహిమ • బమ్మెరపోతన పద్యపాళికిన్
ఘనుఁడగు త్యాగరాజు మృదు • గానరసాత్మకగీతికాళి, కె
వ్వనినక లాఘుసంహరణ • పావననామము జిహ్వనుంట, నా
పరిణుతగుణున్ మనుష్యుఁడని • వాకొనుటెంతయు వింతయౌఁగదా!

# భగవద్గీతాసారము.

భగవద్గీతలను పఠించి వానియర్థమును దెలిసినయెడల సంసారమందలి బహువిధదుఃఖముల ననుభవింపుచు విశ్రాంతిలేక యాయాసపడువారికి సకలశ్రేయస్సాధనమగు భగవద్భక్తి దృఢముగఁ గలుగును. గీతాశాస్త్రము మొదలగుశాస్త్రములన్నియు భగవంతుఁడు కలఁడు పరలోకము పుణ్యపాపములచేఁ బొందనగుననెడి యాస్తికమతావలంబుల నుద్దేశించియే ప్రవర్తించినవి. నాయందుఁ జిత్తమును నిశ్చలముగ నునిచి నన్ను ధ్యానించువారు తప్పక నన్నుఁ జేరుదురను నీయర్థమును గీత ౧౨ వయధ్యాయమున ౮ వశ్లోకములో "మయ్యేవమన ఆధత్స్వ మయిబుద్ధిం నివేశయ। నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం నసంశయః॥" అని శ్రీకృష్ణుఁడు చెప్పినాఁడు. సంసారమున సకలజంతువులు సుఖమునే కోరుచుండుదురు. కాని సుఖసాధనములు దొరకక కొందఱు క్లేశపడుచుందురు. మఱికొందఱజ్ఞులు వంచకులు చూపినమార్గము నవలంబించి తమకోరిక తీరక పరితపించుచుందురు. మూఢుల యీయవస్థనుజూచి పరమకృపాళువును దేవకీనందనుఁడు నగుశ్రీకృష్ణుఁడు నిఖిలాగమసారమును బ్రహ్మవిద్యయు నగునీగీతశాస్త్రమును నిజదయాపాత్రుఁడు నుత్తమాధికారియు నగునర్జునున కుపదేశించి సకలజనుల నుద్ధరించెననుట యెల్లరకుఁ దెలిసినవిషయమే.

ఈభగవద్గీత పాఠమాత్రముననే మోక్షమనుప్రాసాదము నెక్కుటకు సోపానమయి ప్రకాశించును. అర్థము నెఱిఁగి పఠించిన భక్తిజ్ఞానములు పెరుగును. ఇట్టిగీత కర్మకాండము, భక్తికాండము, జ్ఞానకాండము నని మూఁడువిధములుగ విభజింపఁబడెను మఱియు "త్రత్

త్వమసి" యను మహావాక్యార్థమునందలి "త్వం" అనుపదముయొక్కయర్థము మొదటికాండమందును, 'తత్' అనుపదముయొక్కయర్థము రెండవకాండమందును 'అసి' అనుపదముచేత నా 'తత్' 'త్వం' పదములయొక్క లక్ష్యార్థములకైక్యము మూఁడవకాండమందును వర్ణింపఁబడెను. మొదటికాండమునందు వర్ణింపఁబడినకర్మము నిష్కామకర్మము, కామ్యకర్మము, నిషిద్ధకర్మము నని మూఁడువిధములుగ నున్నది. తమతమవర్ణాశ్రమములకు విహితములగుకర్మములను ఫలము నపేక్షింపక చేయుట నిష్కామకర్మమనఁబడును. స్వర్గాదులనపేక్షించి చేయుయజ్ఞాదికములు కామ్యకర్మము లనఁబడును. ద్విజుల కనుచితముగాని సురాపానాదికము నిషిద్ధకర్మము. వీనిలో నిష్కామకర్మము శ్రేష్ఠము. దీనిలో నాచరించఁబడుజపము భగవత్స్తోత్రము మొదలగుసుకర్మములచేత పాపము నశించును. చిత్తము కలకతీరి ప్రసన్నమగును. తరువాత నిత్యానిత్యవస్తువిచారము, వైరాగ్యము, శాంతి మొదలగుసుగుణములుం గలుగును. ఈసాధనసంపత్తివలన ఆత్మయెట్టిది? అనాత్మయెట్టిది? తానెవరు? బంధమననేమి? మోక్షమననేమి? యని విమర్శముగలిగి సద్గురువు నాశ్రయించును. ఆగురుకటాక్షమువలన "తత్వమసి" మొదలగుమహావాక్యములను వినుట, ఆయర్థమును మననముచేత రూఢముచేయుట, గురుప్రోక్తలక్ష్యార్థమును నిరంతరము ధ్యానించుట కలుగును. ఈపరిశ్రమ యావిద్యను తొలగించి సుజ్ఞానమును గలిగించును. సద్గురుకటాక్షము వలనఁ గలిగినతత్వజ్ఞానమువలన సంచితకర్మము, ఆగామికర్మము నశించును. ప్రారబ్ధకర్మము భోగమువలననే క్షీణించును. ఎట్లనగా నంధకారములోఁ బులియని భ్రమపడి బాణమును ప్రయోగించిన తర్వాత, నది పులికాదు, గోవేయని నిశ్చయము గలిగినను నాబాణ

ము వెనుకకు మరలక గురిపెట్టినగోవును చంపకమానదుగద. ఈవిధమునఁ బ్రారబ్ధకర్మ మీదేహముతో ననుభవింపవలసియుండిన సుఖదుఃఖముల ననుభవింపఁజేయక మరలదు. ఈప్రారబ్ధకర్మమువలనఁ గలిగినవాసన (పూర్వమం దభ్యసించిన తానునకొనేడిభ్రమ) భగవద్భక్తిరూపకమగు సమాధివలనఁగాని తొలగదు. ఈభగవద్భక్తివలన మనోనాశము, వాసనాక్షయము, తత్త్వజ్ఞానము గలిగి నిరతిశయానందమును బొందును. ఈభగవద్భక్తి లేదేని తత్త్వజ్ఞానమునకు విఘ్నములు మెండుగఁ గలుగును. కావున రెండవకాండమున భగవద్భక్తి వర్ణింపబడెను. ఈభక్తికి స్వవర్ణాశ్రమానుకూల కర్మాచరణము కారణము. తత్త్వజ్ఞానము, పరమానందము ఫలములు. కనుక నీభగవద్గీతయందు మొదటిది కర్మకాండమని రెండవది భక్తికాండమని మూఁడవది జ్ఞానకాండమని నిరూపింపఁబడెను.

పురుషుఁడాసురవృత్తితోఁగూడి పరమపురుషార్థమును బొందలేక దుఃఖమనుభవించును. శోకమోహము లాసురవృత్తులు. ఈశోకమోహములే దుఃఖమును బుట్టించును. దుఃఖము నాకుఁగావలెనని యెవరును గోరరుగద! అందఱును నిరతిశయానందమునే కోరుచుందురు. ఆపరమానందమే మోక్షమనఁబడును. మోక్షమనగా భ్రాంతి వదలి స్వస్వరూపమున నుండుట. దుఃఖకారణములగు శోకమోహములు బలవంతులగు శత్రువులై విడుచుటకు శక్యములుకావు. విడుచుటకు సాధ్యముకాని యీశోకమోహముల నెట్లువిడుతును? పరమపురుషార్థ మెట్లుదొరకును? అని చింతించువానికొఱకు శ్రీకృష్ణుఁడర్జును నుద్దేశించి యీగీతాశాస్త్రము నుపదేశించెను. అర్జునుఁడు గురువులను, బంధువులను నేనెట్లుచంపుదునని శోకమోహములచేఁ బీడితుఁడై యుండగా నతని దేహాభిమానమును వదల్చి త్వంపదలక్ష్యార్థ మీమొద

టియధ్యాయషట్కమున వర్ణింపఁబడెను. ఇట్లుపదేశింపఁబడిన యర్జు నుఁడవిద్యనువిడిచి విద్యనుబొంది శోకమోహములనువదలి స్వధర్మ మగుయుద్ధము నవలంబించి కృతకృత్యుఁడయ్యెను కావున నీగీతాశా స్త్రము మిగుల ప్రశస్తము.

---

## ప్రథమాధ్యాయము.

---

పాండవసేనానిర్ణయము.
౧ మొదలు ౭ వరకు.

ఓసంజయా! ధర్మప్రధానమగు కురుక్షేత్ర మందు యుద్ధము చేయుటకుఁ బూనిన నాకుమా రులును మాపాండవులును యుద్ధమునేచేసిరా? లేక క్షేత్రమాహాత్మ్య ముచే ధర్మశీలురై యుద్ధమును మానిరా? అని ధృతరాష్ట్రుఁడడుగ సంజయుఁ డిట్లనియె. "మామకాః" అనిచెప్పి యూరకుండక "పాం డవాః" అనిచెప్పుటచేత ధృతరాష్ట్రునకుఁ దనకుమారులయందే మమకారము పాండవులందు ద్రోహబుద్ధియున్నదని తెలియవలయును.

శూరులగుపాండవులకుఁ దనముందరనున్న సేనలవలన భయము లేదు. బంధువధవలనఁ బరలోకహాని కలుగునేమోయని యర్జునుఁడు జడియఁగా నాభయమును శ్రీకృష్ణుఁడు తత్త్వోపదేశముచే నివారించు చున్నాడు. కాని నీకుమారుఁడు ద్రోణాచార్యులయొద్దకుఁబోయి, "ఆచార్యా! నీవైరియగు ద్రుపదునిపుత్రుఁడు ధృష్టద్యుమ్నుఁడు పన్నిన యీసేన మిమ్మును లక్ష్యపెట్టక యెంతనిర్భయముగ వచ్చు చున్నదో చూడుము." అని తనమనస్సులోనున్న వైరమును వెలి పుచ్చుచున్న దుర్యోధనునకు ధర్మక్షేత్రమందయినను గొంచెమయిన ను బాపభీతి కలుగలేదని సంజయుఁడు సూచించెను. ఆచార్యోత్తమా!

శ్రీసర్వజన పుస్తకభాండాగారము,



ఈపాండవ సేనయందు శూరులు మహారథులునగు యుయుధాన విరాట దు్రపదాభిమన్యు ప్రతివింధ్యాదులం జూడుము.

కురుసేనావర్ణనము.
7—11

వీరలిందఱున్నను మనసేనయందు యుద్ధసన్నద్ధులు తేజోనిధులునగు తమరు భీష్మకర్ణాశ్వత్థామాదులును తమప్రాణములనయిన నపేక్షింపక నాజయమును గోరుచున్నందున నాకేమియు భయములేదు. పదునొకండక్షౌహిణులుగల మనసేనను ప్రసిద్ధికెక్కిన భీష్ముఁడు నడుపుచున్నాడు. ఏడక్షౌహిణులుగల పాండవసేనను చపలుఁడగుభీముఁడు నడుపుచున్నాడు. కావున మనము వారిని తప్పక జయింపుదుము. మఱియు చక్రమునకుఁ గుంచమువలె మనసేనకంతకుఁ బ్రధానమయి సేనానాయకుఁడగు భీష్మునకు వెనుకను ప్రక్కలను తగినస్థానములయందున్న మీరందఱు పరాకులేక జాగరూకులరై యుండుడని దుర్యోధనుఁడు తనయోధుల కానతిచ్చెను.

రణమందు శంఖభేరీ వాద్యములు.
12—19.

ఈదుర్యోధనుఁడు నన్ను స్తోత్రముచేయనీ, లేదా, నిందింపనీ, యెట్లయినను నేను నాశక్తికొలఁది యుద్ధముచేసి నాదేహమును వదలుదునని దృఢముగ నిశ్చయించిన భీష్ముఁడు దుర్యోధనున కానందముగలుగునట్లు సింహనాదముచేసి శంఖమూదెను. తరువాత మిగిలినయోధులు శంఖములూదిరి. భేరులు, గోముఖములు మొదలగువాద్యములను వాయించిరి. అపుడు పాండవసేనయందు రథారూఢుఁడగునర్జునుఁడు, సారథియగుశ్రీకృష్ణుఁడును దేవదత్తము పాంచజన్యము నను తమతమ శంఖములనూదిరి. తరువాత ధర్మరాజు 'అనంతవిజయ' మను తన శంఖమును భీముఁడు 'పౌండ్ర' మనుతనశంఖమును, నకులసహదేవులు 'సుఘోషము మణిపుష్పకము' లను తమతమశంఖముల నూదిరి.

మిగిలినయోధవరులును దమతమశంఖముల నూదగా నుభయసేనలం దుం గలిగినరణధ్వని భూనభోంతరములం గప్పెను.

అర్జునుఁడు సేనలఁజూచుట. 20—23

ఇట్టిసమయమున నర్జునుఁడు శ్రీకృష్ణుం జూచి "కృష్ణా! నారథము, నుభయసేనల నడుమ నుంచుము. యుద్ధములో దుర్యోధనునకుఁ బ్రియముచేయవలయునను తలంపుతో నెవరెవరు వచ్చియున్నారో నేనెవరితో యుద్ధముసేయవలయునో కనుగొనెదను" అనెను.

అర్జునవిషాదము. 24—45.

శ్రీకృష్ణుఁ డట్లుచేసి "అర్జునా! ఈకురువీరులం జూడుము" నిచెప్పెను. అర్జునుఁ డాయుభయసేనలం దున్న గురువులను, తాతలను, తండ్రులను, సోదరులను, బంధువులను సఖులను జూచి వీరి నెట్లుచంపుదునాయని శోకింపుచు నతిదయచే దీనుఁడయి మరల శ్రీకృష్ణున కిట్లనియె.

"కృష్ణా! యుద్ధముసేయుటకు సిద్ధముగనున్న యీబంధువర్గమును జూడగా నాయంగములు మండుచున్నవి. నాముఖ మెండుచున్నది. శరీరము వణకుచున్నది. చెమట పట్టుచున్నది. నాచేతనున్న గాండీవము జారిపోవుచున్నది. అనేకములగు దుశ్శకునములగుచున్నవి. నామనస్సు నిలకడలేక తిరుగుచున్నది. నేనీయుద్ధరంగమున నిలువలేను. యుద్ధములోనున్న స్వజనులంజంపిన శోకమేకలుగును గాని నాకుఁ బ్రీతి కొంచెమైనను గలుగనేరదు. పరులనుజయించి రాజ్యమార్జించి యారాజ్యసంపదలచే నేబంధువులను బోషింపవలయునో యాబంధువులే ప్రాణములం దాశలేక నాతో యుద్ధముచేయఁ బూనియున్నారు. నేను వారిని జంపలేను. నాకీరాజ్యము భోగములు నక్కరలేదు. ఈయెదుటనున్నగురువులు, తాతలు, కుమారులు, బంధువులు కలసి నన్ను గొట్టినను సరే. మూఁడులోకముల రాజ్యసంపదలు నాకుఁ

గలిగినను వీనినాశించి వారిని గొట్టఁజాలను. ఈస్వల్పరాజ్యమునకు వారినెట్లుకొట్టఁగలుగుదును? వీరినిజంపితినేని నాకుఁ దృప్తి యించుకేనియుఁ గలుగనేరదు. బంధువులయందు దోషములున్నను వారిని జంపి నేను సుఖియింతునా? వీరు ధనరాజ్యములనాశించి యీదిగువ చెప్పెడిహానినిఁ దెలియఁజాలరు కాని యెరిగిన మనమైనను యుద్ధము నుండి తొలఁగవలదా? ఆదోషములేవియో చెప్పెదవినుము. కులము నశింపగా సనాతనములగు కులధర్మములు చెడును. దానిచే నధర్మము కులము నాక్రమించును. అధర్మము హెచ్చెనేని కులస్త్రీలు పాడగుదురు. దీనివలన వర్ణసంకరము గలుగుటయేకాక కులమువారికిని కులము పాడుచేసినవారికిని నరకమందు పతనముగలుగును. వీరిపితృదేవతలును, పిండములు తర్పణోదకములు లేక నరకమునఁ గూలుదురు. ఆహా! ఇంతపాపమున కొడిగట్టిన మనము రాజ్యసుఖములఁగోరి బంధువులను జంపఁదలఁచినాము. ఇది మహాపాతకము. కౌరవులు నన్నుగొట్టినను నే నాయుధమునుబూని వారలంగొట్టనేరన" ని చెప్పుచు గాండీవితన ధనువును గ్రిందఁ బారవైచి రథమందు వ్రాలెనని సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ జెప్పెను.

## 2 వ అధ్యాయము.

శ్రీకృష్ణు డర్జునుని నోదార్చు 1—3

శరచాపములను బారవేసి కరుణతోఁ గన్నీరు విడుచుచు శోకించుచున్న యర్జునునితో శ్రీకృష్ణుఁ డిట్లనియె. "అర్జునా! ఈసమయమున నీకిట్టివికారము

తగునా? దీనిని విని పెద్దలు సమ్మతింతురా? ఇందువలనఁ గీర్తి కలుగునా? స్వర్గము వచ్చునా? కనుక నీవిట్టి దైన్యమును మాని శత్రువులను జయించుటకుఁ బ్రయత్నింపుము. నీవంటివాని కీభయము తగదు."

తిరిగి యర్జునవిషాదము.
4—8

నావు డర్జునుఁ డిట్లనియె "కృష్ణా! ఈయుద్ధములో నాయెదుటనున్న పూజనీయులగు భీష్మునితోను ద్రోణాచార్యులతోను నేను యుద్ధము చేయలేను. మహానుభావులగు గురువులను జంపి తద్రక్తదూషితమగు రాజ్య మనుభవించుటకంటె బిచ్చమెత్తుకొనుట మేలని తోచుచున్నది. యుద్ధములో నెటువంటిబంధువులను జంపినపిదప వారివియోగమువలన బ్రతుకలేమో యటువంటిబంధువులే యీరణములోఁ గనుపించుచున్నారు. రణమందు మనము వారిని జయింతుమో, వారే మనలను జయింతురో నిశ్చయింపఁజాలము. రాజ్యమందాశతో ధర్మమును నిశ్చయింపఁజాలక నిన్నడుగుచున్నాను. శిష్యుఁడనగు నాకు తత్త్వము నుపదేశించి నా మనస్సునందలి కలకఁ దీర్పుము. మఱియు సంగరమున శత్రువులను జయించి నిష్కంటకముగ రాజ్యము నేలుచున్నను నాకీశోకము తగ్గదు. కావున యుద్ధము సేయనని యూరకున్న యర్జునివిషాదము తగ్గించుటకు శ్రీకృష్ణుఁడు మరల నిట్లనియె.

వైరాగ్యముగలయర్జునునకు తత్త్వోపదేశముచే శ్రీకృష్ణుఁడు శోకమోహములను బోఁగొట్టుట.
11—

"జ్ఞానములేనివారు మూఢులు. విద్యనెఱిగినవారు విద్వాంసులు. ఇదియాత్మ యిది యనాత్మ యనువివేకముగలవారు పండితులు. ఇట్లుండగా నర్జునా! నీవు పండితునివలెఁ బలుకుచున్నావు. ఎవరు శోకింపఁదగరో వారినిగూర్చి శోకించుచున్నావు. బంధువధవలన శోకము గలుగకుండునాయని యడిగెదవా? నీవు నాప్రశ్నముల కుత్తరమిమ్ము. భీష్మద్రోణాదుల

దౌర్జన్యమునుగుఱించి దుఃఖింతువా? వారు మహానుభావులని నీవే చెప్పియున్నావు గనుక వారిదౌర్జన్యమునుగుఱించి దుఃఖింప నవసరము లేదుగద. వారిదేహములు పోవునని దుఃఖింతువా? మరణశీలములగు దేహము లెన్నడయినను నశింపకయుండునా? రణమందు నిహతులగువారికి వీరస్వర్గము లభించునుగనుక వారిశరీరములు శోచనీయములు కావు. వారియాత్మనుగుఱించి శోకింతువా? నిత్యమగునాత్మ పుట్టనిది. నశింపనిది. గనుక యాత్మనుగుఱించియు శోకింపఁగూడదు. కనుక నీకీశోకమేల? ఈమూఁడువిధములజనులలో మూఢులు తమపిల్లలకు విద్యాబుద్ధులు లేవని విచారింపక వారు జీవించియున్నమాత్రిన చాలునని వారిజీవనమున కేమియపాయముగలుగునోయని శోకింతురు. విద్వాంసులు తమకుమారులకు విద్యాబుద్ధులు లేకపోయెననియు, నిట్టివారు పుట్టియున్నను మేలే, చచ్చినను బాగే. మూర్ఖులగుకుమారులు సర్వదా తల్లిదండ్రులను బీడింతురు. పుట్టనివాఁడును జచ్చినవాఁడును స్వల్పకాలము మాత్రిమే తల్లిదండ్రిలను బీడింతురనియు నెంచి వారి మూర్ఖత్వమునుగుఱించియే శోకింతురు. పండితులాకుమారులయందున్న యాత్మనే నిత్యముగ భావించుచు జీవించినను గతించినను వారి మూఢత్వమును వారిదేహములనుగూర్చి శోకింపరు. ఈదేహములు నిత్యములుకావు "జాతస్యహిధ్రువోమృత్యుః" అనగాఁ బుట్టినవానికిఁ జావుతప్పదు. దేహములు పుట్టి నశించునుగాని యాత్మపుట్టదు నశింపదు. ఈయాత్మ దేహములకంటె వేఱయియుండును. ఒకనరునకు బాల్యము యౌవనము వార్ధకమునను నవస్థలు వేఱయియున్నను నాయవస్థలనన్నిఁటిని ననుభవించెడినరునకు భేదములేదుగద. భేదమున్నయెడల నేను నాబాల్యమున మా తాతను మాతండ్రిని మాయమ్మను జూచినాను. ఆనేనీవార్ధకమునందు నాకుమాళ్లను, నామనుమలను

జూచుచున్నాను. అనెడి యీవ్యవహారము లోకమునఁ బ్రసిద్ధముగ నున్నది. ఈరెండవస్థల ననుభవించువాఁ డాయవస్థల రాకపోకలను జూచుచు నాయవస్థలకంటె వేఱగును గద. ఈప్రకారము వెనుకటి దేహమందుండి చేసిన పుణ్యపాపముల ఫలముల నీదేహమందుండి సుఖదుఃఖములుగ ననుభవించుచు, నీదేహమునందుండి పుణ్యపాపములను జేయుచు వీనిఫలములను బరలోకమందు స్వర్గనరకములుగ ననుభవించువాఁ డొక్కఁడే కాని వీనికంటెఁ బూర్వజన్మమందలి కర్తయు నుత్తరజన్మమందలి భోక్తయు వేఱుకాదు. ఈస్థూలదేహములు పుట్టునవి నశించునవి. ఆత్మ, దేహములను అవస్థలనువలె ననుభవించుచుండును. ఎవరుచేసిన పుణ్యపాపఫలములు వారే యనుభవింపవలెను గాని తదితరు లనుభవించువారు కారుగద. కనుక నాత్మదేహములకంటె భిన్నమయినవాఁడు.

మఱియు నీస్థూలదేహ మాత్మయగునేని తానుచేయని కర్మము యొక్క దుఃఖాదిరూపఫలము లభించుట, తానుచేసిన కర్మముయొక్క సుఖాదిరూపఫలము నశించుట, యనెడి రెండుదోషములు సంభవించును. ఎట్లనగా :—ఒకపురుషున కిరువదిసంవత్సరముల వయస్సున్నది యనుకొందము. ఇరువదినాలుగేండ్లక్రింద నీమనుష్యుఁడు లేడుకద. దీనిచే నిపుడితఁడనుభవించే సుఖదుఃఖములకుఁ గారణములగు పుణ్యపాపముల నితఁడు చేయుటకు వీలుండదు. మఱియొకఁడు చేసిన పుణ్యపాపములఫల మితఁ డనుభవించుచున్నాఁడనియుఁ జెప్పకూడదు. లోకములో నెవఁడుచేసిన పుణ్యపాపముల ఫలములగుసుఖదుఃఖములు వాఁడే యనుభవింపవలెనను న్యాయమునుబట్టి తాననుభవించెడి సుఖదుఃఖములకుఁ గారణములగు పుణ్యపాపములను మఱియొకఁడు చేసినాఁడని చెప్పక తానే కర్త యని యొప్పవలెను. ఇరువదినాలుగు

సంవత్సరములకిందట నీపురుషుఁడు (దేహము) లేనందునఁ దానుచే యుని పాపాదికర్మముల ఫలములగుదుఃఖాదుల ననుభవింపవలసి వచ్చు ను. వాఁడు చేసినతప్పునకుఁగాను నిన్ను శిక్షింతుమన్న నెవఁడయిన నొప్పుకొనునా? కావున స్థూలదేహమే యాత్మయని వాదించెడివారి మతమున (అకృతాభ్యాగమము) 'తాను చేయనికర్మముయొక్క ఫల మనుభవించుట' యను దోషమొకటి తప్పదు.

మఱియు నీపురుషుఁ డిటుపైని తొంబదిసంవత్సరములకంటె నెక్కువ జీవింపడుగద. అట్లేని యితఁడుచేసిన యన్నదానము, చెరు వులు త్రవ్వించుట మొదలగు పుణ్యకర్మములయొక్కయు, గోహత్యాది పాపకర్మములయొక్కయు ఫలమును వీఁడనుభవించుటకు వీలుండదు. నీ వాత్మయనిచెప్పెడి యీదేహము నిక్కడ నేకాల్చుటచేతఁగాని పా తిపెట్టుటచేతఁగాని నశింపఁగా నీపుణ్యాదిఫలములగు సుఖాదుల ననుభ వించువాఁ డుండడుకనుక (కృతవిప్రణాశము) చేసిన పుణ్యాదికర్మ ములు ఫలమునియ్యక నశించుననే రెండవదోషమునయితము సంభ వించును. కాఁబట్టి యీస్థూలదేహమే యాత్మయని చెప్పరాదు. ఒక డొకయింటనుండి కొన్నివస్తువులను జేసి మఱియొకయిల్లు ప్రవేశించి యీవస్తువుల నమ్ముటచేఁ గలిగినలాభమును బొందవచ్చును. ఇట్లే నరుఁ డొకదేహమందుండి చేసిన పుణ్యపాపములు ఫలములగు సుఖ దుఃఖములను మఱియొకదేహమందుండి యనుభవించునని చెప్పవలెను. రక్తము, మాంసము, ఎముకలు, చర్మము, మొదలగువానితోఁ జేయఁ బడి మనకంటికిఁ గనిపించెడి యీస్థూలదేహము పుట్టి నశించుచుండ గా నాత్మకు మఱియొకదేహప్రాప్తి యెట్లుకలుగునందువేని వినుము. ఈస్థూలదేహమువలెనే యాత్మకు సూక్ష్మదేహమునొకటి గలదు. ఈ సూక్ష్మదేహము జ్ఞానేంద్రియములైదు. కర్మేంద్రియములైదు

ప్రాణవాయువు లైదు. మనోబుద్ధులు రెండు ననుపది యేడవయవములు గలిగియుండును. మనోబుద్ధులతోఁ జిత్తము నహంకారముఁ గలిసి పందొమ్మిదని కొందఱందురు. ఈనాల్గింటికే యంతఃకరణచతుష్టయమని పేరు. శ్రోత్రము, త్వక్, చక్షుస్సు, జిహ్వా, ఘ్రాణము లను నైదును జ్ఞానేంద్రియములనఁబడును. వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థయను నయిదును కర్మేంద్రియములు. ఈయింద్రియములు పదియు మనకంటికిఁ గనిపించుటచే నివి స్థూలదేహముయొక్క యవయవములే కాని సూక్ష్మదేహముయొక్క యవయవములని యెట్లు చెప్పెదరందువేని వినుము.

ఒకఁడు ముక్కు బాగుగనున్నను వాసనను గనిపెట్టలేడు. చెవి బాగుగనున్నను వినలేడు. చేయి బాగుగనున్నను బనిచేయలేడు. కాళ్లు పొడుగుగఁ గనిపించుచున్నను నడువలేడు. ఈవిషయ మందఱును దెలిసినదేకద. ఇట్టివ్యత్యయ మేలకలిగెనందువా? మనకుఁగనిపించెడి నాసిక మొదలగునవి యాయాయింద్రియములుండేస్థలములు (గోళకములు) ఇవి బాగుగనున్నను రొంప మొదలగువానిచే నాయాయింద్రియములకుఁ గలిగినయాటంకమువలన నాయింద్రియములు పనిచేయఁజాలకయున్నవి. కనుక నీశ్రోత్రనాసికాదిగోళకములయందున్న యింద్రియములు తాము సూక్ష్మములుగనుండి సూక్ష్మదేహావయవములేకాని స్థూలదేహావయవములు కావు. సూక్ష్మదేహమునకవయవములగు శ్రోత్రము త్వక్కు చక్షుస్సు మొదలగునింద్రియములచే ననుభవింపఁబడు శబ్దస్పర్శరూపాదు లొకప్పుడు సుఖమునిచ్చును. మఱియొకప్పుడు దుఃఖమునిచ్చును. ఈశబ్దస్పర్శాదులు విషయములనఁబడును. ఇవి వచ్చుచుఁ బోవుచునుండుటచేత నిత్యములు కావు.

## విమర్శనమననేది?

పాఠకమహాశయులారా! పండితులారా!

నేను చాలకాలమునుండియు నేదోయొక వ్యాసమును వ్రాసి ప్రచురింపవలెననెడి కుతూహలముతోఁ బ్రయత్నము చేయుచున్నాడను. కాని ధైర్యము మాని వ్రాయసాహసించనైతి. దీనికిఁ బ్రథమకారణము పండితవర్యులకు రుచింపదనియెడి భీతియే. రెండవది విమర్శకుల దారుణశంకాకృపాణప్రహారము. విమర్శకులు విమర్శింపఁగూడదని నాయభిప్రాయము కాదు. చక్కఁగ విమర్శించి దోషాదోషములను నిరూపించిన నెవరును నోరెత్తలేరు. అట్లుచేయుటకు బదులుగ "ఇచ్చట శకటరేఫము లేదు. అచ్చట నరసున్న లేదు. కొన్నికొన్నిచోట్లల సంధిచేయుట మానెను. ఇట్టి కించిజ్ఞులు గ్రంథములనువ్రాయుట మొదలిడినది మొదలాంధ్రభాషావధూటికి మేలిమిబంగారునగ లడుగంటి మాయనగలుంచుకొనుట తటస్థించినది. ప్రథమముగ గ్రంథమును రచింపఁ బూనుకొనలేదని తెలిసియు నిట్టిగ్రంథములను వ్రాయనను కట్టుట ప్రాచీనకవులకుఁ గొఱంతఁ దెచ్చుటయేకాని గ్రంథకారుని శేముషీవిశేషమును వెల్లడిచేయుటకుఁ గాద" ని వార్తాపత్రికలలో వ్యాసములు వెలువడుననుటకు సందియము లేదు. కాని 'ప్రమాదో ధీమతామపి' యను నార్యోక్తి ననుసరించి వ్యాసకారుని తెలివితేటలను గనుఁగొని శక్త్యనుసారముగ వ్రాసెనా లేదా యని చూచుమహానీయులు లెక్కకుఁ దక్కువగా నున్నారు. వ్యాసమువ్రాయునతని తెలివితేట లాతనివ్యాసమువలననే కనుఁగొనవచ్చును. కాని నిష్పక్షపాతబుద్ధితో వ్యాసమును చదువువారు తక్కువగా నున్నారు. పైనుది

విన రెండుకారణములచేతను నేను నేటివఱకు నెట్టివ్యాసమును వ్రాయ నుద్యమించలేదు.

ఎన్నిదినము లిటుల నూరకుందును. నానేర్చినకొలఁది నాయభిప్రాయములను బండితులకుఁ జూపి వారియనుమతింబడసి యజ్ఞానమును బోఁగొట్టుకొనుటకు వేరుమార్గము తెలియమింజేసి నేటికి సాహసించితిని. "ఉద్యమేనహి సిధ్యంతి కార్యాణి నమనోరథైః" అనుదానిననుసరించి వ్యాసమును వ్రాయఁబూనితిని. ఇంతియకాక కవిశిరోభూషణమగు కాళిదాసు "ఆపరితోషా ద్విదుషాం నసాధుమన్యే ప్రయోగ విజ్ఞానం" అనివ్రాసెను. అట్టిమహనీయుఁడే పండితులను సంతోషపెట్టుట కష్టమనుచుండఁగా నేమియుఁదెలియని నేను సంతోషపెట్టలేకపోయిన నొకలోటుగాదని నిశ్చయించుకొంటిని. ప్రాయికముగ నందఱును "అనంతాః కాళిదాసస్య దోషాః" యని చెప్పుదురు. సాక్షాత్కరించిన సరస్వతియే యని యూహింపఁబడు నామహామహునికే తప్పులనంతములుండఁగా నక్షరజ్ఞానములేని నాఁబోటివానికి నిర్దుష్టముగ వ్రాయుసామర్థ్య మెటులలవడును? కాళిదాసుఁడే తప్పులువ్రాసెనుచుండెఁగదా నేను వ్రాసిననరా?" అని యూరకొనుట మంచిదికాదుగదా. "సాధకమునఁబనులు సమకూరుధరలోన" నని వేమన వ్రాసియున్నాఁడు. కాఁబట్టి గుణగ్రహణపారీణులగు పండితవర్యులు చెఱుకురసమును గ్రహించి పిప్పిని పారవేయునటుల నావ్యాసముసందలి గుణములను గ్రహించి తప్పులను మన్నింపఁబ్రార్థితులు

ప్రతిభాషకును వన్నెఁదెచ్చునవి కావ్యములే. మనుజు లొండొరులతోఁ దమయభిప్రాయములను జెప్పుకొనుచునే యుండిరిగదా. ప్రత్యేకముగ నేల వ్రాయవలెనని నీకాలపుకవి తనయూశయములను వేయిసంవత్సరముల యనంతరమున వచ్చువారితోఁ జెప్పగ్రంథముల

మాలమునఁగాక వేరొండువిధముగ నెట్లు మాట్లాడఁగలఁడు ? పూర్వచర్యల నన్నిఁటిని జక్కఁగ విమర్శించి తనకాలపువానితోఁ జెప్పించి. వీనినిబట్టి రాఁబోవునది గుర్తించి కవిగ్రంథరచన చేయనారంభించును. కాబట్టి కావ్యములనుఁ జదువుటవలన భాషాజ్ఞానాభివృద్ధియగుటయేకాక యాయాకాలపు టవస్థలను గుర్తించి ప్రస్తుతపునడవడికలను సవరించుకొనుటగూడ సంభవించును. కావ్యములు నీతినిగూడ బోధించును. కాఁబట్టి యన్నివిధముల నుపయోగించుగ్రంథము లందఱికిని బఠనీయములు. కాని యందఱును గుణాగుణములను జక్కఁగఁ బరిశీలింపలేరు. లోకములో నందఱును బండితులు కారుగదా. సామాన్యజ్ఞానము కలమనుజులకుఁ గవియభిప్రాయములను వెల్లడిఁజేయుటకుఁ దగిన భాషాపరిజ్ఞాతలగు చక్కనివిమర్శకులు ముఖ్యముగా నుండవలెను.

విమర్శకునికి ముఖ్యముగాఁ గూలంకషమైన పాండిత్య ముండవలెను. అన్నిశాస్త్రములలోని సాంప్రదాయముల నతఁ డెఱిఁగియుండవలెను. అలంకారశాస్త్రము తెలియనిది నాయికానాయక విచక్షణాదక్షతగాని శబ్దాలంకారార్థాలంకారభేదమునుగాని నియమమునుగాని గుర్తించుట యసాధ్యము. వ్యాకరణజ్ఞానము లేకుండగ గ్రంథము వ్రాయుట కష్టము. ఈవిధముననే కవికిఁ బాండిత్యము పూర్ణముగ నుండవలెను. విమర్శకుఁ గడంగినవారిలోఁ జాలమంది ప్రసిద్ధికెక్కినపండితులే. ఇట్టిపండితులున్నను నాంధ్రభాషయందు విమర్శకు లంతగా లేరేయని ప్రశ్నింపవచ్చును. ఆంధ్రకవులందఱు నొకానొకప్రభువు నాశ్రయించుకొనియుండిరి. ఆస్థానకవులు ప్రభువులయుల్లంబులను రంజిల్లఁజేయునటుల శృంగారపద్యములను జెప్పినవారికి రుచించునుగాని విమర్శనముచేసిన సంతోషము పుట్టునుగదా. అందఱును గృష్ణరాయ

లయంతటివారై యుండరుగదా. ప్రభువుల నాశ్రయింపక పండితుల కు సంసారపువెచ్చము గడియదుగదా. బమ్మెరపోతరాజుభంగి నంద ఱు నుండుట తటస్థించదు. ఆంధ్రకవులు సంస్కృతకవుల ననుసరించి గ్రంథములను వ్రాయుచుండిరి. సంస్కృతములో విమర్శనగ్రంథము లంతగాలేవు. కాని యచ్చటచ్చట లక్షణగ్రంథములను వ్రాయువారు కుకవుల పైనుండెడి తమయభిప్రాయములను వెల్లడిచేయుచుండెడివారు. వారిగ్రంథముల నామూలాగ్రముగఁ బఠించి గుణదోషనిర్ధారణ సమ గ్రముగఁ జేయుటలేదు. ఆవిధముననే యాంధ్రమునందును విమర్శనము లు విరళముగా నుండిరి. నన్నయాదులను స్తుతించుటకు వారిపాండితీ మహిమయే కారణము. పోతరాజు గ్రంథము సలక్షణముగాదనుట కందుఁ గొన్నియెడల రేఫశకటరేఫముల భేదమును పాటింపకుండుట యే కారణము. ఈవిధముననే విమర్శన మొకటిరెండుపద్దెములతోఁ బూర్తియగుచున్నది. అల్లసానివాని యల్లిక జిగిబిగి మొదలగునవి విమర్శనములోనికి వచ్చునుగాని విమర్శనమన నంతటితో సరిపోదు. ఆంగ్లేయభాషలోఁగూడ విమర్శనము మొట్టమొదట నిట్లనే యుం డెను. పదునాఱవశతాబ్దములోని విమర్శకులు విల్సను మొదలగువారు కేవలము శబ్దములనే విమర్శించుచుండిరి. «ఈశబ్ద మన్యభాషలోనిది ఆవృత్తము మనభాషలో నుండఁగూడదు. ప్రాసలేనిది పద్దెముచెప్పఁ గూడదు" ని చర్చించుచుండిరి. కాఁబట్టి విమర్శనము శైశవదశలోఁ బ్రౌఢముగా నుండదు. రాను రాను పందొమ్మిదవశతాబ్దముతో 'హ జ్లెట్' 'జాన్సన్' 'కార్లైల్' 'ఆర్నాల్డు' మొదలగుమహనీయులు గ్రంథవిమర్శనమును చక్కఁగఁజేసి విమర్శించుటకుఁ గొన్నిచట్టముల నే ర్పఱచి గ్రంథములను విమర్శించి గొప్పగొప్పపొత్తములను వ్రాసిరి. మనభాషలో విమర్శనము ప్రథమావస్థలో నున్నది. ప్రస్తుతపువిమ

శ్రీవిద్యాపీఠ పుస్తక...
రాజమహేంద్రవరము.



ర్శనము కేవలము పదప్రయోగమును జర్చించుటయం దుపయోగింప బడుచున్నది.

ఇంతియకాక విమర్శగ్రంథము లాంధ్రమున నంతగాలేనందున కెన్నియో కారణములుగలవు. తెనాలిరామలింగకవి తనకవిత్వము నిర్దోషమయినదనియు నందుఁ దప్పుచెప్పునతని జెంపలపైఁ గొట్టుదు ననియు నుద్ఘోషించెను. అట్టిమహానీయుఁడు "కావుకవిత్వవుమాటలు చావనకవివరుల చెవికిఁ బ్రియదంబిడునే?" యని యనవలసివచ్చెను. కవిత్వ మెవరుచెప్పిననేమి? సరసముగా నున్నదా లేదా యని చూడ వలెనుగాని కవికులశీలాదులతో విమర్శకున కేమిపని? విమర్శించిననిట్టి యవమానము జరుగునేమో యని కొందఱు మానిరి. "సాక్షాత్కరించిన సరస్వతియగు నామహామహునిగ్రంథము విమర్శింప నేటివర కెవరును లేరుగాని నేటికీవిద్వచ్ఛిఖామణి లేచెనయ్యా" యని పరిహాసించువారు కొందఱు గలరు. కొంతమంది "తిట్టులనెడి కంసాలి సుత్తెపెట్టులకును బొబ్బలనెడు పిరంగిగుండుదెబ్బలకును" భయంపడి నోరెత్తఁజాలరైరి. "పూర్వకవులను విమర్శించునంతటివారమా?" యని కొందఱూరకయుండిరి. కొన్నికొన్నివిమర్శనము లిటీవల బయలుదేరినవి యీర్ష్యాపురస్కృతములై యున్నవి. "జపమువిడచి లొట్టలలోదిగె" నన్నటుల మార్గ మతిక్రమింపఁబడెను. కాఁబట్టి తెలుఁగుభాషయందు గ్రంథములుగాని పండితులుగాని లేకపోలేదు. మహావిద్వాంసులున్న నేదియో యొకకారణముచేత వారేమియు ననఁజాలక యూరకుండిరి. ప్రస్తుతపుటంశమునకు రాఁగా గవికంటె నొక్కొకచోట విమర్శకుఁ డెక్కువజ్ఞానము కలవాఁడుగ నుండవలెను. కవి యేశాస్త్ర సాంప్రదాయము ననుసరించి చెప్పెనో విమర్శించుట సులభసాధ్యము గాదు. కవికంటె విమర్శకుఁ డెక్కువ నేర్పరియైనఁగాని

కవిహృదయముం జొచ్చి యందలి యమూల్యార్థములను దనప్రజ్ఞావిశేషముచే నిదమిత్థమని నిరూపించి లోకులకు వానివిలువ యిట్టిదని చెప్పుట తటస్థింపదు. కాఁబట్టి విమర్శకుఁ డన్నివిద్యలలోను సాధ్యమయినంతమట్టునకుఁ బ్రవేశము గనియుండుట మంచిది.

కేవలము పాండితీపరీక్ష యొక్కటియే విమర్శకునకుఁ జాలదు. విద్వాంసుఁడగు విమర్శకుఁడు నిష్పక్షపాతబుద్ధికలవాఁడై యుండినఁ గాని కావ్యమునుఁ జక్కఁగ విమర్శింపనేరఁడు.

కావున నొకపక్షమును దీసికొనక కావ్యముయొక్క గుణాగుణములను స్వభానుగుణముగఁ జర్చించి యందలి యభిప్రాయములు లోకసమ్మతమయినవియా కావా యనునంశమున దృష్టినిలిపి కావ్యమును జదువుటయందుఁ జదువరుల కెక్కువ యభిరుచిని గలిగించుటకుఁ దోడ్పడునట్టి విమర్శనమే విమర్శనము. తదితరములు ఖండనములో మండనములో యగును గాని విమర్శనములు గానేరవు.

# హాంపి.

ఆంధ్రభోజుఁ డనివాసికెక్కిన కృష్ణదేవరాయని రాజధానియైన విజయనగరము నేఁడు నామమాత్రావశిష్టమై హాంపియనునామాంతరమున నొకచిన్నపల్లెయై యున్నది. అయినను బూర్వకాలమున మహావైభవము ననుభవించిన యానగరము నాశనమయిపోయినను జూపరులకుఁ గనువిందువు సేయుచుఁ గొన్నిభాగము లిప్పటికిని రమ్యములై యొప్పుచున్నవి. రెండువందలముప్పదివత్సరములు మిక్కిలివైభవముతో రాజ్యముచేసిన విజయనగరసంస్థానాధీశు లచ్చటఁ గట్టిన సుందరములయిన దేవాలయములయొక్కయు ప్రాసాదములయొక్కయు జాడలు గాన్పించుటయేకాక కొన్నియథాస్థితిలోనే రక్షింపఁబడుచుండుటచే వానిని జూచినవారికిఁ బూర్వపుటాంధ్రులయొక్క కళానైపుణ్యము స్పష్టముగ గోచరింపకపోదు.

హాంపి బళ్లారిజిల్లాలోని హొసుపేట రైలుస్టేషనున కేడుమైళ్ళదూరమునున్నది. అచ్చటఁ గానిపించు కట్టడములలో ముఖ్యమయినదొకవిష్ణ్వాలయము. దేవునిపేరు మహారాష్ట్రమునం దంతటను బ్రసిద్ధికెక్కిన విఠ్ఠలస్వామి. అది క్రీస్తుశకము 1530 వ సంవత్సరమునఁ గట్టఁబడెను. కట్టడ మప్పటినుండి యిప్పటివరకు నసంపూర్తిగనే యున్నది. అదియంతయు నల్లరాతితోఁ గట్టఁబడి పెద్దదికాకపోయినను హిందూదేశములోని యందమయిన దేవాలయములలో నొక్కటిగనున్నది. దానిముఖమంటపముయొక్కయలంకారము మిక్కిలి విలువ గలిగియున్నది. సింహద్వారము చొరఁబోవునప్పుడు కుడిప్రక్కను రథము గాన్పించును. ఈరథము చక్రములుతప్ప మిగిలినభాగమంతయు

నొక్క రాతినిదొలిచి చేయఁబడినది.

రాజభవనములుమున్నగునవి విశిష్టిగ నక్కడక్కడ నొక్కొక్కటిగ నున్నవి. ఇందుఁ జిన్నగుడారమువంటియిండ్లు, స్నానపుగదులు, సభామంటపములు, అంతఃపురములు, మొదలగునవి యనేకములున్నవి. ఇవియన్నియుఁ బూర్వకాలమున దారు నిర్మితములగువంతెనలతో నొకదానికొకటి కలుపఁబడియుండును. ఇప్పుడావంతెనలు నాశనములగుటచే నవియెచ్చటను గాన్పింపవు. ఆకట్టడముల యాకారము కేవలము హిందూపద్ధతికాక విదేశపద్ధతితో మిశ్రమమయి మిక్కిలి యందముగనుండును. అట్టికట్టడములు హిందూదేశమున మరెచ్చటను గానరావు. ఈకట్టడములనుగురించి బళ్ళారిడిస్ట్రిక్టు 'మ్యాన్యుఅల్' (District Manual) లో నీక్రిందివిధముగఁ దెలుపఁబడినది.

"ఈకట్టడములు పూర్వ మెందుకొఱకుఁ గట్టఁబడెనో తెలిసికొనుట కిష్టసాధ్యమగునట్లుగ నాశనమయిపోయినవి. శిల్పిశాస్త్రాశలమును, వానిని గట్టుట కుపయోగించిన పెద్దరాళ్ళను చూపరులదృష్టి నాకర్షింపకమానవు. కమలాపురసమీపమున నందమైన రాతితోఁ గట్టఁబడిన 'అక్విడక్టు' (Aqueduct) గలదు. పూర్వము స్నానమున కుపయోగపడు నొకగదికూడఁ గలదు. ద్వారములయొద్ద వటువ్రపలగు 'ఆర్చి' (Arches) లును, గదులలోనియందమగు చిత్తరువులు, నుపయోగపడుటఁ జూడ మహమ్మదీయులు దీనిని జాలవరకు మార్చిరో లేక పూర్తిగ మరలఁ గట్టిరో యని తలంచవలసియున్నది. దీనికిఁ గొంచెము దక్షిణముగ నొక యందమయిన దేవాలయముగలదు. అందుఁ బైగోడలమీఁదను లోపలను రామాయణములోని వేటముదలగుచర్యలను జూపుచిత్తరువులు చిత్రింపఁబడినవి. మధ్య మంటపమునందలి నాలుగుస్తంభములును నల్లరాతితోఁ జేయఁబడి యందముగ

మలపఁబడినవి. గుడిలో నేల పూర్వము రాతితోఁ దాపటము చేయఁబడినను, రాతియడుగున ధనము నిక్షిప్తమయి యుండుననునాశచే నా రాళ్లన్నియుఁ దవ్వఁబడి నేలయంతయు నిప్పుడు పాడయిపోయినది. దానిసమీపముననున్న మరియొకకట్టడముయొక్క యుపయోగ మెవ్వరికిని దెలియకున్నది. అందు నేలసొరంగము లనేకము లున్నవి. దానిలోఁగూడ ననేకచిత్తరువులున్నవి. అందొకసింహము చిత్రింపఁబడినది. ఏనుగులసాలయను పేరఁబరగు మరియొకకట్టడము దానికి సమీపముననే యున్నది. అది పూర్వ మేనుగులకే యుపయోగపడినదనుటకు వీలుగనే యున్నది. ఏనుగులసాలతోఁ గలిసి యొకచతురముయొక్క మూఁడుప్రక్కలుగఁ గానిపించు రెండుకట్టడములు సమీపముననున్నవి. అందొకటి సంగీతశాలయు రెండవది సభామంటపమునై యున్నవి. అవి రెండును, ముఖ్యముగా సభామంటపము, మిక్కిలి యందముగలవి.

పైనఁ దెలుపఁబడినవే కాక జనానాయొక్కయు, మల్లయుద్ధము మున్నగు వినోదములు జరుగుట కుపయోగపడు రంగస్థలముయొక్కయు శిథిలములయిన యానవాళ్లిప్పటికిని గానిపించుచున్నవి. అన్నిఁటికంటె వినోదమును గొల్పునవి వివిధములయిన పనుల కుపయోగపడు పెద్దరాళ్లు. అందొక పెద్దరాయి నలుబదియొకటింబాతిక యడుగులు పొడుగుగలది నీటితొట్టెకై దొలుపఁబడినది. ముప్పదియైదడుగులయెత్తుగల శివవిగ్రహ మొకటికలదు. రోడ్డునకు రెండుప్రక్కలను రెండు దేవాలయము లున్నవి. వానినిగట్టుట కుపయోగపడినరాళ్లు మిక్కిలి పెద్దవియై యున్నవి. అందుఁ గొన్ని ముప్పదియడుగులపొడవును నాలుగడుగుల దళసరియును గల్గి గోడలమీఁద నెత్తుగఁ గాన్పించుచున్నవి. అవి యట్టియెత్తైనస్థలమున కేవిధముగ నెడలినవో తెలియుట

విస్తారముగ నున్నది. ఇంకను గొన్ని దేవాలయములు శిథిలముకాకుండఁ గాపాడఁబడినవి అందు రాజగృహమునకు ముప్పాతిక మైలు దూరమునను, నదీసమీపమునను, నున్న విష్ణ్వాలయ మొకటిగలదు. అది యంతయు నల్లరాతితోఁ గట్టఁబడినది. అందు బాగుగఁ జిత్రింపఁబడిన పెద్ద నల్లరాళ్లు గొన్నిగలవు. విజయనగరచరిత్రమునకు హంపి యందలి శిలాశాసనములు చాల సహాయకారులయ్యెను."

ఈగ్రామము చిన్నదియయ్యును బ్రతిసంవత్సరము నిచట నొక గొప్పతీర్థము జరుగును.

## పాఠశాలలందలివిద్య : మానసికశాస్త్రము.

## Education and Psychology.

మనరాజధానియం దెన్నియోబడులును, సర్వకళాశాలలును బయలువడియున్నవి. బయలువడుచున్నవి. అందుద్యోగముగలయొజ్జలు పూర్వరీతిగనే యిప్పుడును బాఠములఁ జెప్పుచున్నారనికాని చదువుకొనుబాలురు పూర్వమువలెనే యిప్పుడును విద్య గఱచుచున్నారని కాని తలఁపవలనుపడదు. పూర్వపుపద్ధతులకును నిప్పటిమార్గములకును జాలభేదము గలదు. చిరకాల సంచితానుభవజ్ఞానఫలంబుగా నవీనులు దేశకాలపాత్రములననుసరించి బడులందు బోధింపఁబడుగ్రంథముల నిర్ణయించుటయందును బోధనాపద్ధతులయందును ననేకరీతుల మార్పులు గలిగించుచున్నారు. తదనుకూలముగనే పాఠశాలాధికారులు విద్యావిషయమునఁ గ్రొత్తగా ననేకములగుచట్టముల నేర్పఱచుచున్నారు. విద్యావిషయమున (ననగా విద్యోద్దేశము, శిక్షాక్రమము, ఫలప్రాప్తియనువిషయములయందు) బూర్వులకును నవీనులకును భిన్నాభిప్రాయములు గలవుగావునఁ దద్విషయమున నవీనులకుఁగల క్రొత్తయభిప్రాయములును బద్ధతులు నించుక తెలిసికొందము.

ఇప్పటి విద్యాపద్ధతులయందుఁ బ్రధానముగాఁ గానవచ్చెడు మార్పుల కాధారము మానసిక (Psychological) శాస్త్రజ్ఞానము, మానస శాస్త్రజ్ఞానమునకు విద్యాబోధకు నన్యోన్యసంబంధము గలదని శాస్త్రజ్ఞులు గనుఁగొనియున్నారు. అందులకుఁ దార్కాణముగ నాశాస్త్రమునందలి సిద్ధాంతములు మూఁడు విద్యాబోధయందవధరింపఁదగిన ప్రధానాంశములని కళాశాలాధికారులు తలంచి యాయంశ

ముల నాచరణమునకుఁ దెచ్చి తదభివృద్ధికి పలయుప్రయత్నములు సర్వవిధములఁ గావింపుచున్నారు. ఆయంశము లెవ్వియన :—(1) మనస్సునకు దేహమునకు నన్యోన్యసంబంధము గలిగియుండుట (2) మనోవ్యాపారమునకు మేధస్సు (మెదడు) ముఖ్యోపకరణముగానుండుట (3) వృక్షములు జంతువులు మున్నగు ప్రత్యక్షజీవకోటులవలె మనస్సు కూడ జీవిలక్షణములఁ గనుపరచుట—అనఁగా జన్మవృద్ధిక్షయములఁ గాంచుట.

మొదటియంశము చర్చించి చూతము. మనస్సునకు దేహమునకు నన్యోన్యసంబంధము గలదనువిషయము క్రొత్తక్రొత్తగ సిద్ధాంతము చేయఁబడియున్నదికాని యింకను సమగ్రముగ నాచరణమునకు రాలేదు. పూర్వులు మనోవ్యాపారములకును దేహవ్యాపారములకును సంబంధము లేదనుటయేకాక మనోబల మభివృద్ధికావలెనన్న దేహాభివృద్ధిగలుగుట యసంభవమనియు దేహదార్ఢ్య మపేక్షించిన మనోబల మభివృద్ధియగుట యసంభవమనియు, దేహబలమక్కరలేకయే మనోబలము వృద్ధిచేయవచ్చుననియు, మనోబలమక్కరలేకయే దేహబలము వృద్ధిచేయవచ్చుననియుఁ, దలఁచి దేహదౌర్బల్యము కలిగినను లక్ష్యముసేయక మనోబలము మిక్కుటముగ వృద్ధిసేయవలయునని ప్రబలమగువాంఛ కలిగియుండి యది సిద్ధించుటకుఁ దగినప్రయత్నములు సేయుచుండెడివారు. మొన్న మొన్నటివఱకు నింద్రియములుజ్ఞానసంపాదనమునకు ముఖ్యసాధనములనుమాట తెలిసికొనఁబడమి గతానుగతంబుగ నాదినుండియు సంచితము సేయఁబడిన గ్రాంథిక వ్యవహారార్థబోధనమే యాధారముగ నుండెనుగాని జ్ఞానాభివృద్ధికిఁబ్రకృతిపరిశీలన మాధారముగ నుండలేదు. నూత్నమతానుసారముగ మనోబలదేహబలంబులకుఁ గల యన్యోన్యాశ్రయధర్మపరిజ్ఞానముం

బట్టి పాఠశాలలందుఁ గ్రొత్తక్రొత్తగ మార్పులు జరుగుచున్నవి. వాని లో ముఖ్యములఁ గొన్నిటిఁ దెలుపుదము. పాఠశాలలందు బాలుర యారోగ్యస్థితి చక్కగనుండుటకుఁ దగిన యేర్పాటులన్నియు నుండ వలయును. బాలురు కూర్చుండుగదులు విశాలముగా నుండవలయును, గాని వారలు క్రిక్కిరిసి బాధపడునటు లుండరాదు. గదులయందుఁ గూర్చుండుబాలురకు గదిలోనిపదార్థములును గ్రంథములయందును నల్లబల్ల (Black board.) లమీఁదను లిఖియింపఁబడునక్షరములును స్పష్టముగాఁ గనుపడుటకు నేత్రములకు బాధగలుగకుండునంతటి వె లుఁగువచ్చునటుల గదుల నిర్మింపవలయును. గదులయందుఁ బరిశుభ్ర వాయు సమృద్ధిగలుగుటవలన నారోగ్యముగలుగునటుల వాయుమార్గ ముననవాతాయనములలవరచుట, పాఠశాలాంగణము విశాలముగా నుంచుట, చుట్టుఁబ్రక్కల ననారోగ్యస్థలములు లేనితావునఁ బాఠ శాల నిర్మించుట, పాఠశాలయందుఁ జిత్రవిచిత్రములగు లతాదులుగల యారామ మొకదానిఁ బెంచుట, పాఠశాలలందభిరామంబుగా శిల్ప చాతుర్యంబుల నలవరచుట; బాలురు కూర్చుండుగదులు మనోహరం బుగ నలంకరించుట, దిక్కుమాలిన పేదబాలురకు సన్నవస్త్రాదికము లిప్పించి వారిలేమివాపుట, వయసు నతిక్రమించి దురవగాహమగు విద్య బాలురకుఁ జెప్పవలనుపడదనియు, వారలకుఁ దగినవిశ్రాంతి యొసఁగకుండఁ దదేకదీక్షగ వారిఁ జదివింపఁదగదనియుఁ జట్టము లే ర్పరచుట, మఱియు బాలురదేహబలాభివృద్ధిజనకములగు మంచిమంచి యాటలును దేహబలప్రదర్శనమున గౌరవముఁదెచ్చు వ్యాయామం బులును బడులందుఁ జదువుతోఁబాటు ప్రధానాంగములుగాఁ బరిగ ణింపఁబడవలయునని యేర్పాటుల విధించుట. మనస్సునకును దేహ మునకును గలయన్యోన్యసంబంధము గ్రహియింపఁబడుటవలననే యి

వ్వుడిప్పుడు బాలుర దేహబలసంరక్షణముకూడ విద్యాబోధయందుఁ బ్రధానావయవముగాఁ బరిగణింపఁబడి యందులకు వలయుమార్గము లేర్పఱుపఁబడుచున్నవి. నవీనపాఠశాలాక్రమశిక్షయందు జ్ఞానము సంపాదించుకొనుట కింద్రియపాటవ మభివృద్ధిసేయవలయుననుట ముఖ్యాంశముగా నున్నది. అందులకు నిదర్శనముగఁ బ్రతిశాస్త్రమునందును బ్రత్యంశమునందును నోజ్జలు తామొసంగు కేవల బోధాధారముననేకాక బాలురకు హస్తలాఘవాదికౌశలముసంఘటించు క్రియామూలమునఁగూడ జ్ఞానాభివృద్ధి యొనరించుటకుఁ దగినపనులు బాలురకు బడులందు నియమింపఁబడుచున్నవి. బాలు రీకాలమునఁ బ్రత్యక్ష క్రియాపర్యవసానములు స్వయముగ గ్రహియించి యింద్రియవ్యాపారకౌశల్యమునఁ గరతలామలకముగ జ్ఞానము నంపాదించుకొనుచున్నారు.

ఇంతవఱకు మనస్సునకును దేహమునకును గలయన్యోన్యసంబంధముంగూర్చి ముచ్చటించితిమి. ఇఁక రెండవయంశము చర్చించిచూతము. మనస్సునకును mind) మేధస్సునకును (brain) పరస్పరసంబంధము విశేషముగ నున్నది. మేధస్సును, మేధస్సునుండి బయలువెడలి పాయలై శరీరమందంతటను వ్యాపించునాడీకూటమును (Nervous system) మనస్సున కాధారములయి మనోవ్యాపారములకు ముఖ్యసాధనములగుచున్నవి. మేధస్సునకును మనస్సునకు నన్యోన్యము సంబంధము గలదని సిద్ధాంతముచేయుట కెన్నియో నిదర్శనములు కనుగొనఁబడియున్నవి. మేధస్సునందలి వివిధభాగముల కపాయము సంభవించునెడల నయ్యాభాగములకు సంబంధించిన మనోవ్యాపారములకుమాత్రమే భంగముకలుగుట కానవచ్చెడిని. మేధస్సునఁ జెందినభాగము జిహ్వతో సంబంధముకలుగునెడల నోరుమూతపడి మా

టరాకుండుటయు, వేఱొకభాగమునకు బ్రమాదము తటస్థించినయెడల మనుజుఁడు తానెవఁడో తెలియక తనకు నితరప్రపంచమునకుఁ గలసంబంధమెల్ల మారుటచే నిదమిత్థమనుజ్ఞానము లేకపోవుటయుఁ గూడఁ దటస్థించును. మనోవ్యాపారము సరిగలేనివానిని మట్టిబుఱ్ఱగల (అనగా మెదడులేని) వానిగను మనోవైభవముగలవానిని దెలివిగల వానిని మంచిమేధస్సుగలవానిగను దెలుపుచు మెదడే మనస్సనియు మనస్సే మేధస్సనియు నభిప్రాయముఁ జూపునట్లుగ నాపదములయం దభేదబుద్ధిఁ దెలిపి వాని నుపయోగించుచుందుము. ఇయ్యదికూడ నారెంటికిని సంబంధాతిశయము మిక్కుటమనియే సూచించెడిని. మనస్సునకు మేధస్సునకుఁ గలసంబంధాతిశయము చూడఁగా మనోవ్యాపారములు దేహాపేక్ష లేకయే జరుగుననికాని దేహవ్యాపారములకు భిన్నములయి విరుద్ధములుగ నుండుననికాని తలంచుటకు వీలులేదనియు మనోవ్యాపారములు చక్కఁగ నుండవలయుననినఁ దదనుకూల దేహావయవవ్యాపారములు తప్పక దార్ఢ్యము గలిగియుండవలయుననియు నధునాతనశాస్త్రజ్ఞులు కనుగొనియున్నారు. మేధస్సు దేహమునకు సంబంధించిన గోచరపదార్థమగుటవలనను మనస్సు గోచరముకాకపోయినను మేధస్సు నాధారముచేసికొనుటవలనను దేహబల మభివృద్ధియగునపుడు మేధస్సు వృద్ధియగుటయు నందువలన దానినాధారముచేసికొనిన మనస్సుకూడ మిగుల వృద్ధిఁగాంచుటయుఁ గాననగును.మనోవ్యాపారముగాని మనోవికారముగాని కేవల మానసికమునుగాదు. కేవల శారీరకమును గాదు.అయ్యది మానసికశారీరక (**Psycho-Physical**) సంబంధముగలిగి బయలుకెడలుచుండును. పూర్వకాలమందు మనోవృత్తి శరీరసంబంధములేని కేవల శుద్ధమనస్తత్వముగానే పరిగణింపఁబడుటవలన దానికిసంబంధించిన శారీరకం

బించుకేనియు సరకు గొనంబడదయ్యెను. అందువలన నప్పటియొజ్జలొక్కయంశముమాత్రమే (the Physical part only) యభివృద్ధి నొందించుటకుఁ దగినపద్ధతులనే యవలంబించుటవలన వారిమార్గములును దత్క్రియాపర్యవసానములును సమగ్రములు కావయ్యెను. మనోవ్యాపారములు జరుగుట కాధారభూతమగు నాడీకూటము భాగవిభాగాన్యోన్యసంబంధముగలిగి యభేద్యవ్యూహముగల యొకయంత్రమువలె నున్నది. గడియారమునం దొకచిన్నచక్రము కదలునంతనాకదలిక యాగడియారమునందలి చక్రంబులకెల్ల వ్యాపించునటుల నీనాడీకూటయంత్రమునం దెచ్చటనైన నొకవికారము గలిగిన నయ్యది నాడీకూటమునందంతటను వ్యాపించును. ఈనాడీకూటము పసిబాలురయందు మిగుల సున్నితముగా నుండును. ప్రజలబహిర్వ్యాపారములు బాలుర నాడీకూటముల నవలీలగఁ జలింపఁజేయఁగలవు. వీణెయయందలి తంత్రులవైణికుఁడు చక్కగఁ బలికించి మనోహరంబులగు రాగంబుల వెలువడఁజేయును. ప్రజ్ఞావిహీనుఁడు పలికింపబోయి తెలియక యాతంత్రులఁ ద్రెంచును. అటులనే నాడీతత్వ మెఱింగినయొజ్జలు బాలురమనోవైభవము పెంపుసేయుదురు. తెలియనివారు సుబోధ సేయనేరక బాలురమనంబులు చెడఁగొట్టుదురు. దేశకాలపాత్రముల ననుసరించి మేధస్సును నాడీకూటమును వానిదార్ఢ్యములును బహువిధములుగా నుండును. ఏబాలుఁ డెంతటి మనఃపరిశ్రమ కోర్చునను విషయ మొజ్జలు బాలుర వయస్సునుబట్టియు మేధస్సుయొక్క పరిమాణాదిలక్షణములఁబట్టియు నాడీకూటముయొక్క పాటవముఁబట్టియు నూహించుకొనవలయును.

# అంటుమామిడితోఁట.

చ. కనుఁగొన నీలమేఘముల ♦ కట్టవిధంబున దోఁచె, నల్లన
ల్లనఁ జనమధ్యమధ్యను జ ♦ లచ్ఛపలల్ కనుపించె; నేమి! విం
తనుచు దరిన్ జనంగ మల ♦ యానిలఁబోలుఁడు పూరజమ్ము గ్రొం
తనుగొని, యేగునాకు శకు ♦ నంబునుదీర్పఁగ మోదమంది యే
గి, నగుచు "నాకులన్ బసరు ♦ గీల్గొనఁ బూవులఁదాల్చియున్నమా
వినిచయమేకదా" యనుచు ♦ వెన్కకునేగఁగ నెంచి "మైననం
తనుగని యీవసంతునిగు ♦ ణంబున్నగాంతము" టంచుఁబోవఁగా
ననుఁ బిలువంగఁజొచ్చెను వ ♦ నప్రియ మొండుదవీయవాసుఁ; దో
డనె శుకభృంగముల్ గడబి ♦ డన్ వడిఁజేయఁగ నాలకించి చూ
చి, "ననుగనంబికంబు పిలి ♦ చెంగద యట్టులె యీశుకాళులున్
ననుఁగని ప్రేమఁ బిల్వక మ ♦ నంబున భీతినిగాంచ హేతువే
మ" నుచు వితర్కమొంది "తమ ♦ రన్నముగాగొనునాపలాలు తే
నెనుగొనువాడ నంచుగద ♦ నెవ్వగనొందెను; గోయిలింతయున్
గనెనొకొ కంపమున్! జిగురు ♦ గాంచుటచేఁగద నిండుకుండ లెం
దునుదోణకంగఁజూచునె ఘు ♦ నుల్ మొగమోటమిఁగాంతురొక్కొ స
జ్జనులరుదేరనంచు న ♦ విధంబున కేగగ నెఱ్ఱనౌచిగు
ళ్లును, బువురాశియున్, ఫలము ♦ లున్ గల శీర్షములన్ మహీజముల్
ఘనులగు గాయకుల్ తలలు ♦ గట్టిగనూచువిధాన నూపఁగాఁ;
గసలి తోఁటఁగు పాత్రదళ ♦ కాండము తావుల నచ్చటచ్చటన్
సొనవలె, ముగ్గరీతి, సుమ ♦ నోగతిఁ, గాంచి విశాలమామ్ర గు
చ్ఛనివహమ్మున్ హసించి తెగ ♦ సాగుచు నెఱ్ఱగనౌచిగుళ్లు లో
చనముల కింపొనర్ప నతి ♦ సంభ్రమవృత్తిని లోనికేగి కం
టిని దలపైకినెత్తి, యొక ♦ టేగతి వానఁగఁ దేనెసోనలన్
జనుకుచుఁ బూఁబరాగము వి ♦ శేషముగా నిడఁజిమ్ము చున్ బ్రవా

శనిచయమున్ దొలంచుచు ఫ ♦ లంబుల సారములేఱురీతిగాఁ
గొనకొని వెల్లిఁబుచ్చుచు న ♦ కుంఠితభక్తిని నాకుఁ బూజచే
సిన యలయంటుమామిడులఁ; ♦ చిత్తరువట్టుల నిల్చిపోయితిన్
మనమున మోదమందుచుఁ, జ ♦ నంగ నొకానొక యంటుమావిగు
న్నను, మఱి దానిపాదునఁ దొ ♦ ణంకక యుండెడు నీటిఁ గాంచి "దే
వునిమహిమంబు లద్భుతమ ♦ వున్ గద! చప్పనినీరుపోయఁ ది
య్యనిఫలసార మీకుజము ♦ లంత్యము లేక యొసంగు" నంచు నే
ననుకొని యంతటన్ దిరిగి ♦ యచ్చట నచ్చటనుండుపక్షిని
స్వనములు పాటపాడుగతి, ♦ వాద్యమురీతిని, తాళవృత్తిగా,
విని యివికాననేందిర న ♦ విభ్రమ నృత్యపు సాధనంబులౌ
నని కుతుకంబునొంది పయి ♦ నంతట నల్లనిచాందినీగతిన్
ఘనమగుపర్ణరాశిని న ♦ నల్ గ్రథియించినమౌక్తికాచ్ఛగు
చ్ఛవిచయమౌచునుండ ఫల ♦ సంచయముల్ తగుపారదంపు బు
డ్డనగను పిందియల్ మరక ♦ తామ్రములై వెలుఁగొందవహ్వారే?
గొనబగుచైత్రిక్రొంగొలువుఁ ♦ గూటముకాదొకొ? యివ్వనంబటం
చును బ్రతివృక్షముం గనుచు ♦ సుందరతన్ గనుఁగొంచునేగి క
మ్మనితియమామను, గన్నెరి, యి ♦ మామనుపసందును నీలపుంబసం
దును. చెదస్వర్ణరేఖయు వి ♦ నూతనమౌ నలపాదుషాపసం
దును, జినపెద్దగోవలును ♦ దొల్పటి బందరుబొండమల్లబం
గినపలి, యేనుగున్. జహా ♦ ముగీరుపసందులు నాదియైనచె
ట్లనుగని, యవ్వికాచినఫ ♦ లంబులఁజూచి తదీయమాధురీ
ఘనమహిమంబుఁ దోఁపఁగను ♦ గఱ్ఱునఁ దేనువువచ్చునట్లుగాఁ
తిని, ఫలపల్లవచ్ఛదవి ♦ తీర్ణములౌ నలయంటుమావులన్
జనఁగ ననుజ్ఞఁగోరి సుఖ ♦ సంపద మెచ్చితి నచ్చి నెచ్చెలీ!

# హిందూదేశీయార్థికశాస్త్రము.

## 1. ప్రాస్తావికప్రశంస.

దేశబంధువుల కొకచిన్నవిన్నపము. నేనీవ్యాసమునందుఁ జెప్పఁ బోవునది మీరిదివరలో వినియుండనిది కాదు. ఇతరులు చెప్పియుండనిది కాదు. కాని విరాట్పురుషుని స్వరూపనిర్ణయ మనంతస్తోత్రముల కెడమిాయున ట్లీదేశీయార్థికశాస్త్రముకూడ పెక్కుశాస్త్రజ్ఞులబుద్ధుల కతీతమయి యున్నది. ఎందఱు దానినిగుఱించి వ్రాసినను, నూతనములయిన యూహాలు పుట్టుచునేయుండును. ప్రాతసిద్ధాంతములు రూపాంతరములఁ బొందుచునేయుండును. కాన నిట్టిశాస్త్రమునుగుఱించి వ్రాయునపుడు ప్రాచీనములయిన సంగతులు దొర్లవచ్చును. క్రొత్తయూహాలు నంకురింపవచ్చును. కనుక సావధానచిత్తులరయి, యీక్రిందఁ జెప్పఁబోవువిషయమున లగ్నమనస్కులరయి చదువరులు నావాక్యముల మన్నింతురుగాక.

ఆర్థికశాస్త్రమే కడునవీనము. 'ఏడమ్‌స్మిత్' (Adam Smith) అను నింగ్లీషుశాస్త్రజ్ఞుఁడు 'దేశములయర్థసంపత్తి' (Wealth of Nations) యనుగ్రంథమును రచించుటకుఁబూర్వ మీశాస్త్రము విన్నవారును గన్నవారును లేరు. ఆతఁడువ్రాసినవిషయ మనిర్వాచ్య వేదాంతరహస్య మేమియును గాదుకాని, యిదివరలో రాజకీయవేత్తలును శాస్త్రజ్ఞులు నాలోచింపుచున్నవిషయమునే విపులముగను, శాస్త్రీయముగను, విమర్శనాపూర్వకముగను, నాతఁడు సిద్ధాంతీకరించెను. అప్పటినుండియే పండితులు దీని నొకశాస్త్రమని యొప్పుకొనిరి, తత్పూర్వ మిది శాస్త్రనామధేయమునకుఁ దగదనియే యనేకు లభి

ప్రియపడుచుండిరి. ఇటీవలకూడఁ బెక్కురు దీనిని తక్కినశాస్త్రము
లకంటె నొకవీసము తక్కువగఁ బరిగణించుచుండిరి కాని తరువాత
నందఱును నిరాటంకముగ దీని నొకశాస్త్రముగ నిర్ణయించి, దీనికిఁ
దగినగౌరవము నొసంగఁ బ్రారంభించిరి. రానురాను పాశ్చాత్యదేశము
లందంతటను గ్రిందటిశతాబ్దమునందిది వ్యాపించి శాఖోపశాఖలై
వృద్ధిఁగాంచెను, జర్మనీ, హాలెండు, ఫ్రాన్సు, అమెరికా మున్నగుదేశ
ములందనేకులు బయలుదేరి యీశాస్త్రీయాంశములఁ జర్చించిరి.
అటుపిమ్మటఁ గొంచె మించుమించుగ సర్వజనాదరణీయమయినయొక
సిద్ధాంతసంపుటియు, శాస్త్రసూత్రములు నేర్పడెను. అయినను, ఇవి
యన్నియుఁ బాశ్చాత్యదేశములకు సంబంధించిన మత, సాంఘిక, రాజ
కీయాచారపరీక్షవలనమాత్రమే యేర్పడెను గాన మనదేశమువంటి
ప్రాచ్యదేశములకును వానియాచారములకును సరిపడకపోయెను. పశ్చి
మవాసులకు సరిపడిన యీశాస్త్రసూత్రములు ప్రాచ్యులకు సరిపడక
పోవుటలో వింత యేమియులేదు. కాని పాశ్చాత్యశాస్త్రజ్ఞులు కొంద
ఱుమాత్ర మట్లొప్పుకొనఁజాలకుండిరి. తమశాస్త్రాంశములన్నియు
నన్నిదేశములకు నన్నిజాతులకుఁగూడ సరిపడుననియే వారు మూర్ఖ
ముగ వాదించుచుండిరి. మనప్రభుత్వమువారును వారిశిష్యులెయగుట
వలనఁ బ్రథమమున వీరును నటులనే దురభిప్రాయపడుచుండిరి. మన
సంఘము పాశ్చాత్యశాస్త్రమునకు విరుద్ధమగులక్షణములఁ గలిగియుం
డినచో దానిని సాగఁగొట్టి, విరుగఁగొట్టి, యేయుపాయమువలననో
పాశ్చాత్యసంఘముల ననుకరించునట్లు చేయుటయే ప్రభుత్వమువారి
పరమకర్తవ్యమనియు, దేశీయుల పరమావధియనియు వీరు బోధించు
చుండిరి. వానిప్రాగ్జనులు ప్రతీచీజను లెట్లుకాఁగలరు? జాతులు వివిధ
తరువులవంటివి. ఒకదానియభివృద్ధికిఁ గారణము రెండవదానికి నాశన
కరమగుచున్నది. పొడినేలలయందు గోధుమ పండుచున్నది. సరి

యెండుచున్నది. ఒకవిధమగు నెరువువలన నొకసస్యమభివృద్ధిఁ గాంచుచున్నది. రెండవది క్షీణించుచున్నది. పిండికి బెల్లమునకు నొకటే మంత్రిమాయనునట్లు తూర్పుదేశములకును, బశ్చిమదేశములకును నొక్కటియేపరిమాణమా? ఎన్నటికిని గానేరదు. దీనినే 'యార్థికశాస్త్రమునందలి చారిత్రకసిద్ధాంతపక్షమువారు' (Historical School of Political Economy) కనిపెట్టి పూర్వశాస్త్రకారుల వాదములను ఖండించుచు వచ్చిరి. 'ఫ్రెడరిక్ లిస్టు' (Frederick List) అనుజర్మనుశాస్త్రజ్ఞుఁ డీసిద్ధాంతముకొరకుఁ బ్రబలయుద్ధముల సల్పినవారిలో నొకఁడు. తరువాత మనదేశమందు మహాదేవగోవింద రెనడీ, దాదాభాయినౌరోజి మొదలుగాఁగల ప్రముఖు లీవిషయమునే బలపఱచి మనదేశమునకు సంబంధించిన యొకదేశీయార్థికశాస్త్రమునకుఁ బునాదులఁ గట్టిరి. తరువాత గోఖలే, బెనర్జీ, సర్కార్, కాళీ, వాచా, మున్నగువారు తలకొకరాయియన్నట్టు లొక్కొక్కసోపానమును గట్టి దానినే యభివృద్ధి కావించిరి. ప్రస్తుత మీశాస్త్రము మనరాజకీయవేత్తలయొక్కయు వణిజులయొక్కయు, కృషీవలులయొక్కయు మనంబుల నాకర్షించుచున్నది. దీని కింకను దోహదము కావలసియున్నది. లేనిచో నిది యభివృద్ధిఁ గాంచనేరదు. అది యభివృద్ధిఁ గాంచనిచో దేశాభివృద్ధి శూన్యమగును. ఈశతాబ్దమునందు నానాజాతులప్రబల పోరాటమునందు జయమునొందవలెననిన, నీనాగరకదేశముల కఱకుధాటికి నిలువవలెననిన, నీశాస్త్రజ్ఞాన మావశ్యకము. ఈవిషయమున నజ్ఞానదశయందున్న దౌర్భాగ్యుఁడు డార్విన్ (Darwin) సిద్ధాంతప్రకారము నాశనమే చెందవలసియుండును. అందులకు సందేహమేమియును లేదు. కనుక నీశాస్త్రపరీక్షయు బోధమును మనకు మిక్కిలి యావశ్యకమని త్వరగా గ్రహింపవలెను. తక్కుంగలదేశములన్నియు దినదినప్రవర్ధమానములై వెంపొందుచున్నవి. ఈదినమునఁ

జూచినపట్టనములను మరునటిదినమున గుర్తింప శక్యముగాకున్నది. మనకండ్లముందఱ బట్టకట్టనేర్చిన జపాను మహారాజసభామంటపములఁ గొలువుతీర్చియున్నది. పసిఫిక్కుమహాసముద్రమధ్యగత జపాను దీవులేడ? పారిసునగరసౌధములేడ! స్వయంకృషియే వారి నట్టిస్థితికిఁ దీసికొనివచ్చినదని యందఱు నెఱింగినవిషయమే. డెన్మార్కుదేశ మేబదివత్సరములక్రిందట, చిల్లిగవ్వచేయని యప్రశస్తపుభూమిగా నుండెను. ఇప్పుడది సుక్షేత్రఖండికయాయెను. దీనికంతకును గారణము ప్రజలయొక్కయు వారిప్రభుత్వమువారియొక్కయు నేకీభావముమీఁద జరిగిన జ్ఞానాభివృద్ధియే. సస్యోత్పత్తియందు భూమికిఁగలసామర్థ్యము, దానికిఁజేయవలసినకృషి మున్నగువిషయముల నాలోచించి జనులపట్టుదల నాధారముచేసికొని వారిపరిపాలకులు కొలఁదికాలములో నత్యాశ్చర్యకరములయిన ఘనకార్యముల సాధింపఁగలిగిరి. వారిదేశములోనున్నట్లు సహకారోద్యమ మెచ్చటఁగలదు? విత్తులసంపాదించుటకు సహకారము. దున్నుటకు సహకారము. పంటలఁగోయుటకు సహకారము. కుప్పలనూర్చుటకు సహకారము. వేయేల! సమస్తమందును వారికి సహకారమే సహకారమగుచున్నది. మనకు స్నానమునందు, భోజనమునందు, నిద్రయందుఁ, దుదకు జీవమాత్రయందంతటను మతమెటులనో వారికి సహకారమటులనే సాంఘికవ్యక్తియందు జీర్ణించి యస్థులఁబట్టియున్నది. వారియైశ్వర్యాభివృద్ధి కిదియొక ప్రబలకారణమన్న నతిశయోక్తికాదు. మనదేశమం దెప్పు డర్థశాస్త్రబోధము మనుష్యులహృదయములందు నాటునో, యెప్పు డర్థశాస్త్రజ్ఞానము మనరక్తనాళములయందుఁ బ్రవహించునో యప్పుడు మనమాతృభూమి భేరీమృదంగవాద్యములతో జయధ్వజమెత్తి తక్కుంగలదేశములఁ బాదాక్రాంతులఁ జేయఁగలదని మనము నమ్మవచ్చును. ఇట్టి మహేంద్రశక్తుల కాలవాలమయిన యీయార్థికశాస్త్ర మేవిషయ

ములఁగూర్చి చెప్పఁగలదని కొందఱకు శంక జనింపవచ్చును. ఏమహా మంత్రములనో యీశాస్త్ర ముపదేశించునని కొందఱనుకొనవచ్చును. అట్లయినచో వారికి మేము కొంతయుత్సాహభంగము కావించువార మగుదుమేమో యని సంశయించుచున్నారము. కాని మావాక్యములును, ఉపదేశములును సనాతనసత్యము లగుటచేఁ గ్రొత్తవింతలు, వింతకల్పనలు కాకపోవుటకు మేము చింతింపము. మాచదువరులుకూడ విచారింపరని నమ్ముచున్నాము.

ఈశాస్త్రము బోధించుసంగతు లీక్రింద నుదాహరింపఁబడిన ప్రశ్నమాలికచే సంక్షిప్తముగ బోధపడఁగలవు. హిందూదేశము యొక్క భూసంపత్తి యెట్టిది? దానిని వృద్ధిచేయుసాధన మెద్ది? దేశీయులకృషి సామర్థ్య మెవ్విధమునను డును? జనులు పనిపాటలయం దెట్టిమెలఁకువగలవారు? వారు వ్యవసాయేతరవృత్తుల కనుకూలురా? ప్రతికూలురా? వారికిఁగల జ్ఞానమెట్టిది? వా రెట్టివిధమున విదేశీయులకుఁ దీసిపోవుచున్నారు? వారి లోటుపాట్లఁదీర్చుటకు మార్గమెద్ది? దేశమందు ధనసంపత్తియున్నదా? లేదా? ఉన్నయెడల ధనము వ్యర్థవ్యయమునందుచున్నదా? సద్వ్యయమునందుచున్నదా? ఎంతవరకది యర్థవృద్ధికిఁ దోడ్పడుచున్నది? పరిపాలకులు దానిసమీకరణమునకు నెట్టియుపాయములఁ గల్పించియున్నారు? మరింకను నెట్టివి చేయవలయును?

దేశమందున్నయర్థమును దేశీయులందఱును సమభాగముల ననుభవించుచున్నారా? లేక కొందఱు దారిద్ర్యము ననుభవించుచున్నారా? అట్టిపక్షపాతముల మాన్పుటకుఁ బరిపాలకులే యుపాయములఁ బన్నుచున్నారు? ఏయుపాయముచే నర్థవిభజన సమత్వమునొందఁగలదు? అర్థసంపత్తికి మూలకారకులగు భూస్వామియు ఋణప్రదాతయు, కూలిపనివాఁడును, వారివారిన్యాయ్యములగుభాగముల నం

దుచున్నాడా? లేక బలహీనుడు బలవంతుని బారిఁబడి కష్టముల పాలగుచున్నాడా? బలహీనునికిఁ బరిపాలకులిచ్చు సహాయమెట్టిది?

విదేశీయవర్తకవ్యాపారములకును దేశీయాంతర్గతవ్యాపారములకు ననుకూలమయినట్టినాణెములు దేశమందున్నవా? లేవా! కర్రెన్సీ (Currency) వలన మనకేమయిన నిబ్బందులు పుట్టుచున్నవా? లేవా? ఇతరదేశములయందున్న కర్రెన్సీకిని మనకర్రెన్సీకిని భేదమేమి? వారికట్లుండుటకు మనకిట్లుండుటకుఁ గారణమేమి? ఏభేద మెట్టియుపకారాపకారములఁ గావించుచున్నది? దేశాభివృద్ధికి మంచికర్రెన్సీయొక్క యవసరమేమి?

ఈమొదలగు నెన్నియోవిషయములనుగుఱించి యీశాస్త్రము చర్చించుచున్నది. చదువరుల నిదివరకే విషయప్రకటనమువలన విసిగించితిమని తలంచి పన్నులు వానిగుణదోషములుకూడ నీశాస్త్రసంబంధములగు విషయములేయని చెప్పకానితిమి. వీనియందొక్కొక్కటిగఁ దీసి వ్రాసినను బెక్కుగ్రంథములు వ్రాయవచ్చును. ఈ శాస్త్రము సముద్రమువలె నపారమైయున్నది. కాని సముద్రమును కూడఁ బ్రయత్నమువిూఁద తరింపవచ్చునుగదా!

వీనినిగూర్చి విపులముగ నుత్తరవ్యాసములందు వ్రాయఁబూనితిని గాన విశేషముగ వానిఁగూర్చి యిచ్చట వ్రాయుతలంపులేదు. కాని యొక్కసంగతిమాత్రము ముద్బోధింపవలయునని యిచ్ఛపొడముచున్నది.

మనదేశీయార్థికశాస్త్రము బహువిధములైనకష్టములకు లోనైయున్నది. మనదేశము ప్రస్తుతము ద్వంద్వనాడిలో నడచుచున్నది. ఉష్ణముకాదు. శీతముకాదు ఇదియొకవిచిత్రమయినశీతోష్ణము. దీనియందుఁ బ్రాక్ప్రతీచీకన్యకలు తాండవమాడుచున్నవి. పురాతనము

లయిన మనయాచారములు హూణవిద్యాసంపర్కమునను, పశ్చిమనాగరకతావలోకనమువలనను మార్పుచెందుచున్నవి. దానివల్ల సంఘము విపరీతాకృతులఁ దాల్చుచున్నది. క్రొత్తప్రాతలు కలియుచున్నవి. మనయాముష్మికేచ్ఛ యొకమూలను బాశ్చాత్యుల యైహికేచ్ఛ మఱియొకమూలను జనుల నావహించియున్నవి. ప్రాచీనాచారములు నవీనాచారములతో ఘోరయుద్ధముల సల్పుచున్నవి. సంఘము, మతము, పరిపాలన, మార్పుఁజెందుచున్నవి వృత్తులు పూర్వమువలె వర్ణభేదముల ననుసరించుటలేదు. బ్రాహ్మణుఁడు క్షత్రియవృత్తియందును, వైశ్యవృత్తియందును, శూద్రవృత్తియందునుగూడఁ బ్రవర్తించుచున్నాఁడు. అటులనే తక్కినవర్ణములుకూడ వారివృత్తులఁ జిత్తానుసారము మార్చుకొనుచున్నవి. విదేశీయులపోటీకి నిలువలేక కొన్నివృత్తులు మాడి భస్మములగుచున్నవి. క్రొత్తవృత్తులుకూడ లేచుచున్నవి. కాని చాలవరకు స్వతంత్రజీవనోపాధి తగ్గి పరాధీనత్వము హెచ్చుచున్నది. అడవులసంచరించు లేళ్లవలె నిరపాయ నిర్దోషజీవనములఁ గాలముఁగడపుప్రజ భీకరారావసంకుల ఘోరవణిగ్యుద్ధములఁ బడి నలగిపోవలసి వచ్చుచున్నది. ఈమాయామయమగుయుద్ధమున నారితేరనివారగుటచేఁ బ్రజలు నిర్ఘాంతపడి, తెల్లపోయి, కర్తవ్యమూహింపఁజాలక, వెఱ్ఱివెఱ్ఱియడుగులఁ బెట్టుచున్నారు. కొందఱు పలాయితులగుచున్నారు. కొందఱు కూలుచున్నారు. సేనానిలేనిసేనవలె చీలి, సంఘము పటాపంచలగుచున్నది. ఈపాఱిపోవుజనంబుల నమకూర్చి, కొని వారియథాస్థానములవారికిఁ జూపించి, సేనాధిపత్యము వహించి యీకృషివాణిజ్యయుద్ధమున, సంఘమునకు జయంబును, చిరతరకీర్తియును సంపాదించుటయే యార్థికశాస్త్రజ్ఞునివిధి. ఎచ్చట మనసేనలు బలహీనములయి యున్నవో వానిని, నిరూపించుట యాతనిపని. సంఘము పాశ్చాత్యుల నెంతవఱకు ననుసరింపవలెనో నిర్ణయించుట యా

తనిపని. ఎచట వ్యతిరేకత్వముఁ దాల్పవలయునో నిరూపించుట యాతనిపని. దేశీయవృత్తి చెడకుండున ట్లాలోచన చెప్పుట యాతనిపని. చెడిపోవునప్పుడు దానికడ్డమువచ్చుట యాతనిపని. పశ్చిమదేశోత్పన్నములయిన సాంఘికరోగముల రానీయకుండుటయాతనికర్తవ్యము. వచ్చినవానిని నిర్మూలముగావించుట యాతనిపని. ఇఁక నెన్నియో విధికృత్యములుగల యీయర్థశాస్త్రజ్ఞుఁడు దేశమున కెంతలాభకారియో మీరే గ్రహింతురుగాక ! వానివాక్యములు వేదవాక్కులకంటెను బవిత్రములు. ఎక్కువగ నాదరణీయములు. కాని యర్థశాస్త్రజ్ఞబ్రువులు (Quack Economists) కూడ ననేకు లుండవచ్చును గాన వారిని గురూపదేశమునఁ దెలిసికొని బహిష్కరించుచుండవలెను. ఈ శాస్త్ర మిదమిద్ధమని చెప్పుటకు వీలయినదికాదు గాన ననేకు లనేకాభిప్రాయముల వెలిఁబుచ్చుచుందురు. ఇందుఁ గొందఱు పాశ్చాత్యార్థిక శాస్త్రము ననుసరించి మనదేశాంశముల గుణదోషనిర్ణయముఁ జేయుచున్నారు. మిరియపుగింజ వాతరోగికి వేడిమియు, నుష్ణరోగికిఁ జలువయు నిచ్చుచున్నదని వారెఱుంగరు. ఉదాహరణముగ నిరాటంకవర్తక వ్యాపారము (Free Trade) ఆంగ్లేయదేశమునకు మహోపకారమొనర్చినను మనకుమాత్రము మహాపకారమే కావించినది. కనుక మన దేశాచారములఁ బరీక్షించి పశ్చిమఖండవాసులఁగూడఁ బరిశీలించి తారతమ్యాసామ్యముల గ్రహించి, తొట్రుపాటువడని మనస్సుతో నిష్పక్షపాతబుద్ధిమై, యుక్తియుక్తముగ, నిదర్శనాపూర్వకముగఁ జెప్పుశాస్త్రజ్ఞుఁడే శాస్త్రజ్ఞుఁడు. వానినేనమ్మి మనమనుకరింపవలసియుండును. ఇఁకముందు వ్యాసములందుఁ దిరిగి మిమ్ము దర్శించువాఁడఁ గనుక నాకు మీరు సెలవీయవేఁడెదను.

ఓంతత్సత్.

# ఆంధ్రసేవాకార్యస్థానమున వెలకుదొరకు గ్రంథములు.

1. పురాణపఠనము. శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారు జాతీయ విద్యను బోధించుమార్గ మిందు దెలుపఁబడినది. P 10 రు 0-1-0
2. స్వప్నకావ్యము. ఆంధ్రభాషనుగూర్చిన వివాదములను చమత్కారముగ నిరసించును. P 28 రు 0-2-0
3. తెలుఁగుక్లాసుతమాషా. తెలుఁగుభాషను బోధించునుపాధ్యాయులయొక్క చిక్కులను దెలుపును. (మిక్కిలి నవ్వుబుట్టించును.) P 10 రు 0-1-0
4. మహాప్రసంగప్రవచనము. బ్ర॥ కూచి నరసింహముపంతులుగారు బి. ఏ. ప్రస్తుతవిద్యార్థులయొక్క దురలవాటులను సూచించి వారికి మంచిమార్గమును బోధించును. P 10 రు 0-1-0
5. కృష్ణకుమారి. నందూరి మూర్తిరాజుగారు బి. ఏ. వంగదేశములోని యొక స్త్రీరత్నముయొక్క చరిత్ర. పద్యకావ్యము. P 10 రు 0-1-0
6. వెనిసు. ఇటలీదేశములోని నగరచరిత్రము. P 8 రు 0-1-0
7. ఫ్లారెన్సు. డిటో. P 18 రు 0-1-6
8. జలపాతము (Water Fall) P 10 రు 0-1-0
9. జలోత్ప్రవాహము (Artesian well) P 12 రు 0-1-0
10. హిమప్రవాహములు (Glaciers) P 18 రు 0-1-6
11. చంద్రగ్రహణము. P 10 రు 0-1-0

పైనాలుగుగ్రంథములు చక్కనియలంకారములు మున్నగువానితో నొక్కభాషయందుఁ బాశ్చాత్యశాస్త్రజ్ఞానమును దెలుపునవి.

## నోటీసు.

బ్రహ్మశ్రీ సత్తెనపల్లి సోమయాజులుగారిచే సుప్రశస్తముగా తయారుచేయబడినవి. వసంతకుసుమాకరం తు 1 కి రు 1[illegible]-0-0. పూర్ణచంద్రోదయము తు 1కి రు 12-0-0. సువర్ణసహితవాతరాక్షసము తు 1 కి రు [illegible]-0-0. కాంతివల్లభరసము ప్రతాపలంకేశ్వరము మున్నగు నౌషధములు క్రయమునకు దొరకును.

వలయువారు—ఆంధ్రసేవాపత్రికాస్థానము,

పిఠాపురము. అనివార్యయవలెను.

# Wanted.

Agents to "**ANDHRASEVA**" a Telugu Educational Monthly Journal. Liberal commission paid.

Apply with half-anna postage stamp to.—

The Editor "ANDHRASEVA"

PITHAPURAM,

*Godavari Dt.*

శ్రీసర్వజన పుస్తకభాండాగారము,
ఆంధ్రపారము.

# Wanted.

Every businessman to have his advertisement made in this Journal. For particulars, apply with half-anna postage stamp to:—

The Editor "ANDHRASEVA"

Pithapuram, *Godavari Dt.*

ఆర్. సి. హెచ్. హైస్కూలు ప్రధానోపాధ్యాయులగు మ. రా. రా. శ్రీ [illegible] చి నరసింహమూర్తి పంతులు బి. ఏ. గారిచే రచింపబడిన యీక్రిందిగ్రంథములు మా కార్యాలయమున దొరకును. తపాలాఖర్చు కొనువారే భరించవలెను.

1. శ్రీరామకృష్ణపరమహంసచరిత్రము, తదుపదేశములును.
   పేజీలు 170 [illegible] వెల రు 0—10—0
2. శ్రీగౌరాంగ (చైతన్యస్వామి) చరిత్రము.
   1 వ భాగము పుటలు 378 1—4—0
   2 వ భాగము పుటలు 397 1—4—0

వలయువారు, "ఆంధ్రసేవ" పత్రికాధిపతిగారు,

పిఠాపురము, గోదావరిజిల్లా

అని వ్రాయవలెను.

## రాజపోషకులు.

శ్రీ పిఠాపురం రాజాగారగు శ్రీ రాజా రావు వేంకట కుమార మహిపతి సూర్యారావు బహద్దరుగారు.

శ్రీ ఇజ్జతాసార్ శ్రీ కందుకూరు బాలసూర్యప్రసాదరావు బహద్దరువారు, దేవిడిజమీందారుగారు.

శ్రీ రావు వేంకటసూర్యారావుగారు, విరవ.

శ్రీ రాజా కందుకూరు లక్ష్మీప్రసాదరావుపంతులుగారు, ఉర్లాం జమీందారుగారు.

## పోషకులు.

శ్రీ రాజా మేకా వెంకటాద్రిఅప్పారావుబహద్దరుగారు, వుయ్యూరుజమీందారుగారు, నూజవీడు.

శ్రీ చెలికాని లచ్చారావుగారు, చిత్రాడ.
జమీందారు. (ఎర్నగూడెం వగైరా)

## సహాయులు.

శ్రీమాన్ కందాళం శేషావతారముగారు, పిఠాపురము.

శ్రీ రావు (కలప) వెంకట్రావుగారు, పిఠాపురము.

ముద్దుల రామయ్యగారికుమాళ్ళు వెంకట చినరాజశ్రేష్ఠిగారు, వర్తకులు, ఏలూరు

బాలాంత్రపు సుందరరామయ్యగారు, కాకినాడ.

---

## చందావివరము.

| | | | |
|---|---|---|---|
| చందాదారులకు సంవత్సరమునకు పోస్టేజీతో | | | రు 3-4-0 |
| సహాయులకు | ,, | ,, | 6-4-0 |
| పోషకులకు | ,, | ,, | 12-4-0 |
| ప్రధానపోషకులకు | ,, | ,, | 25-4-0 |

రాజపోషకులకు వారివారి చిత్తానుసారము.

శ్రీ

# ఆంధ్రసేవ.

తెలుఁగుమాసపత్రిక.

ప్రతిమాసాదిని వెలువడును.

పత్రికాధిపతి—అద్దంకి మాధవశాస్త్రి.

శ్రీలనొసంగు సత్కళ లశేషము నాంధ్రమునందుఁ జెల్వుగాఁ
జాలినయట్టి ప్రౌఢ లనిశంబు శ్రమింపడి జాణఁజేయఁ దాఁ
దేలినపత్రికాంగన యిదే చనుదెంచెడు నిత్య ధాత్రియై
శీలముగల్గు నాంధ్రులకు సేవయొనర్పఁగ నాంధ్రసేవనాఁ

## విషయసూచిక.


1. స్వవిషయము.
2. ఆంధ్రులకొక దృష్టాంతము.
3. వ్యవసాయము—మ. రా. రా. గోటేటి జోగిరాజుగారు, విజయనగరము.
4. భగవద్గీతాసారము—మ. రా. రా. పేరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.
5. ఆత్మనివేదనము—మ. రా. రా. కూచి నరసింహంగారు B.A. Head-Master, R. Ch. High School, Pithapuram.
6. మేఘములు.
7. ఆంగ్లేయదేశగమనము—మ. రా. రా. కాకుళవరపు శేషగిరిరావుగారు B. A. Bar-at-law.
8. పురాణములలోని చారిత్రకవిషయము.
9. ప్రజాప్రభుత్వము—మ. రా. రా. ఎమ్. వెంకటరంగయ్యగారు, M. A. L.T. విజయనగరము.

## ఆంధ్రసేవాపత్రికా విషయము.

ఆంధ్రభాషాభిజ్ఞులారా !

సెప్టెంబరుసంచికయందుఁ జేసికొనినయొడంబడికప్రకారమాంధ్రసేవయొక్క మూఁడవసంచిక దమయొద్ద కంపుకొనుచున్నాము. భాషాపోషకులగు తమబోంట్లయాదరణ మీపత్రికకుఁ గలుగఁగలదను నభిలాషను బొంది విజయదశమియుత్సవమును సాభిప్రాయముతో స్మరించుకొనుచు నట్టివిజయోత్సవములం దత్యుత్సాహమునఁ దానుగూడఁ బాల్గొని తమకు ముదమొదవించుభాగ్య మెప్పుడలవడునాయని యువ్విళ్ళూరుచు నెటులయినను దామంద అభిమానించుకొనుచున్న వ్యక్తి కావునఁ జిరకాలము వ్యర్థముగ వేచియుండనక్కరలేదనుసమాధానమును మనస్సునకుఁ జెప్పుకొని, దివ్యమైనవ్యాసౌషధముల నీయఁగలిగినవెజ్జులు చేకూరినయిట్టిసమయమున శరీరపోషణమునకు వలయుసాధనసామగ్రిని దయచేయుపోషకులుగూడ లభించుట యసాధ్యముగాదని ధైర్యమూని మెల్లమెల్లగఁ దమచెంతకు వచ్చుచున్న యీ పత్రికాంగన కర్హగౌరవము నిచ్చెదరని నమ్ముచుఁ దమసాన్నిధ్యమునఁ బెట్టుచున్నాము. ఆదరణముతో గ్రహింపవేఁడెదము.

తమయాదరణమున నాంధ్రసేవ చిరకాలము విహితకృత్యముల నెరవేర్చుఁగాక !

ఆంధ్రసంఘము తత్కార్యనిర్వహణమున నమితసుఖములఁ బడయుఁగాత !

మంగళం మహత్ శ్రీ శ్రీ శ్రీ.

# ఆంధ్రులకొక దృష్టాంతము.

ఆంధ్రులమగు మనము హిందూదేశములోని యనేకరాష్ట్రివాసులకంటె నధమముగ నున్నామను నాత్మజ్ఞానమే యాంధ్రోద్యమమునకు మూలకందమని యెల్లరకుఁ దెలిసినవిషయమే. అట్టిస్థితిని దొలఁగించుకొని యుత్కృష్టదశ నందవలెనని మనవలెఁ బశ్చాత్త్ప్తులై తమస్థితిని బాగుచేసికొననెంచి కొంతవరకు సఫలీకృతులయిన యితరు లెవ్వరయిన నున్న యెడల వారిమార్గము ననుసరించుటయే శ్రేయోదాయకమని వేఱె దెలుపనక్కరలేదు. మనరాజధానిలో నివసించుచు నేకరాష్ట్రివాసులగుటచే మనసోదరులగు మళయాళీల యొక్కయభివృద్ధిని దెలుపుచు హిందూపత్రిక కొకవిలేఖరి యొకచిన్నవ్యాసమును బంపియున్నాఁడు. మళయాళీ లవలంబించిన కొన్నిమార్గములు మనకు ననుకరణీయము లగుటచే నవి యిటఁ గొంతవరకు వివరింపఁబడును.

విలేఖరి మున్ముం దొకసందేహనివారణమును గావించెను. మళయాళీలు కార్యదీక్షాపరులు గారనియు, పట్టుదలలేనివారనియు లోకములోఁ బ్రబలమయియున్నవదంతి యిరువదివత్సరములకిందట సత్యమై యుండవచ్చునుగాని నేడట్టినింద వారిపై మోపుటకు వీలులేదని స్పష్టముగా నాతఁడు ఖండించెను. కావున మళయాళీలయభివృద్ధికిఁ బ్రథమకారణము వారికార్యదీక్షయుఁ బట్టుదలయు నై యున్నవి.

వారియొక్క యథమస్థితియొక్కయాత్మజ్ఞానము వారికిఁ గలిగినదిమొదలు క్రిందివిషయములలో వారు ముందంజవేయఁదొడఁగిరి.

మొట్టమొదట వారిలో స్త్రీవిద్య మిక్కిలిగ హెచ్చెను. ప్రపంచమునఁ బురుషుని సంసారభారము సంతను వహించి యాతనిని

సౌఖ్యమును పరమావధికిఁ జేర్చుభారముగలిగిన భార్య తాను నిర్వహించవలసినకృత్యములను మెలఁకువతోఁ జేయుటకుఁ దగినవిద్యాగంధజనిత మగువివేకము లేనిదయినయెడల సంసారము పూర్ణసౌఖ్యదాయక మెట్లుకాఁగలదు? సంసారము సంతుష్టిలేనిదిగ నున్నప్పుడు సంసారములసమూహ మగుసంఘము తుష్టినొందుటెట్లు? కావుననే సంఘమయినఁ దుష్టిగలిగి దానివలన జనించినపుష్టిని బొందుటకుఁ బురుషులు స్త్రీలనుగూడఁ దమతోఁబాటు జ్ఞానాంకురము కలవారిగఁ జేయుట ప్రథమకర్తవ్యము.

రెండవది యధమజాతులహీనస్థితిని దొలఁగించుట. అధమజాతులు జ్ఞానప్రకాశమునందు స్త్రీలకంటె నధములుగ నున్నారు. వారియందు విద్యవ్యాపింపఁజేసి వస్త్రాహారాదులయందు శుభ్రమును, సురాపానాదివ్యసనములయందు విముఖతయు, నైకీభావముయొక్కలాభమును వారికి బోధించి వారి నుద్ధరించవలసియున్నది.

మలబారునందు వారి కుచితపాఠశాలలను నెలకొల్పి కొన్నిభాగములయందుఁ బ్రాథమికవిద్య వారిలో వ్యాపింపఁజేయఁబడుచున్నది. ఈవిద్యాగంధమువలనఁ గూలిపనితో జీవించు నధమజాతులు తాముగూడ సంఘమునందు గౌరవస్థానము నాక్రమింపవలయునని కుతూహలపడుచున్నారు.

విద్యావ్యాపనమువలన మధ్యతరగతులలోనివారందఱును వ్యావసాయమునందును వర్తకమునందును దమదృష్టి నిలిపి వానిలో నవీనపద్ధతుల నవలంబించుచున్నారు. అట్లు నవీనపద్ధతుల నవలంబించుచున్నను పాశ్చాత్యులవలె కేవలము ధనోపార్జనమునందే దృష్టి నిలుపక జ్ఞానాభివృద్ధికిఁగూడఁ గృషిసలుపుచున్నారు.

ప్రథమతరగతికళాశాలలుమున్నగువానిని గలిగి విద్యానిలయ

మయిన మదరాసునగరమునకుఁ బలుమారు మళయాళీలు చిరకాలము
నుండి వచ్చుచుఁబోవుచు నుండుటచే వారిదృక్పథము పూర్తిగ మా
రిపోయి సంఘమునందును, మతమునందును, నిరతిశయమై, నిరాడంబ
రమై, స్పష్టముగ బయటకుఁ దెలియకుండ నుండునవై యున్నసంస్క
రణములను దమగ్రామములయందు నెలకొల్పుటకు మార్గదర్శకు
లయిరి.

ఈశతాబ్దమున మొదటిదశనుండియు మళయాళీవిద్యార్థులంద
ఱును వంగదేశము మున్నగురాష్ట్రములకుఁబోయి నూతనకార్యముల
యం దుత్సాహపూరితులైరి.

అట్టియుత్సాహము జనించినదికనుకనే యనేకులగు మళయాళీ
లున్నతస్థానముల నాక్రమింపఁగలిగిరి. శంకరనాయరు, కోయిలతం
పురాను మున్నగు నామము లిందులకు దృష్టాంతముగఁ దీసికొన
వచ్చును.

ఈయుత్సాహము జనించినతర్వాత మళయాళీలు హిందూదే
శములోని వివిధభాగములకు వెడలి సర్వవిధములయినపనులయందును
పేరుగాంచుచున్నారు. వంగదేశములోని గోగునారయంత్రాగారము
లలో మిక్కిలి ప్రసిద్ధికెక్కినదానియందలి యధికారి మళయాళీపని
వాండ్రవంటి నమ్మకముగలవారెచ్చటను లేరనియును, వారికి మ
ర్యాద, శాంతము, సంతుష్టి, యజమానులకు నచ్చినవిధముగఁ బని
చేయునేర్పు మున్నగుసద్గుణము లలంకారములనియు హిందూపత్రికావి
లేకరితోఁ దెలిపెనఁట.

రాజకీయాంశములలో మళయాళీలు వన్నెకెక్కుటకు తిరువా
న్కూరురాష్ట్రములో నెలకొల్పఁబడినటువంటి ప్రజాప్రాతినిధ్యముగలి
గిన శాసనసభలవలన వారికి జనించినయనుభవమే ముఖ్యకారణము.

ప్రస్తుతకాలము మళయాళీల యభివృద్ధియందు మధ్యయుగమని తెలుపవలసియున్నది. వర్తకమును కర్మాగారములును దినదినము వృద్ధినొందుచున్నవి. పరపతిసంఘములు లెక్కకు మిక్కుటమగుచున్నవి.

ఇటీవల మళయాళీలకు వార్తాపత్రికాప్రచురణమునం దాసక్తి మిక్కిలిగ జనించెను. గడచినదశయం దొకదినపత్రిక బయలువెడలెనుగాని వెంటనే యాగిపోవలసివచ్చెను. ఆపత్రికాసంపాదకుడే మరల నీవత్సరారంభమున మరియొకనామముతో నొకదినపత్రికను బ్రారంభించెనట. ఇటులనే యుద్ధమునకు బూర్వము మిక్కిలి యుత్సాహముతో బయలువెడలిన యనేకములయిన మళయాళీపత్రికలు యుద్ధకాలమున నాగిపోయినను యుద్ధము ముగియుటవలన మరల దలయెత్తుచున్నవి.

మళయాళమునందలి జనసామాన్యమున కందఱకును నాటకమునం దభిరుచి యెక్కువజనించినది. ఈమధ్య మళయాళీభాషయం దనేకములయిన కల్పితనాటకములు (Original dramas) బయలువెడలినవి. ఇంకను నవలలు, కావ్యములు మున్నగునవి యనేకములు బయలువెడలుచున్నవి. ఈపైకారణముల నన్నిటిని దెలిపి హిందూపత్రికావిలేఖరి తనదేశీయులు హిందూదేశమునందలి నవయుగమునం దర్హగౌరవస్థానము నలంకరించుటకు దగినప్రయత్నముల సలుపుచున్నారనియు వారియాశయములు సఫలమునొందుననియు దెలుపుచున్నాడు.

ఆంధ్రులుకూడ పైయంశములను విమర్శనాబుద్ధితో బరిశీలించి తమకుగూడ నర్హస్థానమును సంపాదించుకొన బ్రయత్నింతురుగాత!

## ఫలవృక్షముల కాపు.

కొన్నిజాతులఫలవృక్షము లొకసంవత్సరము బాగుగఁగాచిన మరుచటిసంవత్సరము బాగుగఁ గాయకపోవుటయు, నొకతోటలో నొకచెట్టు కాచి దానిప్రక్కనేయున్న మరియొకచెట్టు కాయకపోవుటయు, మనము చాలచోట్ల చూచుచున్నాము. ఇట్టిభేదములకుఁ గారణములనారసి ఫలవృక్షము లేఁటేట బాగుగఁగాయుట కుపాయములను గనుగొనుట యవసరము.

ఈవ్యాసమునం దిదివరలో నచ్చటచ్చట జరిగినకొన్నిపరిశోధనల పర్యవసానములనుబట్టి ఫలవృక్షముల కాపున కనుకూలప్రతికూలములగు స్థితిగతులును, అనుకూలపరిస్థితులను సమకూర్చి చెట్లను బాగుగ ఫలింపఁజేయు విధానములును సంగ్రహముగఁ జర్చింపఁబడును.

ఫలవృక్షముల కాపునందుఁగలభేదముల కంకురము కొంతవరకు వానిపుట్టుకయందే యుండునని చెప్పవచ్చును. సామాన్యముగ బాగుగఁగాయు చెట్టుయొక్క సంతానమునందుఁగూడ బాగుగఁగాయు స్వభావ ముండునని యూహింపఁదగియున్నది. కాని చాలజాతులలో విలోమగర్భోత్పాదనమున (Cross fertilisation) కవకాశముండుటచే విత్తులవలన ప్రవర్ధనమున పైసూత్ర మంతగావర్తింపదు. బాగుగఁ గాయుచెట్లయొక్క కాండభాగములనుండి (అంట్లుగట్టుటవలన) వృద్ధిచేయఁబడినచెట్లు బాగుగఁగాయుట కెక్కువయవకాశము గలదు. కాని సామాన్యముగ నంట్లు (మొక్కంట్లు) గట్టుపద్ధతిలో చెట్టుయొక్కస్వభావ మంటుగట్టిన కొమ్మయొక్కస్వభావము నేకాక కొంతవరకు క్రిందిమొక్కయొక్క స్వభావమునుగూడ ననుసరించియుండుటచే నిందును వ్యత్యాసమున కవకాశముగలదు. ఖండముల (cuttings)వలనగాని నేలంట్లు (layers) మూలమునఁగాని పెంచినచెట్లయినను, ఒకే చెట్టుయొక్క యన్నికొమ్మలును నొకేస్వభావముగలవియని చెప్పుటకు

వీలులేకపోవుటచే, పూర్తిగ తల్లిచెట్టు పోలికగలవనికాని, ఒకదానినొకటి పోలుననిగాని చెప్పవీలులేదు. అయినను, మొత్తముమీద విత్తులవలని పరివర్ధనముకంటె మొక్కంట్లపరివర్ధనమునను, మొక్కంట్లవలని పరివర్ధనమునకంటె ఖండములవలనగాని నేలంట్లవలనగాని జరుగు ప్రవర్ధనమునను, తల్లిచెట్టుయొక్క స్వభావము సంతానమునం దెక్కుడుగ దిగుటకవకాశముగలదు. కావున తోటలువేయునపుడు సాధ్యమయినంతవరకు బాగుగగాయు చెట్లనుండి పైవిధానములందు సాధ్యమగువానిలో నుత్తమమయినమార్గమున మొక్కలనుసంపాదింపవలెను.

సామాన్యఫలజాతులన్నిటిలోను బాగుగగాయుచెట్లనుండి యేయంట్లను సంపాదించునావశ్యకత సపోటాజాతిపట్ల నెక్కువగ గలదు. బాగుగ గాయనిచెట్టున కెంతదోహదముచేసినను కాయుటయరుదు. కొన్ని చెట్లేదోహదమును చేయకపోయినను బాగుగగాయును. కావున బాగుగగాయుచెట్లనుండియే యంట్లుగట్టి నాటవలెను.

విత్తనపుకొబ్బరికాయలను దీయునపుడును బాగుగగాయుచెట్ల నెంచుట యవసరము. ఇతరఫలవృక్షములపట్లను నీసూత్రము కొద్దిగనో గొప్పగనో వర్తించును. మామిడియంట్లను గట్టుటలో పైకొమ్మయేకాక క్రిందిమొక్కయు బాగుగగాయుచెట్టునుండి పుట్టినదిగ జూచుటమంచిది. జామి, దానిమ్మ మొదలగుజాతులలో నేలంట్లుగట్టుట ప్రశస్తము. నారింజకుటుంబమున చెట్టునందు రెండువిధములకొమ్మలు గానఁగును. పెద్దపెద్దముండ్లుగలిగి సాగగనెదుగుకొమ్మలు బాగుగ గాయవు. విస్తారముగ రెమ్మలుపెట్టి గుజ్జగపెరుగుకొమ్మలు బాగుగ గాయును. అంట్లుగట్టునపు డీరెండవతరగతికొమ్మలకు గట్టవలెను. ప్రయాసకరమయినను నారింజకుటుంబములోని చెట్లనుండి 'గుత్తి' పద్ధతి నంట్లు తీయుట మంచిది. (సశేషము.)

వీనివలనఁగలిగిన సుఖదుఃఖములును నిత్యములు కానందున వానిని సహింపవలయును. వీనికిలోఁగక వీనిరాకపోకలకు సాక్షియగువాని కానందమధికము. ఇది సూక్ష్మదేహసంక్షేపము. మఱియు, 'అవిద్య' యనే కారణదేహము మూఁడవదికలదు. దానియం దజ్ఞానముదక్క మఱియేమియులేదు. ఈమూఁడింటిలో స్థూలదేహమున జాగ్రదవస్థను, సూక్ష్మదేహమున స్వప్నావస్థను, కారణదేహమున సుషుప్త్యవస్థను ననుభవించెడియాత్మ యీమూఁడుదేహములకంటె వేఱయి యందఱియందు నొక్కఁడై యుండును. నీవు నేను వాఁడు ననుభేదములు దేహోపాధులనుబట్టి వచ్చినవేకాని యాత్మకు భేదములేదు. ఇందలి యాత్మ పుట్టుకనుక నశింపక కాలత్రియమందును నిత్యమయి యుండును. కాఁబట్టి మన మీ వర్తమానకాలమందున్న విధమున భూతకాలమందు నున్నవారమే. భవిష్యత్కాలమందు నుండఁగలవారమే. ఉత్పత్తిగలదేహమునకే నాశనముకాని యాత్మ కదిలేదు. ఈయాత్మకు దేహముతో నైక్యమునుగల్పించి యాత్మ పుట్టెనని చచ్చెనని చెప్పుదురు. కాల్చిన యినుపకమ్మిశరీరమును గాల్చెననుమాట యినుమునకు నగ్నికి నేకత్వభ్రమవలనఁ గలిగెనుకాని యినుమెప్పుడును గాల్చలేదు. అట్లే యాత్మ యెప్పుడును బుట్టదు. చావదు. అగ్నికి నీ యినుముతో సాంగత్యమువలననే సమ్మెట దెబ్బలు గలిగినట్టు నిత్యానందస్వరూపుడగు నాత్మకు దేహముతో నైక్యమువలన దుఃఖము గలుగును. కామసంకల్పాదివికారములు సూక్ష్మదేహమగు మనస్సునకేకాని యాత్మకు లేవు. ఈవిషయములు సత్తుకావు. సద్వస్తువగు నాత్మ నశింపదనియెంచి తత్వజ్ఞులు శోకమోహములను విడిచి నిత్యానందము ననుభవింపుదురు. ఆత్మ పుట్టదు. చావదు. మఱియు నీయాత్మ భూతకాలమందును వర్తమానకాలమందును భవిష్యత్కాలమందు

నుండును. స్థావరములందును జంగమములందు నుండును. అన్ని దేశములందు నుండును. నీటియందుఁ బ్రతిబింబశక్తి యున్నట్టు బుద్ధియందుఁ బ్రతిబింబశక్తి గలదు. నీరు కలగక స్వచ్ఛముగ నున్నప్పుడే యానీటియందుఁ బ్రతిబింబము స్ఫురించును. ఈవిధముననే బుద్ధి రజస్తమోగుణములచేతఁ గలుషముగాక సత్వగుణముతో నున్నప్పుడే యాబుద్ధియం దాత్మ ప్రతిఫలించును. దీపమునకు వేడిమి కాంతి యను రెండుధర్మములు కలవు. కాని యీరెండును, అంతట వ్యాపింపవు. వేడిమి దీపమున్నచోటనే యుండును. కాంతి నలుదెసల వ్యాపించును. ఈవిధమున నాత్మకు సత్తు, చిత్తు, ఆనందము ననుమూఁడుధర్మములు కలవు. సత్తయనుధర్మ మన్నిచోట్ల స్ఫురించును. సత్త యనఁగా, కలుగుట లేకయుండుట. కలమున్నది, చాపయున్నది, గోడయున్నది, కోడియున్నది, అని యన్నివస్తులందు నుండుట యనునది యాత్మధర్మమనియు నావస్తువులనామరూపములు జగద్ధర్మములనియుఁ దెలియవలెను. వస్తుధర్మములు నామరూపములు. ఆత్మధర్మములు సత్త, చిత్తు, ఆనందములు. సకలపదార్థములు నీయైదింటితోఁ గూడి యుండును. చిత్తనేయాత్మధర్మము బుద్ధియందే స్ఫురించును. బుద్ధికి శాంతవృత్తి, మూఢవృత్తి, ఘోరవృత్తి యనిమూఁడువృత్తులు గలవు. ఈచిత్తు మూఁడువృత్తులందు స్ఫురించునుగాని యానందము శాంతవృత్తియందే ప్రతిఫలించును. స్వచ్ఛమగు నీటియందేగద ప్రతిబింబముగలుగును ? నిర్గుణమగునాత్మకు మూఁడుగుణములు చెప్పవచ్చునా యందువేని వినుము. శ్రుతు లాత్మలక్షణములను జెప్పనేక లక్షణావృత్తిచేత సత్తనఁగా నసత్తుకాదనియు, చిత్తనఁగా జడముగాదనియు నానందమనఁగా దుఃఖముగాదనియు బోధించినవి. అఖండైకరసము నిత్యము నగునిట్టియాత్మకు నాశములేదు. అట్టినిత్యమగునా

త్మకు దేహములుపాధులు (వసించుటకట్టిస్థలములు) గాఁ గల్పింపఁబడినవి. కల్పితములగు దేహములే పుట్టి పెరుగుచు నశించును. ఆత్మ పుట్టదు. పెరుగదు. నశింపదు. సుఖదుఃఖములు మనోధర్మములు. దుఃఖాశ్రయమగు మనస్సుతో నిర్వికారుఁడగునాత్మకు తాదాత్మ్యము, భ్రాంతి కల్పితముకాని వాస్తవముకాదు. ఇనుముకాల్చు ననుమాట యినుమున కగ్నితో నైక్యమును గల్పించినపుడే సంభవించును. కాని

14 వరకు. యాయినుమును, అగ్నిని వేఱుగఁ జూచునపుడు దాహకత్వము (కాల్చుట) యినుమున కుండదుగద. సుఖదుఃఖముల కాశ్రయమైన మనస్సుతో నాత్మకైక్యము భ్రాంతివలన గల్పితము. ఇదియే మోహము. ఈకాలినయినుమును జూచి యినుము వేఱు, అగ్నివేఱు అనిభాగించినపు డినుముకాల్చునట్టు, అగ్నికి సమ్మెట దెబ్బలు లేనట్టు మనస్సునకుఁగల సుఖదుఃఖాదివికారము లాత్మకు లేవు. ఆత్మకు దుఃఖమున్నదని శోధించుట మోహమువలనఁ గలిగెననియుఁ దెలిసి యీమోహమును విడిచి స్వధర్మమగు యుద్ధమును జేయుమని శ్రీకృష్ణుఁ డర్జునున కుపదేశించెను.

అంత నర్జునుఁ డిట్లనియె. "అయ్యా, సుఖదుఃఖములు మనోధర్మములనియు నాత్మ నిర్వికారుఁడనియుఁ జెప్పితిరికద. సుఖదుఃఖములుగలమనస్సే కర్త, భోక్తయగుచుండఁగా నీమనోధర్మములకు సాక్షియగునాత్మయొకఁ డున్నాఁడని యేల చెప్పవలెను? ఆత్మ మనస్సునకంటె వేఱయిన నపుడల మోక్షమాత్మధర్మమనియు బంధము మనోధర్మమనియుఁ జెప్పవలసియుండును. స్వస్వరూపానందముతో నుండుటకద మోక్షము. దుఃఖానుభవముగద బంధము. "స్వరూపనిత్యానంద మనెడిమోక్ష మాత్మధర్మము. దుఃఖకారణమగుబంధము మనోధర్మము." అనిచెప్పుట విరుద్ధము. ఏలయనఁగా నెవనికట్టుమర్రో

వానినే విప్పవలయును. మనస్సును గట్టిరి. ఆత్మను విప్పిరి యని చెప్ప రాదు. కావున నీబంధ మెవరిది? మోక్ష మెవరిది? నాకీరెండును వివ రించి చెప్పుఁడనిన శ్రీకృష్ణుఁడు తిరిగి యిట్లనియె.

"అర్జునా! దేహములు నశించినను దేహమందున్నయాత్మకు నాశము లేదు. ఘటము పగిలినను, ఆఘటమునందలి యాకాశము పుట్టనిదగుటచేత నశింపదు. ఈప్రాకారము పుట్టనిది చావనిది యాత్మ యనియుఁ దాను వికారరహితమగు నాయాత్మనేయనియు సకలవికా రములకు మూలమగు మనస్సునకుఁ దాను సాక్షిననియు సద్గురుకృపా పాత్రుఁడు తెలిసికొని సుఖించును.

ఇట్లు గురుకృపావశమునఁ దాను మనస్సాక్షిననియు నాకాశ మువలె నిస్సంగుఁడననియు నెఱిఁగి దృఢముగ మననముచేసి స్వస్వ రూపములోనుండి భ్రమను జెందనివానిని శీతోష్ణాదివికారములు బా ధింపవు. ఇతఁడే మోక్షమున కధికారి. స్వస్వరూపమగు బ్రహ్మ త్వజ్ఞానముచేత సర్వదుఃఖములకు మూలకారణమగు నవిద్య తొలఁ గును. అపుడు కల్పిత—ద్వైతముతో సంబంధములేని—పరమానం దము స్ఫురించును.

ఆత్మకు మనస్సంబంధమువలననే బంధమనుభ్రాంతి బుద్ధిదో షమువలనఁ గలిగెనుగాని బంధము వాస్తవము కాదు. వాస్తవము కానిది దేనిచేనయినను బోవును. కాని వాస్తవమయినది పోనేరదు. బంధమోక్షములు మనఃకల్పితములు. వ్యవహారసిద్ధములు నయి జీ వుఁడు మోహముచే బంధమోక్షముల ననుభవించునుగాని పరమార్థ దశయందు బంధము లేదు. మోక్షము లేదు. సూర్యునకుఁ బ్రకాశము, చంద్రునకు శైత్యము, అగ్నికి వేడిమి, సహజధర్మములగున ట్లాత్మకు సచ్చిదానందములు నిత్యత్వనిర్మలత్వములు స్వభావములు. జీవుఁడు

భ్రాంతిచేఁ దనకు బంధమోక్షములు గలవని యెంచును.

ఆత్మ సచ్చిదానందస్వరూపుఁడయినను ప్రత్యక్షమగుసంసారమున శీతోష్ణసుఖదుఃఖకారణముండఁగా వానిభోగము సత్యము కాక పోవునా? సత్యవస్తువు దేనిచేతను పోదుగద. "ఆసుఖదుఃఖముల నెట్లు సహింపనగును? నిత్యానందరూపమగు మోక్ష మెట్లుకలుగును?" అని శంకింతువేని సకలప్రపంచము మాయాకల్పితమనియు స్వరూపజ్ఞానమువలనఁ బ్రపంచకారణమగు నవిద్య తొలఁగుననియుం దెలియుము. ఎట్లనఁగా ముందు ముత్యపుచిప్పను వెండియనుకొని సమీపమునకుఁ బోయి యిది ముత్యపుచిప్పయేకాని వెండికాదని తెలియఁగాఁ గల్పితమగు వెండిలేనిదై ముత్యపుచిప్పయే మిగులును. అట్లే కల్పితమగుప్రపంచము లేనిదై యాత్మమాత్రమే మిగులును. కలలో మధ్యఁ గల్పించఁబడిన లోకమంతయు మిథ్యయయ్యెను. కలకు మొదట, చివరనున్న తానే సత్యముగ మిగిలెను. ఇట్లే సృష్టికంటెఁ బూర్వమందును ప్రళయముకంటెఁ బరమందునుండిన యాత్మయే సత్యము. మధ్యను గల్పించఁబడినజగత్తసత్యము. వస్తువులు చేయకముందును, ఆవస్తువులు తిరిగి కరిగినతర్వాతను సత్యముగనుండు బంగారము వస్తువు లున్నకాలమందును లేకపోలేదు. ఇట్లే ప్రపంచకాలమందును, ఆత్మ సత్యముగనే యుండును. ఈయర్థమును "ఆదావంతేచయన్నాస్తి మధ్యేతత్స్వప్నవన్నహి మధ్యేపిచతదేవాస్తి భూషాభావే సువర్ణవత్" అని యాచార్యులు చెప్పిరి. సద్వస్తువగునాత్మకు నాశము లేదు. అసత్తగు జగత్తునకు నాత్మసత్తకంటె వేఱగుసత్తలేదు. బెల్లముతోఁగలిసిన సెనగపప్పునకుఁ గలిగిన మాధుర్యము బెల్లముదే కాని పప్పునదికాదు. ఈవిచారణచేతఁ గల్పితమగు నసద్వస్తువు నుపేక్షించినయెడల సన్మాత్రమే మిగులును. ఇదియే మోక్షమనఁబడును.

మఱియు నీననాత్మదృష్టితో శీతోష్ణాదిద్వంద్వములను సహింప వచ్చును.

ఈయాత్మ తనసత్తచేతను తనస్ఫూర్తిచేతను, అసత్తుజడము వగు సకలవస్తువులను వ్యాపించియున్నది. దేశకాలవస్తు పరిచ్ఛేదము లు లేనిది. అనగా ఈదేశమందుమాత్రి మున్నది. ఆదేశమున లేదను ట దేశకృతపరిచ్ఛేదము. ఈకాలమునలే దాకాలమునఁ గలదనుట కాలకృతపరిచ్ఛేదము. ఈవస్తువునందున్నది యావస్తువునందు లేదను ట వస్తుకృతపరిచ్ఛేదము. పరిచ్ఛేదమనగా విభాగము. ఈవిభాగము పుట్టిన సకలవస్తువులకుఁ గలదు. పుట్టుక యఖండాకారమగు నాత్మ కీపరిచ్ఛేదములు మూఁడును లేవు. నాశమునులేదు. నిత్యమగునాత్మ కుపాధులగుస్థూలదేహము సూక్ష్మదేహము కారణదేహమునను నివి మాత్రిమే నశించునవి. కావున నీవు శంకలేక యుద్ధముచేయుమని శ్రీకృష్ణుఁ డర్జునుని శోకమును తొలఁగించినను నాపాప మెట్లు పోవు నని దేహమునం దాత్మాభిమానముతోఁ దిరిగి యడుగు నర్జునుని శంకను బోగొట్టుటకై యాత్మ కర్తయని చెప్పెడి తార్కికాదులు, ఆత్మ చంపఁబడెనని చెప్పెడి చార్వాకాదులు నెఱుఁగనివారేయని బోధించుచున్నాడు. పుట్టుక లేక నిత్యమగు నాత్మ నశింపదు. ఉపాధి యగు శరీరమే నశించును. ఆత్మకే వికారమునులేదు. ఆత్మ నిత్యము పరిపూర్ణమునని యెఱిఁగినవాఁ డితరునిజంపునా? చంపించునా? చం పుట చంపించుట యనుక్రియలు సూక్ష్మదేహోపాధియగుబుద్ధి ధర్మము లు. ఆత్మ కర్తకాదు. కారయిత (చేయించువాఁడు) కాదు. కనుక అర్జునా! నేను చంపినాను. నాకు బాపముకలుగుననియు శ్రీకృష్ణుఁడు నాచే బంధువులను జంపించెను గనుక నానిమిత్తముగఁ గృష్ణునకుఁ బాపము గలిగెననియు శోకింపకుము.

ప్రత్యక్షముగఁ జేయువనికి గర్తృత్వము, కారయితృత్వము నెట్లు లేకపోవునందువేని వినుము. కలలో నీవొకనిని గొట్టినట్లును కొట్టించినట్లును ప్రత్యక్షముగఁ గనిపించినను నీకు కర్తృత్వము కారయితృత్వము, పాపము, శోకము ననువీనిలో నొకటియైనను లేదు గద. ఏల లేకపోవలెను? స్వప్నమందున్న దేహములును, వీనిచేఁ జేయఁబడినపనులును మనోమాత్రముచేఁ గల్పితములేకాని వాస్తవము కానందున పైనిచెప్పిన కర్తృత్వాదికము లేకపోయెను. ఇట్లే జాగ్రదవస్థయందున్న యీదేహములు, ఈపనులును మాయచేఁ గల్పితములగుటచేత వాస్తవములుకావు. కావున వానికి నేనుకర్తను, భోక్తను, పాపిని యని భావింపరాదు. కర్తృత్వాభిమానము లేదేని యే కార్యమును జరుగదు. తుదకు భోజనమైనను జరుగదు. ఈవ్యాపార మెట్లు చేయఁదగునందువేని యీపనులు కలలోనిపనులవలె నసత్యములని యెంచి వానియం దాసక్తిని వదలి నటుడు తానువేసినవేషము నిజముకాదని యెఱిగినను నిజముగ నభినయించువిధమున నుపాధికిఁ దగినపనులను వానియం దాసక్తిలేక చేయవలయును.

ఆత్మ నిత్యమై నశింపకున్నను సకల శ్రేయస్సాధనమగు భీష్మాదులదేహముల నెట్లు చంపుదునందువా? లోకములో నరుఁడు చినిగిన ప్రాతబట్టలను విడిచి దివ్యాంబరములను ధరించునట్లు భీష్మాదులు జరాజీర్ణములగు ప్రాతదేహములను వదిలి పుణ్యముచే నార్జించిన దివ్యదేహములను యుద్ధములో శరీరత్యాగమువలనఁ బొందుచుండఁగా నర్జునా! నీకీశోకము తగదు"

అనిన మరల నర్జునుఁ డిట్లనియె.

"ఓకృష్ణా! ఇండ్లుకాలఁగా నింట్లోనున్నవారికిఁగూడ దాహము (Burning) తాపము కలుగక మానదుగద. ఇట్లు దేహములు

చంపఁబడఁగా దేహములందున్న యాత్మకు దాహతాపములు కలుగకుండునా ?'' యనిన శ్రీకృష్ణుఁడు మరల నిట్లనియె.

అపరిచ్ఛిన్నము నిత్యమునగు నీయాత్మను తీక్ష్ణమైన యాయుధములు రెండుగ ఖండింపలేవు. బాగుగ ప్రజ్వలించెడి యగ్నియు నాత్మను గాల్పలేదు. జల మెంతవడిగావచ్చినను పిండిబొమ్మను విడఁదీయున ట్లాత్మను విడఁదీయఁజాలదు. ఎంతప్రబలమయినను వాయువు గిరులనువలె నాత్మను విరుగఁగొట్టలేదు. మఱియు ఘటమును గత్తి ప గిల్చినను నీరు తడిపినను, వహ్ని కాల్చినను, గాలి యెండించిన, నాఘటమందలి యాకాశమునకు భూమ్యాదిభూతము లేవియు వికారమును గలిగింపలేనివిధంబున శస్త్రాదికము దేహములకేకాని యాత్మకే భంగమును జేయఁజాలదు, రోగాదిబాధలును దేహమునకేకాని యాత్మకు లేవు.

ఆత్మజ్ఞానము కలవానికి శోకము గలుగదు. ఆత్మకంటె నసత్యములగు జడవస్తువుల నాత్మకాదని యుపేక్షించుట యాత్మజ్ఞానమునకు సాధనము. శ్రుతు లాత్మయిట్టిదని చెప్పలేక యాత్మకాని యితరములగు జడవస్తువులను గాదుకాదని చెప్పి సర్వాంతరమగు నాత్మదగ్గరకు వచ్చినపుడు మౌనముతో నూరకుండెను. గృహమందున్న సకల పదార్థములను గృహముమీఁదనున్నకప్పును గృహాధారస్తంభములను చుట్టునున్నగోడలను దీసివేయఁగా నాకారములేని యాకాశముమాత్రము మిగులును. ఇట్లు త్వగస్థిమాంసశోణిత నిర్మితమగుస్థూలదేహమును మనోబుద్ధీంద్రియాదులనెడి సూక్ష్మదేహమును, అజ్ఞానమనెడి కారణదేహమును కాదుకాదని నిషేధించి నిషేధమునకవధియగు నాత్మ మిగులును. సర్వమును నిషేధింపఁగా నిఁక నేమియును లేదనరాదు. ఏలయనఁగా నీదేహత్రయముయొక్క రాకపోకలను దెలిసికొనెడి యే తెలివిగలదో యా తెలివియే యాత్మ. నిత్యమయియుండును.

సీ. ఇహసుఖలోలత ♦ హెచ్చైనయీనాఁడు
నిత్యలేఖాతతి ♦ నెత్తిమీఁద
యాయావరము సేయు ♦ నయ్యలనోటను
దుర్వార్త చెవులలోఁ ♦ దూఱుతఱిని
బుద్ధిగుమ్మము దాఁకి ♦ బొప్పిగట్టినవేళ
నున్నని వేసారి ♦ యార్చునపుడు
గొల్లసుద్దులయందుఁ ♦ గోవెలలందును
వేకువ నఱచేత ♦ వ్రేళ్ళకొనల
గీ. భజనగానంబులను భక్త ♦ వరులజిహ్వ
సత్కవుల కావ్యనాటక ♦ సమితియందు
నాకసమువోలె వ్యాపించు ♦ నట్టిపూత
నామము ధరించునాతఁడు ♦ నరుఁడె రామ! 43

చ. మనుజులలో బలాధికుఁడు ♦ మంచిగుణంబులవాఁడు రాముఁడన్
ఘనయశ మున్నమాట సరె ♦ కాని, సతీమణిఁ బాసినప్పుఁ డ
మ్మ్లాని[illegible]మూర్ఛయం దతఁడు ♦ పొక్కుచు వెల్చిన బాష్పధారలన్
గని మనుజాతిరిక్తపద ♦ గౌరవ మాతని కీయవచ్చునే? 44

మ. అహహా! యెంతటిమాట! సజ్జనులచ ♦ ర్యల్సానురాగంబులై
యిహలోకంబున నిట్టులుండునని బో ♦ ల్లేడ్పుల్ప్రదర్శించెఁగా
కహహాయిన్ బ్రియదాత్మని న్జైకశ ♦ క్యంబౌనె దుఃఖాళికిన్
గుహనా రామనృపాలుఁ డార్తిఁ బడునో ♦ కోనాట్యర ంబునన్!
శా. మాయామానుషవిగ్రహుం డయిన రా ♦ మస్వామి నిక్కంబుగా
జాయాదుఃఖము నొందెనే, నెటుమహా ♦ సాధ్విన్ గృపాహీనుఁడై
త్రోయంగల్గెనొ వహ్నికుండమున? న ♦ త్యుత్కృష్టల న్సతిన్
భూయోగర్భభర స్వనీతటి కెటు ♦ లుపత్రెంచెనో క్రూరుఁడై? 46

చ. పరమపతివ్రతామణియుఁ ♦ బావనశీలయు నైనసీత దు
ర్భరతరగర్భభారవన ♦ వాటికిఁబంపుట రామ ! స్వప్రజో
త్కరపరితృప్తికై తనదు ♦ దారనుగూడఁ దొఱంగఁగావలెన్
ధరణిపుఁ డన్నధర్మము ను ♦ దాహరణంబుగఁ జూపనేకదా ! 47

ఆ. అన్నిసరియొకాని, ♦ యాదిమధ్యాంతర
హితుఁ, డనామరూపుఁ, ♦ డెఱుక కంద
నట్టిచిన్మదాత్మ, ♦ యయ్యయ్యొ ! మావలె
జననమరణబాధఁ ♦ గనునె రామ ! 48

మ. త్రిగుణాతీతులు, యోగివర్యులు, విశు ♦ ద్ధభూతచేతస్కులున్
భగవంతున్గనుటో, తదాత్ములగుటో ♦ పాటిల్లుఁగా, కాగతిన్
భగవద్దర్శనమైక్య మందఱకు ల ♦ భ్యంబౌనె ? యారీతిగా
జగతిన్గోటికి నొక్కఁడేనియును మో ♦ క్షంబందఁగాశక్తుఁడే ? 49

సీ. సామాన్యమైనట్టి ♦ చదువునకేయొక
చెప్పువాఁడుండ, సం ♦ సృతిమహాబ్ధిఁ
దరియించుసాధనం ♦ బెఱిఁగించుటకుఁ దగు
నుత్తమదేశికుం ♦ డుండవలదె ?
యాపని కాపర ♦ మాత్ముఁడే యగుఁగాని
యితరమానవమాత్రుఁ ♦ డెట్లుతగును ?
నిర్గుణుం డాపని ♦ నెఱవేర్చునందుమే
నెఱుకచేయఁగఁజిత్త ♦ వృత్తిలేదు

గీ. శిష్యసందేహములు వినఁ ♦ జెవులులేవు
చెప్పి సంశయములుదీర్ప ♦ జిహ్వలేదు
కాన లోకోద్ధరణకార్య ♦ కరణమునకె
యీశ్వరుం డవతారంబు ♦ లెత్తుచుండు. 50

# మేఘములు.

రసంబుల గోచరంబుగాఁ బ్రజల కందరానితావున నొక్కచో మిక్కుటముగ ఘనీభవించిన నయ్యావి యధోలోకమునకు దారితీయుననియు లోకోద్ధరణమునందు దాక్షిణ్యనిదానమై వితరణగుణముల విరాజిల్లుఘనభావ మూర్ధ్వలోకమునకు దారితీయుననియుఁ బండితపామరులకెల్ల బోధసేయఁగలిగి, యొకవర్షమునఁ గాన్పించు నొకవర్షమునఁ గానుపింపదనరాక ప్రత్యబ్దమునను గాన్పించు తనమహిమంబుఁ దెలుపుటకు సంవత్సరాభిధానములందుఁ బ్రధానగణ్యమై, జగదంతరాత్మయగు నేయపరిమేయునివలన నీసృష్టిజాలమున మనముద్భవింతుమో, యాకృతియందు భిన్నంబుగఁ గాన్పించినను భిన్నదేహముల ధరించినను నేయమేయునియంతర్లక్షణంబుల విస్ఫుటము సేయుచుందుమో యామహాత్మునియందే సంసారపరిభ్రమణానంతరమునఁ జేరుచుందుమని శాస్త్రవేత్తలకు గోచరము సేయు ప్రవర్తనము గలిగి, లోకంబునందలి జీవకోటులకు జీవనాధారంబయి, యగోచరంబుల గోచరము సేయు నుపమాద్యలంకారసంధానవిచక్షణులగు సత్కవీంద్రుల పెక్కువర్ణనలయందుఁ దోడ్పాటుసూపి, శక్తులందెల్ల మహాశక్తియగు విద్యుచ్ఛక్తికి జన్మస్థానములయం దగ్రగణ్యమై, భూమియెల్లఁ దనమహిమ కలిమిఁ గీర్తిమయము గావించు మేఘముయొక్క స్వరూపమిట్టిదియని ప్రజ లెఱుంగుట భావ్యంబు గావునఁ దద్విషయ మెఱుంగనివారికించుక తెలియుకొఱకా విషయ మిచట శాస్త్రదృష్టిచే నవలోకింతము. విడిచినభాగములు గ్రహింప సూక్ష్మదృష్టులు ప్రార్థితులు.

ప్రపంచమునందలివస్తుజాలములు ఘనపదార్థములనియు ద్రవపదార్థములనియు వాయుపదార్థములనియుఁ ద్రివిధములుగానున్నవి. ఘనపదార్థములయందలియణువుల కన్యోన్యాశ్లిష్టత హెచ్చుగనుండుటవలనఁ బరప్రయత్నము లేనియెడల నాపదార్థములయాకృతు లన్యాకృతులఁ గాంచవు. ఆ కారణమువలననే సాధారణముగాఁ బరప్రయత్నము లేనిచో నాఘనపదార్థము లొకయెడనుండి వేఱొకయెడకుఁ బరుగిడవు. ఆపదార్థములయందలియణువులును స్వస్థానముల విడువజాలవు. ద్రవపదార్థము లట్టివిగావు. వీనియందలియణువుల కన్యోన్యాశ్లిష్టత తగ్గియుండుటవలన స్వస్థానములఁ దఱచుగ వీడి యధఃప్రదేశములకుఁ బరువిడుటకుఁ బ్రయత్నించుచుండును. అందువలననే ద్రవపదార్థముల కాధారరూపమే కాని నియతాకృతులు లేకపోవుటయు నుపరిభాగములు నిమ్నోన్నతరహితములుగ నుండుటయుఁ దటస్థించుచున్నవి. కాని, ద్రవపదార్థములయం దణువుల కన్యోన్యాశ్లిష్టత ఘనపదార్థములయందువలె మిక్కుటముగ లేకపోయినను బరస్పరసంఘట్టనంబున నెడఁబాటుఁ జెందుప్రయత్నము లున్నటు లంతగాఁ గానరావు. ఇఁక వాయుపదార్థము లన్ననో నియతాకృతులు గలిగియుండకపోవుటే కాక యెంతటియవకాశ మబ్బిన నంతటితావు నాక్రమింపఁగలిగి ధూమశకటములయం దథమస్థానములయం దాసీనులయి దూరప్రయాణము లొనర్చుప్రజలవలె నవకాశ మింతయుఁ దోఁపనీక యాతావంతయు సమముగా నాక్రమించుకొనుటకుఁ బ్రయత్నము లొనర్చుచుండును. ఘనీభూతపదార్థములయందు స్వల్పముగను ద్రవపదార్థములయం దంతకన్న నెక్కుడుగను వాయుపదార్థములయందు మఱియు నెక్కుడుగను, పరోపకారపారీణత విశేషముగఁ గాన్పించుచున్నది. వాయుపదార్థంబులు మన కుపకార మెట్టులొనర్చుననవలదు. ప్రపంచమునం

దలిపదార్థములు త్రివిధములుగానున్నను సర్వోపదార్థము లెంతెంత స్థలమాక్రమించినట్లు మనస్థూలదృష్టికి గోచరమగునో యంతియతావునం దాహూవమునసే యుండక గోచరపదార్థోపరిభాగమునకు సమీపమునుండుస్థలములయందును బదార్థములయందును దమపరివ్యాప్తి గోరుచుండుటవలన నానసమీపస్థలముల సర్వోపదార్థములయందలి యణువులు వాయురూపముననో మఱియొకయేరూపముననో పరిచ్ఛిన్నంబుగఁ బ్రసరించుచుండును.

కావుననే జీవకోటుల కావశ్యకములగుసకలపదార్థము లెచ్చటెచ్చటనుండినను వానివానిసామీప్యమునఁ బ్రవర్తించువాయుసంచారమునసర్వోపదార్థములప్రత్యక్షముగా వేఱుతావులకుఁబోవుచుండును. అందువలన మనదేహసంరక్షాదుల కావశ్యకము లగుపదార్థము లెల్ల నుంఛవృత్తి గ్రహించుకొనివచ్చి మన కొసంగుటంజేసి వాయువు మనకు మహోపకార మొనర్చుచున్నది. ఇటు లావశ్యకపదార్థముల దూరప్రదేశములనుండి తెచ్చి సంఘటనపఱచుశక్తి యుండుటం గావలె నౌషధసేవ వేఱుగావలదు. ప్రకృతియే రోగనివారణ మొనర్చునని యూహించి కొందఱు పాశ్చాత్యశాస్త్రజ్ఞులును 'లఙ్ఘనమ్పరమౌషధమ్' ని తెల్పుమహనీయులును ప్రాణాయామబలంబున వాయుభక్షణ మొనర్చి సకలవ్యాధినివారణమును గావింపవచ్చుననియు దీర్ఘజీవితమును సంపాదింపవచ్చుననియుఁ దెలుపుమన ప్రాచీనులును వాయువిషయమున సర్వోయభిప్రాయములు గలిగియున్నారు. ఇతర పదార్థము లీవాయుపరిణామము గాంచినవిషయము తఱచు మనకు గోచరముగా నుండదు. శక్తులన్నియు నప్రత్యక్షసంచారము కలవిగావున వానిపరివ్యాప్తి మనకుఁ జక్షుర్గోచరము గాకపోయినను నాశక్తులు సమీపమువర్తనముగల యునికిపట్లకుఁ బ్రసరించుచుండును. సజ్జ

నులసేవ సేసినను సత్సాంగత్య మొనర్చినను తద్వాసనవలన స్వదుర్గ ణంబులు పోయి దుష్టులకుఁగూడ నాసజ్జనులగుణము లలవడునని పెద్దలు చెప్పుదురు. ఇఁక దుష్టులుసహవాసమొనర్చిన దుర్గుణము లలవడునని తెల్పుటకే యూరునెలలు సహవాసముచేసిన వారు వీరగుదురనుసామెత గలదు. దుష్టునకు దూరముననుండుట మేలనుటయు నీగుణవ్యాప్తికి సంబంధించియే యున్నది. వీనిఁ బరికింప లోకంబునఁ బదార్థములేకాక యందలిశక్తులేకాక తమగుణములును నొకతావునుండి వేఱొకతావునకుఁ బరప్రయత్నము లున్నట్లుతోఁచినను దోఁపకున్నను స్వతస్సిద్ధముగఁ బ్రసరించుచున్నట్టు లంతర్భూతముగాఁ దెలియవచ్చుచున్నది. ప్రత్యక్షపదార్థములయం దీపరివ్యాపనశక్తి గలదని తెలియవచ్చినఁగదా తదితరవిషయమై యూహింపఁదగును. అట్టిశక్తిగలవానిలో మేఘములు ప్రధానములై యున్నవి. మఱియుఁ బదార్థము లన్నియు నెప్పుడోయొకప్పుడు వానివాని కనుకూలశక్తుల సాహచర్యముగలయప్పుడు ఘన, ద్రవ, వాయురూపములఁ గాంచి మాఱుచున్నను బ్రపంచమున నామూఁడురూపములతోడను వేఱువేఱుగా నేకకాలమునఁ గాన్పించుపదార్థ ముండుట సంభవించుటరుదు. కాని ప్రత్యహము మనము చూచుచున్నమేఘపదార్థ మట్టి వానిలో నొకటియైయున్నది. కావునను హిమజలబాష్పములు లోకంబున నెల్లెడలను గానవచ్చుటచేతను భూమ్యుపరిభాగము చాలవఱకు జలావృతమగుటచేతను మేఘము బాష్పసముదయ మగుటచేతను మేఘంబులఁ జూడనియంధేతరుఁ డెందునుఁ గానరాఁడుగావునను పరివ్యాపనశక్తి గ్రహించుటకు మబ్బులయందలివిశేష మించుక తెలిసికొందము.

ప్రశ్లిష్టతగలిగిన జలకరణంబులయందలియణువులు తగినంత

యుష్ణబలము గలిగినపుడొకదానినొకటి పాసి యనిర్వచనీయం బగు
పరితాపభరంబున స్థానభ్రమమగాంచి యిటునటుం బొరలుకొనుచు నెడ
ముగాఁ బారుచుండును. అట్లు మార్పుఁజెంది యెడముగ నెక్కుడుతా
వు నాక్రమించి పలుచఁదనము వహించిన యాకణములసముదాయమే
బాష్పముగా వ్యవహరింపఁబడుచున్నది. ఈబాష్పమును గన్నీరుగా
భ్రమింపవలదు. ఈబాష్పమున కర్థము నీటియావిరి. అగ్నిసాహాయ్య
మునఁగాని నీటియావిరి రాదనుకొనవలదు. మహాపరితాపముగలజ్యోతి
ర్మూర్తి యగుసూర్యుని కిరణంబులయందలివేఁడిమి తటాకాదిబలాశ
యంబులయందుఁ బడునపుడును, జలంబుష్ణపదార్థములపైఁ బడున
పుడాపదార్థములయుష్ణమా జలములయందుఁ బ్రవేశించునపుడునుఁ
గూడ నాబాష్పము జనితమగుచున్నది. పరితాపమునఁ బ్రాఁగువారిఁ
గాంచిన బాష్పంబు లుద్భవించుననుట సానుభూతిఁ జూచునెల్లరకు
స్వానుభవములో నున్నవిషయమేకాని వేరుగాదు. పైకిఁ గళపళముఁ
దెలియనీక ప్రచ్ఛన్నముగా నుండి పరితాపము నొందువారిభావమూ
హింపఁ గ్రమక్రమమున బాష్పములు ప్రజనితమగుననుట యించుక
పరిజ్ఞానముగల యెల్లరకు నైజమని తెల్పఁదగియున్నది.

ఘనంబుల కంతశ్శక్తి యుష్ణము వానికిఁ బ్రధానద్రవ్యము
జలము. భూమండలమెల్ల జలమయమనుట హ్రదతటాక నద్యాదు
లఁగాంచినప్పుడేకాని సాధారణముగఁ దెలియరాదు. కాని జలరహి
తములుగాఁ గన్పించుతావులఁ ద్రవ్విచూచినను విత్తనంబుల మొలి
పింపఁజేయు భూమిపదనుజూచినను భూమండలోపరిభాగమేకాక తదిత
రస్థలములుగూడ జలసమ్మిశ్రితమని తెలియవచ్చుచున్నది. అటులే వా
యుమండలమున నచ్చటచ్చట నంతరాళమునఁ దఱచుగాఁగానవచ్చు
మబ్బులయందేకాక బాష్పవాయుమండలమునం దంతటను బ్రచ్ఛ

న్నంబుగ సమ్మిళితమైయున్నదని శాస్త్రజ్ఞులు గనుఁగొనియున్నారు. మన మూపిరి చల్లనిఫలకంబులపై విడిచిన నావిరి యూయూపిరియందుఁ గలదని తెలియవచ్చుట కాఫలకంబు పులకంబులఁ గాంచెనో యన నాఫలకంబుపైఁ జిన్నచిన్న జలకణబిందులవంబులు గానవచ్చునుగదా! కొన్నికొన్నిపదార్థములు భూమియం దుంపఁబడినపు డీవాయుమండలమునందలి నీటియావిరివలన ద్రవరూపముఁజెందుట చూచుచున్నారము. వర్షకాలమున నీయావిరి దట్టముగా నుండుటచే లవణము శర్కర మొదలగుపదార్థము లాకాలమున నీరైపోవుటయుఁ బాకమైపోవుటయుః జూచుచున్నారము. ఈవాయుమండలము నందలి నీటియావిరి యంతరిక్షమున నెగురఁగొట్టఁబడియుండి క్రిందుచేరక యచ్చటనే తిరుగులాడు ధూళి రేణువుల నాశ్రయించిన నయ్యది యొక్కచో గుంపుగాఁ గానవచ్చునపు డాబాష్పమును మబ్బుల కాస్తరణము ధూళి రేణువులు. వీనినే ధూమమనుకొన్నను బాధకము లేదు. నీటిని మఱుగఁబెట్టునెడల నావిరి పైకిఁబోవునపుడు మబ్బువలెఁ గాన్పించుటకుఁ గారణ మాజలపాత్రమున కధోభాగమునందు మంటనుండి బయలువెడలు ధూమ మాయావిరి కాశ్రయభూమియై యుండుటవలననేకదా! ఇప్పటికి మబ్బులకుఁ బ్రధానద్రవ్యము జలము, సంతశ్శక్తి యుష్ణము, నాస్తరణము ధూమము నని తెలియుచున్నది. కావుననే ఘనపరిభావంబెల్ల నెఱిఁగి లోకంబునకుం దానిఁదెలుపుటకు మేఘంబు గొప్పసందేశమునుం గొంపోవువానిఁగాఁ జేసిన కవిసార్వభౌముఁడగు కాళిదాసు మేఘమును "ధూమజ్యోతిస్సలిలమరుతాం సన్నిపాతః" అని తగుమాత్రపదంబులచే తనయావదర్థము విస్ఫుటపఱిచెను. మేఘము వాయుపదార్థముగావుననే యాసందేశమును గొనిపోవుపరోపకారిగాఁగూడ దానిని వర్ణించియున్నాఁడు.

# ఆంగ్లేయదేశగమనము.

(ఆగష్టు పంచిక తరువాయి.)

ఏడెను నగరమును మేము చేరునప్పటికి రేవునందలి యధికారులచే నియమింపఁబడిన నిపుణులు చిన్ననావలతో వచ్చి మాయోడను రేవులోనికిఁ గొంపోయిరి.

యుద్ధకాలమం దీచిన్ననావలు మిక్కిలి యావసరము. ఏలయన ప్రతి రేవునందును శత్రువులయోడలు చొరకుండునటుల రేవులో గనుల (mines) ను పరతురు. ఈగనులు పెద్దయినుపబొంగరములవలె నీటిలో మునిగి విద్యుచ్ఛక్తి వలన దాపున కాకర్షింపఁబడిన యెంత బ్రహ్మాండమయిన యోడనైనను స్పర్శ తాకకపూర్వమే 'ఢామ్మ' ని పేల్చి యోడను రెండుచెక్కలుగావించి తుత్తునియలుగాఁ జేసి క్షణమాత్రమున నాయూరంత యోడ నధోగతిపాలుచేయును. ఇట్టియుపద్రవములు కలుగనీయకుండుటకై రేవులో నెచ్చోట నీగనులు పరచిరో యొకపటము (Mining chart) వలనఁ దెలిసికొనిననిపుణుఁడు వానియుపద్రవ మీయోడలకుఁ గలుగకుండుటకై వానిని తప్పించి జాగ్రత్తగా నోడలను లోనికిని బయటికిని గొంపోవుచుండును. రేవునకు దూరముగ మాయోడ యున్నతరి మాకుఁ దెలిపిన భయోద్రేకమగుసంజ్ఞ యిట్టియుపద్రవము మాకు సంభవింపకుండుటకొఱకే.

ఓడలో నాపడకగది (cabin) లోనున్నసహవాసుఁడొకపార్శీ చిన్నవాఁడు. ఆతఁడు చెన్నపురిరాజధానిప్రభుత్వమువారివలన బట్టల నేతవిద్య (Weaving) నేర్చుకొనుటకు 'మేన్చెస్టరు' (Manchester) పంపఁబడెను. ఈయన యెరిగిన చుట్టమును స్నేహితుఁడు నగు నొక

పార్శ్వవర్తకుఁడు మాయోడకు 'ఏడెను' రేవునందలి యేజంటు. మేమోడదిగి చిన్నడింగిలో రేవునకుఁబోవఁగనే నాయోడసహవాసితో నాకునుగూడ నీయేజంటుగారి మోటారుకారు సిద్ధముగ నుండెను. దానిలో నెక్కి యూరంతయుఁ దిరిగితిమి. ఈయూరిలో నెన్నఁడును వర్షము లేకపోవుటచే జలసదుపాయములకొఱకు గట్టిన పెద్దచెరువులను పట్టనమున కైదారుమైళ్ళదూరముననున్నవాని నటకుఁబోయి చూచితిమి. ఈదేశములో నా కెడ్లగపడలేదు. బండ్లను సామానును లొట్టిపిట్టలేలాగును. కాఫీలోవేయు పాలుకూడ లొట్టిపిట్టపాలే. ఏడెనులో నుష్ణము చాలహెచ్చు. నలుప్రక్కల నిసుకపఱ్ఱలు నెడారులుతప్ప వేరేమియుఁ గానరావు. మేము 'ఫోర్డుకారు' (Ford car) నెక్కి యూరఁ దిరుగుచున్నపు డెండబాధచే నీమండెడుప్రదేశమున నొడ్డున కేలవచ్చితిమని విసుగుజెందితిమి. ఈయెండవేడిమిచేఁ గాలి నయిసుక మేము గాలి కెదుఱుగా మోటారులోఁ బోవునపుడు మాకళ్ళఁబడి మమ్మేడ్పించెను. నాసికారంధ్రములు వేగినయప్పడములవలె కొంకరలుపోయెను. జిహ్వ యార్చుకొనిపోయెను. అందువలన నాలుక చేతఁబట్టినను చేయి తడిగాదయ్యెను. ఈయేడెనులో సాలున కొకయరదుక్కిమొదలు మూడుదుక్కులవఱకు వర్షము కురియును. కావున నిచ్చట నతివృష్టిదోష మెన్నటికిని గలుగదు. నీటిసదుపాయముగూడ చాలతక్కువ. త్రాగెడుజలము నూతులనుండి కొన్నికొన్నిచోట్ల లభించును. ఈనూతులు పీఠికాపురపునూతులకంటె మూఁడింతలు లోతుగలవగుటచే నీయేడెనుపురవాసులు పాతాళగంగను త్రాగుదురనుట యతిశయోక్తికాదు. ఏడెనులో కొలంబులో వలెనే నాణెములు రూపాయలే. ఓడయెక్కినతోడనే ప్రయాణీకులు సాధారణముగాఁ దమయొద్దనున్నరూపాయలను పౌనులక్రింద మారు

రు. తిరిగి యేడెనులో పౌనులను రూపాయలక్రింద మార్చవలసివచ్చును. కనుక నీరెండుమారకములవలన తగులుబడియగును. కనుక నోడయెక్కునప్పుడు పదిరూపాయలుమాత్రము 'ఏడెను' లో బళ్లుమొదలయినఖర్చుల కుంచుకొని తక్కినరూపాయలే పౌనులక్రింద మార్చుటమంచిది. ఏడెను బొంబాయి కై దారుదినములుపట్టుప్రయాణముగల దూరమున నున్నది. ఏడెనువరకు హిందూమహాసముద్రములో నుంటిమి. ఇటుపిమ్మట నెఱ్ఱసముద్రములోఁ ప్రవేశింతుము. ఈసముద్రముయొక్క యడుగు కొంచెము కంకరతోఁగూడిన కొండభూమియగుటచేత నీసముద్రమునందున్ననీరు గాలిచేఁ గలతచెంది యెఱ్ఱరంగగుటఁజేసి యీసముద్రమున కెఱ్ఱసముద్రమని నామమిడిరని నాయుద్దేశము. ఈయెఱ్ఱసముద్రమంత వేడిగలప్రదేశము నెఱిఁగినంతమట్టున కీప్రపంచములో మరెచ్చోటను గానము. అడుగున రాతిభూమి. చిన్నసముద్రమగుటచే లోతుగూడ నతివిస్తారము లేదు. వెడలుపైనను కొలఁదియే. తూర్పున నరేబియాయెడారి. పశ్చిమమునఁ బ్రపంచమున మిక్కిలి ప్రసిద్ధికెక్కిన సహారాయెడారి. ఇటువంటి ప్రదేశములోనున్న యెఱ్ఱసముద్రము మిక్కిలి యుష్ణమయినదగుట యాశ్చర్యముకాదు. సాధారణముగ నోడమీఁద నుదయ మేడుగంటలుమొదలు పండుకొను సమయమువరకుఁ బడకగదిలో నున్నసమయమందుఁదప్ప, ప్రయాణీకులందఱును పురుషులు స్త్రీలు దుస్తులన్నియు ధరించియే తిరుగవలెను. స్త్రీలముందఱ పురుషులు కోటు తీసివైచి చొక్కాతోఁ దిరుగుట యాటలాడు సమయములందుఁదప్ప వేఱుసమయములందు సాంప్రదాయము కాదు. కాని యుత్కృష్టమైన వేడిమిగల యీయెఱ్ఱసముద్రమునందు చొక్కాయితోఁ దిరుగుట గొప్ప తప్పుగా గణింపరు. ఇట్టిసమయమం దావిరియంత్రములయొద్ద

నుండువారు, వానిలో బొగ్గువేసి మరలను జూచువారు, వంటలవారు, నివ్వానొద్దనుండు నితరనావికులును మిక్కిలి యమబాధ ననుభవింతురు. యుద్ధభూమియందు వెనుజూపి పారిపోవునాతని గుండుదెబ్బతోఁ గాల్చి చంపెడునాచారమువలెనే యోడలునడుపువారు వారియొక్క స్థలములను వదలి వారిపనులను మానిన న్యాయాన్యాయములను వితర్కింపకయే వారినిగూడ తుపాకితోఁ గాల్చివేయు నిబంధనలు గలవు. ఇటువంటి న్యాయాన్యాయము లాలోచింపక విధించిన కఠినశిక్ష మిక్కిలి ఘోరమయినదని కొందఱు చదువరులకుఁ దోచవచ్చును. కాని యేనావికుఁ డేసమయమందు వానిస్థలము వదలి పనిమానినచో నోడకు నష్టముకలుగునో ముందుచెప్పుట కష్టముగనుక వేయిమందిప్రయాణికులయొక్కయు సరుకులయొక్కయు ప్రాణము లీయోడనడుపువారిచేత నుండుటచే నటువంటి యుపద్రవము సంభవింపకుండుట కిటువంటిభయంకరమయినశిక్షలు విధించుట న్యాయమనియే నానమ్మకము. కొంతకాలముక్రిందటివరకును నివ్వానెగయొద్ద పనిచేయునోడనౌకరు లీయెఱ్ఱసముద్రపువేడి కోర్వలేక పనివదలి తమస్థానముల విడిచిన గుండుదెబ్బతో మరణము సంభవించుగనుక నట్టిమరణముకంటెఁ దమంతటఁదాము ప్రక్కనున్నసముద్రములోఁ బడినవారియుష్ణము, కష్టము చల్లారునని నీటిలో దుమికి యాత్మహత్య గావించెడివారు. ఇటీవల నటువంటివైపరీత్యములు జరుగకుండగ నివ్వాయొద్ద పనిజేయువారి కోడయధికారు లీయెఱ్ఱసముద్రప్రయాణములోఁ దఱచుగ విశ్రాంతి నిచ్చుచుందురు.

ఏడెనునుండి 1310 మైళ్ళపొడుగైన యీయెఱ్ఱసముద్రమును నాలుగుదినములలో దాటి సూయజను రేవును జేరితిమి. మేమా రేవుఁ జేరునప్పటికి నప్పటి జర్మనీ, ఆస్ట్రియా మొదలగుశత్రుదేశములయో

డ లింగ్లీషువారిచేఁ బట్టుకొనఁబడినవి. ఆంగ్లేయులు వాని (తంతిలేకయే వార్తలఁ దెలుపుసామగ్రి, (Wireless installation) నిద్రుంచివైచి యాయోడలలోనున్న శత్రుజనమును యుద్ధమునందుఁ బట్టుబడినఖయిదీలుగఁ దీసికొని యాయోడలలోనున్న యాంగ్లేయులను మిగిలిన మిత్రమండలివారిని బ్రిటీషువారిపడవలపై నెక్కించి వారు పోవుదేశములకుఁ గొంపోయిరి నేను చెన్నపట్టణములో మొదట ఆస్ట్రేలియాకంపెనీవారిపడవలోఁ బోఁదలఁచితిని. అటులఁ బోయినచోఁ గొంచె మనవసరమయినచిక్కులు పడియుందును. కాని నేను పోయిన న్యూరేలియాయనునోడ బ్రిటిషుకంపెనీవారిదగుటచే నట్టి చిక్కులు లేకపోయెను.

ఈసూయజురేవునుండియే సూయజుకాలువను ఫ్రెంచిదేశమునంతుఁ బుట్టి యశముగాంచిన ఫెర్డినాండుడిలెస్సెప్సుగారు త్రవ్వించిరి. ఇది 88 మైళ్లుపొడుగుగలదై పోర్టుసయ్యదువరకును వ్యాపించును. ఒడ్లు కోసికొనిపోకుండునట్లు తక్కువవేగముతోఁ బోవుటవలన నీకాలువదాటుటకు 14 గంటలుపట్టును. పెద్దయోడ లాక్రమింప నీయొడ్డు నాయొడ్డును చేరువగ నగపడుటవలన గొప్పవానిని చిన్నవానితోఁ బోల్చుట యొప్పిన యెడల నీసూయజుకాలువలోనియోడ నిడదవోలుమడుగుననుండిన రహదారిపడవవలె నగపడును. ఈకాలువముఖమున ననేకములయిన యోడలు కాలువదాటుటకుఁ దమవంతువచ్చువరకుఁ గాచుకొనియుందును. ప్రతియోడయు నీకాలువదాటుటకు వేలకొలఁది రూప్యములకప్పము చెల్లించును. ఈకప్పములనుండివచ్చిన ద్రవ్యము కొంతవెచ్చించి యీకాలువ యిసుకచేఁ బూడిపోకుండునటులఁ ద్రవ్వెడుయంత్రములతో నీరేవును గాపాడుచుందురు. ఈకాలువకంపెనీవారి కమితలాభము కలుగును. దీనిలో ప్రస్తుతము పెట్టుబడి చాలభా

గము బ్రిటీషువారిదగుటచే వారికిఁ జాలలాభము కలుగును.

ఈకాలువ త్రవ్వుటకుఁ బూర్వము సీమపోవునోడ లాఫ్రికా ఖండముచుట్టు దిరిగిపోవుచుండెడివి. ఇట్లు కాలువమార్గమునఁ బోవుటవలనఁ బదిరోజులు తక్కువకాలములోఁ బోవుచున్నవి. కొందఱుప్రయాణికులు సూయజురేవునొద్ద యోడదిగి నాటున రైలుమీఁద 'కైరో' పట్టనమునకు సమీపమున మిగుల ప్రసిద్ధిగాంచినగోపురములను (pyramids) జూచి పోర్టుసయ్యదురేవునకు రైలుమీఁదవచ్చి యక్కడ యోడను తిరిగి చేరుదురు.

పోర్టుసయ్యదుమొదలు ఫ్రెంచిదేశపురేవైన మార్సెయిలు (Marseilles) వరకును మధ్యధరాసముద్రములో నుందుము. మేమీ సముద్రములోనుండుతఱి జర్మను ప్రభుత్వమువారికిఁ జెందియున్న ఘోరయుద్ధముచేయు 'గీబెన్' (Gueben) అనుగొప్పయోడయు, కనపడినమాత్రముననే యూరంత యోడనయినను ఫిరంగిదెబ్బతో తుత్తునియలుచేయుసామర్థ్యముగల 'బ్రెస్లా' (Breslau) యను 'టార్పిడో' (Torpedo) యును బ్రిటిషునావికాసైన్యముచేతఁ బట్టుకొనఁబడక యే మధ్యధరాసముద్రమునందు స్వేచ్ఛావిహార మొనరించుచుండెడివి. ఈదుష్టనావలవాతఁ బడుదుమేమోయని మాకందఱకును జాలభయమాయెను. దీపముపెట్టకమున్నె సాయంకాలము భోజనమైదుగంటలకుఁ జేసి, పైకి వెలుతురుకనబడకుండ నోడదీపములన్నిఁటి నార్పి యెప్పుడే రాత్రిసమయమునం దీయుద్ధముచేయునావలవలన నాపదవాటిల్లునో యని రాత్రియంతయుఁ బ్రాణముల నరచేతియందుంచుకొని యెప్పుడు తెల్లవారునాయని సూర్యోదయమున కెదురు చూచుచుండెడివారము. ఇటు లైదారురోజు లహోరాత్రములు కంటఁ గునుకులేక తుదకు మార్సెయిలు చేరుసరికి మాకష్టములు గట్టె

క్కెనని మిక్కిలి సంతసించితిమి.

ఆంగ్లేయదేశమునకుఁ బోవువారు కొందఱు మార్సైయిలు రేవునొద్ద దిగి రైలుమీఁద పేరిసు (Paris) నుంచి యొకదినములో లండను చేరుదురు. మఱికొందఱు ఫ్రాన్సుదేశముచుట్టి పడవలోఁ బ్రయాణముచేసి లండనుచేరుట కింకొకవారముర్రోజులు తీసికొందురు. ఇట్లు భూమార్గమునఁ బోవుటవలన నరువదిరూపాయ లెక్కువైనప్పటికిని సముద్రయానమువలన విసుగుచే రైలుప్రయాణమే సుఖతరముగ నుండును. నేను చెన్నపట్టనమందు టిక్కట్టును కొనినపుడే ఫ్రాన్సు దేశముగుండఁ బోవుటకే యేర్పఱచుకొంటిని.

మార్సైయిలులో నోడదిగినవెంటనే బ్రిటిషుదొరతనమువారిచే వారియేలుబడిక్రిందనున్న ప్రజల సౌఖ్యముకొరకై యాయూర నేర్పరుపఁబడిన యొకయుద్యోగస్థుని (Consul) గలిసికొని యానాఁడు రైలుపైని పేరిసుపట్టనమునకుఁ బోవుటకు వీలగునాయని యడుగ యుద్ధసమయమగుటచే రైళ్లు మునుపటివలె నడచుటలేదనియు బ్రిటిషుసైన్యములోఁ జేరఁబోవు నుద్యోగస్థులు వారిభార్యలతో లండను పోవుటకుఁ దగినసదుపాయము చేయుమని రైల్వేకంపెనీవారు ప్రతిదినము మెయిలులో నొక మొదటితరగతిపెట్టెను తనపరమున నుంచిరనియు నందులో నాకుఁగూడ స్థలము నిచ్చెదననియు పేరిసుపట్టనమువరకుమాత్రము నేను బోవుటకు వీలగుననియు నచ్చటనుండి లండనుపోవుటకు నాపాట్లు నేను బడవలెననియుఁ జెప్పెను. నేను మార్సైయిలులో నాగిన నాలుగైదురోజులు నాకు మిక్కిలి సదుపాయముగ బసకుదిర్చి యున్నిసౌఖ్యములను కలుగఁజేసెను.

మేము పేరిసుపట్టనమందైదారుదినములుండి యూరంతయుఁ దిరిగితిమి. పేరిసుపట్టనమునందు యుద్ధముచే మే మెక్కుడుకాలమా

గుటచే పేరిసులోనున్న బ్రిటిషుప్రభుత్వ ప్రతినిధిగారు (British Embassy) మాకు మంచిహోటలులోఁ బసకుదిర్చి మాఖర్చులన్నియు వారే వహించిరి.

పేరిసుపట్టనము ప్రపంచములోనున్న పట్టనములలోనెల్ల మిక్కిలి రమ్యముగను మనోహరముగను నుండును. లండనునగరముకంటె కొంచె మెక్కు ఉష్ణమయినదగుటచేఁ బుష్పములు విరివిగఁ బెరుగును. ఈపట్టనమున మిగుల సౌందర్యమయిన పుష్పవృక్షములు కొన్నివీధులలో భూమినంటి పెరుగుటచే భూమియంతయు మనోహరమయిన రంగులతివాసులతోఁ గప్పఁబడినట్లుండి చూచుటకుఁ గనువందువుగ నుండును.

ఫ్రాన్సుదేశములో నెల్ల మాట్లాడుభాష ఫ్రెంచిభాషయే. నేనిక్కడనుండి లండనునకుఁ బోవుసమయమందు నాకుఁగాని నాతోఁ బ్రయాణముచేసిన కొందఱింగ్లీషువారికిఁగాని ఫ్రెంచిభాష బాగుగఁ దెలియకపోవుటచేఁ గొంతకష్టముగ నుండెడిది. మేము పేరిసునగరములో సేను (Seine) నదిదాటి కొంతదూరము తిరిగి యానమీాపమందున్న యొక చిన్నహోటలునకుఁ బోయి కాఫీ త్రాగనిశ్చయించుకొంటిమి. ఇంగ్లీషుభాషలో (Tea) యనుదానికి ఫ్రెంచిభాషలో 'తె' యనియు కాఫీ (coffee) కి 'కేఫె' (cafe) యనియు మాత్రము మాకుఁ దెలియును మాకు కాఫీలోనికి పాలను బల్లమీాద నుంచలేదు. మాలో నెవరికైనను ఫ్రెంచిభాషలో పాల కేమనవలయునో తెలియదు. గదియంతయు మేమందఱము చూడగ గదిపైభాగము తెల్లనికాగితములతోఁ గప్పఁబడి యుండెను. పాలు తెల్లనివస్తువుగనుక మన మీా తెల్లనిమిద్దెను జూపిన మనకుఁ బాలుకావలెనని మా హోటలుపడుచు గ్రహించుననని మామిద్దెవైపు చూపి తెమ్మని

ఫ్రెంచిభాషలో నడిగితిమి, ఆమె నవ్వుచు మీ కేది కావలెనో నాకు స్పష్టమాయెనని చెప్పి క్రిందికిఁ బరుగిడుచుఁ బోయి తెల్లకాగితములు కలము శిరాబుడ్డి మాకుత్తరములు వ్రాసికొనుటకుఁ గావలెనను నభిప్రాయముతో మాయొద్దకుఁ దెచ్చెను. మేము కోరిన దదికాదనియు మాకుఁ బాలుకావలెననియు ఫ్రెంచిభాషలో నెట్లు చెప్పవలెనో మాకుఁ దెలియలేదు. తుదకు మాలో నొకచిత్రకారుఁడు దగ్గరనున్న కాగితముపై నొక పెద్ద పొదవుగలిగిన యావును మూడను గీచి యివి కావలెనని చెప్పగా నామె గ్రహించి తుదకు మాకుఁ గావలసినపాలను కాఫీలోనికిఁ దీసికొనివచ్చెను.

పేరిసునుండి లండనుపోవుదారిలో మేము 'ఏమియన్సు' (Amiens) స్టేషనునొద్దకు వెళ్లుసరి కాయూరికిఁ బదిమైళ్లదూరములో జర్మనులు ఘోరయుద్ధము చేయుటవలన మా రైలు స్టేషనులో తప్పా పట్టాలపైని పదియేనుగంటలకాలము నాపి వారియుద్ధసామగ్రిని మనుష్యులను నిముషమున కొకపొడుగు రైలుబండిని బంపుచుండెడివారు. జర్మను లింకొక యైదారుమైళ్లు వచ్చియేయున్నయెడల 'ఎమియన్సు' పట్టనము వారిచేతిలోఁబడి నేను లండనునగరమునకు మారు బర్లిను నగరములో మూఁడేండ్లు యుద్ధఖయిదీగ నుండియుందును. ఏమియన్సు నుండి 'బోలోను' (Bolougne) కు రైలుమీఁదఁ బోయి యచ్చోట 'నింగ్లీషుచానలు' (English channel) ను పడవలో దాటి యాంగ్లేయదేశమును జేరితిమి.

# పురాణములలోని చారిత్రకవిషయము. *

క్రీస్తు పుట్టుటకు మూఁడు శతాబ్దములపూర్వము—అనగా అలగ్జాండరుదండయాత్రకుఁ బూర్వము—హిందూదేశముయొక్క చరిత్ర తెలియదనియు నాకాలపుస్థితిగతు లెక్కడనైనఁ దెలుపఁబడినయెడల నవియన్నియుఁ బురాణములుగావున నమ్మవీలులేదనియు లోకప్రవాద మిదివఱకుండెడిది. దానికిఁ గారణ మాధునికులయభిప్రాయమున కనుగుణ్యమైనచరిత్ర హిందూదేశమున లేకుండుటయే. సంస్కృతభాషయందును పాలిభాషయందును బురాణగాథలుగను కర్మసూత్రములుగను నున్నవాఙ్మయమునుండి చరిత్రయేదో పుక్కిటిపురాణమేదో విడఁదీయుటకుఁ బ్రయత్నించుట వ్యర్థప్రయాసమని యనేకులయభిప్రాయముకాని యిటీవల హిందూదేశమునందును ఐరోపాఖండమునందును బయలువెడలిన హిందూదేశచరిత్రపరిశోధకుల ప్రయాసములవలన నాచరిత్రయొక్క కాలప్రారంభము క్రీస్తు పుట్టుటకుఁ బూర్వము నాలవశతాబ్దమునుండి యేడవశతాబ్దమువఱకును బెంచఁబడెను. ఇందులకుఁ దార్కాణముగా నుత్తరహిందూస్థానముయొక్క పురాతనచరిత్రమును వ్రాసిన విన్సెంటుస్మిత్తువ్రాసిన యీక్రిందివాక్యమును జూపవచ్చును.

“హిందూదేశచరిత్రములోని యేచరిత్రాంశమునకైనను క్రీ॥ ము॥ 650 కిఁ బూర్వము సరియైనకాలమును దెలుపలేము. కావున హిందూచరిత్రకారులపరిశోధనల కావత్సరమే ప్రారంభమునకు హద్దుగ నేర్పఱచుకొనవచ్చును.”

---

* 1911 వ సంవత్సరపు మోడరన్‌రివ్యూనుండి గ్రహించినది.

పూర్వపుచరిత్రకారులవలెఁ గాక మూఁడుశతాబ్దములయినను వెనుకకు వెడలుట కీచరిత్రకారుఁ డొప్పుకొనుట శుభసూచకమే. ఏల యన నిదివఱ కందఱును స్థిరముగా నలగ్జాండరు దండయాత్రయే ప్రారంభమని ఘంటాపథముగఁ జెప్పు ప్రారంభకాలము స్థిరముకాద ని స్పష్టముగ ఖండింపఁబడుటవలన స్మిత్తుగారి యభిప్రాయమయిన క్రీ॥ ము॥ కూడ స్థిరముకాక యంతకుఁ బూర్వమయినను కావచ్చునే మోయను సందేహము కలుగుచున్నది.

కాలనిర్ణయము చరిత్ర కవసరమేకాని యదియే పూర్తియైన చరిత్ర యెన్నటికిని గాఁజాలదు. మానవుల యభివృద్ధికిని జ్ఞానమున కును వలయుపద్ధతులను జ్ఞాపకముంచుకొనుటయే చరిత్రయొక్క పర మార్థము.

ఈపరమార్థము ననుసరించి హిందూదేశపు పూర్వచరిత్రను గూర్చి యనేకములగు సంగతులను మనము నేర్చుకొనవచ్చునని ప్రసిద్ధులగు చరిత్రకారులు వ్రాయుచున్నారు.

పురాతన హిందూదేశమునందుఁ జదువుకొనఁదగిన చరిత్ర లేదను దురభిప్రాయమును రమేశచంద్రదత్తుగా రీవిధముగ ఖండించిరి.

" వేదమంత్రములను చరిత్రకుఁ గావలసిన క్రమపద్ధతిప్రకార ము చదివినపండితులు హిందువుల నాగరకచరిత్రమును వ్రాయుటకుఁ దగిన యుపపత్తు లనేకములు శిలలమీఁదను వృక్షపట్టములమీఁదను గానిపించువానికంటె నెక్కుడు విపులముగను సత్యములుగను గన్పట్టు చున్నవని గ్రహించుచున్నారు. ఈయన పురాణములలోని కాలనిర్ణ యమున కంతగా విలువ నీయలేదు. పురాతనచరిత్రను వ్రాయుసంద ర్భమున వాఙ్మయసాంప్రదాయముయొక్కప్రాముఖ్యము నాధునికు లొ ప్పుకొనుచున్నారు. హిందూదేశముయొక్క పురాతనచరిత్రను వ్రా

యుచు స్మిత్తుగారు సాంప్రదాయముకూడ చరిత్రజ్ఞానమున కాధార ములలో నొకదానిగఁ దెలిపియున్నారు. పురాణములు నిష్ప్రయోజ నములగు కల్పితకథలును నద్భుతగాథలు నని చరిత్రకారులు త్రోసి వేయుదినములు గడచిపోయినవి. ఈపురాణము లప్పుడప్పుడు కాలాను గుణముగ మార్పులను జెందినను వానిలోని వాఙ్మయసాంప్రదాయ మును గొంతవఱ కుపయోగించవలసియున్నది.

మిక్కిలి విమర్శనమును జేయుపండితుడయిన ఫ్లీటు(Fleet)దొ రగారుకూడ పురాణములలోని చరిత్రకు సంబంధించిన ప్రకరణముల ను గొంచెము యుక్తాయుక్తవిచక్షణము చేసి చరిత్ర కనుకూలించు నటు లుపయోగించుకొన వచ్చునని తెలిపిరి.

పురాణములలోఁ దెలుపఁబడిన రాజవంశావతారములు నమ్మ దగినవని తెలుపుచు విన్సెంటుస్మిత్తుగారు పురాణములు చరిత్రమున కు మూలాధారములని యెక్కువప్రాముఖ్యము నిచ్చిరి. ఆయన సంగ, కణ్వ ఆంధ్రవంశములకాలములను దెలుపుటకు పౌరాణిక సాంప్రదా యముల నాధారముగఁ దీసుకొని యితరాధారములతో వానిని సమ న్వయము చేసికొనెను. పురాణములు చరిత్రమున కాధారమనియు బ్రాహ్మణములలోని పౌరాణికగాథలు మిక్కిలి యెక్కువ పురాతన ములనియు వాయు, మత్స్య విష్ణు మున్నగు ముఖ్యములయిన పురాణ ములు క్రీస్తుతరువాత నాలుగవశతాబ్దమునకును, ఏడవశతాబ్దమున కును నడుమ ప్రస్తుతమున్నరూపమును దాల్చినవనియు నాయన యభిప్రాయము.

పురాణములనుగుఱించి ఇ. ఎఫ్. పార్గిటరు (F. F. Pargiter) గారింతకంటె దృఢమయిన యభిప్రాయమును దెల్పిరి. ఆయన ... తెలిపెను.

"ఈపురాతన వంశావతారములును వానికి సంబంధించిన కథలు, నిరాధారములై విషయరహితములయిన బంధించిన కథలు పుక్కిటిగాథలును కల్పితకథలు నని తలంపరాదు. వానియందు సత్యమయిన చారిత్రిక సాంప్రదాయము గలదు. దానిని లోకజ్ఞానముతో నాలోచించి తెలిసికొనవలెను.

ఈపైనఁ దెలుపఁబడినసంగతులను బట్టి పురాతన హిందూదేశచరిత్రమునకుఁ బురాణములు, వేదములు, వేదాంగములు మున్నగునవన్నియు నాధారములే యనియు వానివలన నార్యుల నాగరకతయే కాక రాజవంశములయొక్కయు రాజ్యములయొక్కయు వృద్ధిక్షయములు గూడఁ దెలిసికొనవచ్చుననియు దేలుచున్నది.

వేదముల నిదివఱకు శబ్దములయొక్కయు నక్షరములయొక్కయు మార్పులను దెలిసికొనునుద్దేశముతో మాత్రమే చదివిరి. చరిత్రజ్ఞానమును సంపాదించుకొను నుద్దేశ మింతకుఁబూర్వము లేదు. ఈ సందర్భమునఁ బండితు లోకవిషయమును మఱచిరి. అది యెద్దియనిన చరిత్రభాగమును దెలిసికొనుటకు వీలులేనికాలమే పురాణకాలమునకంత్యావస్థయని. కావున వేదములుపుట్టుచున్నపు డార్యులు చరిత్రమును వ్రాయుచుండిరి గాని దానినిగూర్చి మిథ్యాకల్పనలఁ జేయుచుండుట లేదు. వేదములు పూర్తియగుటతోడనే కృష్ణద్వైపాయనవ్యాసులు సంహితలను బోధగుచేసినతర్వాత వేదాంగపరిభాష లనేకములు బయలువెడలెను. అందు షడంగములలో నొకటియు, యాస్కునిచే నైదవశతాబ్దములోఁ బ్రతిపాదింపఁబడినదియు నగు నిరుక్తముయొక్క వ్యాఖ్యానము వేదపరిభాషనే గలిగియున్నదని ప్రసిద్ధి.

వ్యాఖ్యానములలో పదునాల్గవశతాబ్దమున రచింపఁబడిన శాయనభాష్య మిప్పటికి నున్నది. ఇది నిరుక్తములపై నాధారపడి

యిటీవలి పురాణములఫక్కిని జెందియున్నది. ఇటీవల ఋగ్వేదముల
కు శాయనభాష్యమే ముఖ్యమయిన వ్యాఖ్యానమై యున్నది. యా
స్కునికిఁబూర్వమే (బ్రాహ్మణములు, నారణ్యకములలో నప్పుడప్పుడు
గానిపించు చరిత్రాత్మకమయిన వ్యాఖ్యానముపోయి జనులకు దు
ర్గ్రహముగ నుండుచుండెను. ఏలయన యాస్కుఁడైతిహాసములను
నిరుక్తమునం దప్పుడప్పుడు తెలిపెనుగాని మొత్తముమీఁద భాషా
సాంప్రదాయానుసారము నే యనుసరించెను. హిందూదేశచరిత్ర కా
వలయుననిన మధ్యకాలములో మార్పును జెందిన పురాతనమూలము
లెవ్వియో తెలిసికొని, చరిత్ర నాధారముచేసికొని యట్టివానికిఁ జరి
త్రాత్మకమయినవ్యాఖ్యానము లెటులుండునో గ్రహించి, యామూ
లము నీకనుగొనిన వ్యాఖ్యానముతో సరిచూచి క్రమమయినపద్ధతి ను
న్నదో లేదో తెలిసికొనవలెను.

ఋగ్వేదముయొక్క ప్రస్తుతప్రతులు మంత్రములు చేసినము
నులనుబట్టి కాలస్థలభేదము లేక పదిమండలములుగ విభజింపఁబడినవి.
కాని యవి రాజులు, శూరులు, పురోహితులు నేదోయొకయుత్సవ
మును జేయుటకై యజ్ఞములను జేయుసందర్భమునఁ గల్పించి పాడిన
విగఁ గన్పట్టును. పురాణగాథలను భాషానైపుణ్యము మున్నగువాని
నైపున దృష్టిపోనీయక పైదృష్టితో మనము శ్రద్ధగఁ జూచినయెడల
చరిత్రకు సంబంధించిన కొన్నిసంగతులు మనకు బోధపడును. పురా
ణములుమున్నగువానియందుఁ గానిపించుకథలతోను చరిత్రాంశము
లతోను వీనిని తరువాతఁ జోల్చి సరిచూడవలెను.

పైనఁ దెలుపఁబడినవిమర్శనమును జేయుటకుఁ గొన్ని ప్రతిబం
ధకములు గానిపించుచున్నవి. విదేశములలో వాఙ్మయమును బరి
క్షింపఁబడలఁచుకొన్నను క్రీ॥ శ॥ 600 కుఁబూర్వము హిందూదేశ

మునుగురించి యేదేశమునందును దెలుపఁబడలేదు. స్థిరమయినస్మరణ చిహ్నములుగాని తుదకు నాణెములుగాని క్రీ॥పు॥ 600 మొదలు క్రీ॥ పు॥ 2000 వరకు నెచ్చటను గానిపింపవు. దీనికిఁ గారణము లేకపోలేదు. మహాభారతయుద్ధముముగిసిన యనేకశతాబ్దములతరువాత బౌద్ధమతము జనించినప్పుడుగాని యార్యులహిందూనాగరకతావ్యాప్తికి విదేశములలో సౌకర్యము లేర్పడలేదు. అప్పుడయినను బౌద్ధులమతప్రచారాసక్తి, వాణిజ్యాభివృద్ధియే యీవ్యాప్తికిఁ గారణములయ్యెను. అందువలన బౌద్ధమతప్రారంభమునకుఁబూర్వము విదేశములలో నెక్కడను హిందూదేశమునుగురించి యెక్కువగాఁ దెలియదు. అందువలన నాకాలపుచరిత్రమును దెలిసికొనుట కప్పటివాఙ్మయము, దాని నుండి నేర్చుకొనగలుగుసాంప్రదాయములే మనకు శరణ్యములు.

మనకుఁ దెలియని యీకాలములోనిచరిత్రమును గ్రహించుటకుఁ గొన్నిపద్ధతుల నవలంబించుట శ్రేయస్కరము.

మనకు దొరకిన వాఙ్మయసమూహము నాధారము చేసికొని మొదట చరిత్రనంతయు నామూలాగ్రముగ సంగ్రహముగా నేర్పఱింపవలయును. ఈచరిత్రకు సంబంధించిన స్థలములను దెలిసికొనుటకుఁ దానికిఁ దగినభూగోళమును వ్రాసికొనవలయును. అటుతరువాత నీవ్రాయఁబడిన భూగోళములోని పురాతన నగరములయొక్కయు, యుద్ధభూములయొక్కయు, పుణ్యక్షేత్రములయొక్కయు, నాశ్రమస్థలములయొక్కయు స్థలముల నిర్దేశించుటకై యొకక్రమమయినపద్ధతి నేర్పాటు చేయవలయును. ఈప్రయత్నము హిందూదేశములోనేకాక యితరదేశములలో హిందూదేశచరిత్రకుసంబంధించిన స్థలముల నన్నిఁటిని దెలిసికొనుటకుఁ జేయవలయును.

ఇట్లు కనుగొనిన నూతనాంశములను పండితులు పరిష్కరించి

యొకక్రమపద్ధతికిఁ దీసికొని రావలయును.

పురాణముల యొక్క మూర్పులలో కడపటివి క్రీ॥ వె॥ నాలుగైదు శతాబ్దులలో జరిగినటులఁ గానిపించును. అప్పు డుత్తరహిందూస్థానములో రాష్ట్రస్థాపకులగు గుప్తులు (Imperial Guptas) రాజ్యము చేయుచుండిరి. ఆ కారణములోని యభిప్రాయములనుబట్టి పురాణముల కన్నిటికి నద్భుతమైన వింతగాథలు చేర్చఁబడినవి. కావున నీకాలమునుగూడ దాఁటి వెనుకకు వెడలి యప్పటియార్యుల నాగరకతను దొరకునాధారములనుబట్టి యేఫలితములు వచ్చునో తెలిసికొనవలయును.

సశేషము.

# ప్రజాప్రభుత్వము.

ప్రతిరాష్ట్రమునకును ప్రభుత్వమొక్కటియుండుట యావశ్యమని యందరెరిఁగినదే. ప్రజలప్రాణమానధనముల రక్షించి, వారిని సమస్తవిధముల బాగుజేసి, వారి నుత్తమస్థితికిదెచ్చుట ప్రభుత్వమువారిభారమై యున్నది. ఇందునిమిత్తముగనేకదా సైన్యాదు లగు యుద్ధసామగ్రిని సమకూర్చుకొని, పరరాష్ట్రములవలన స్వరాష్ట్రవాసుల కెట్టియుపద్రవమును రాకుండ ప్రభుత్వమువారు జాగరూకులై యుండుట ; ఈయుద్దేశము ననుసరించియే స్వరాష్ట్రములోనిదురాత్ముల శిక్షించి, ప్రజలప్రాణధనముల గాపాడుటకై రక్షకభటులను, న్యాయస్థానములను, కారాగృహములను, వారేర్పాటు చేయుచుందురు. నిరుపేదలను, రోగులను, అనాధలను సంరక్షించి ప్రజల నుత్తమస్థితికి దేనెంచియె వారు ఆస్పత్రులు మొదలగువానిని కట్టించుచున్నారు. ప్రజలలో వేరువేరుగగాని, లేక అందరు కలసిగాని, చేయలేనట్టియు, ఎవరోయొకరు చేయవలసినట్టియు, తపాలాసేవింగ్సుబాంకులు, వంతెనలు, బాటలు, కాలువలు, జలాధారములు, పాఠశాలలు, వస్తుప్రదర్శనాగారములు మున్నగునేర్పాటుల నెన్నిటినో ప్రభుత్వమువారు చేయుచుందురు. అనగా, దేశమున కప్పుడప్పుడు సంభవించు నుపద్రవముల దొలగించుటయేకాక, దేశములోనివారు సర్వవిధముల బాగుపడుటకు వలయునదుపాయముల నిర్మించుచుండుట ప్రస్తుతకాలవు పరిపాలనాధర్మమై యున్నది. ఇదియొక పాశ్చాత్యదేశములయందేకాక ప్రాగ్దేశములలోని ప్రభుత్వమువారు కూడ చేయుచున్నారు.

ఇన్నికార్యముల నిర్వహించుచుండు ప్రభుత్వవర్గమందు ప్రధాన శాఖలు రెండుగలవు. వీనిలో మొదటిది చట్టనిర్మాణశాఖ. (Legislature.) ఇదివర కమలులో నున్నచట్టములయందలిలోపముల సవరించి, జనోపయోగము లగుక్రొత్తచట్టముల నిర్మించుటయే యీశాఖయొక్కప్రధానకార్యము. దేశసంరక్షణకై వలయుసైన్యసామాగ్రి యెట్టిదిగ నుండవలయునో, ప్రభుత్వమువా రొనరించినకార్యముల కెంతద్రవ్యము కావలయునో, దీని నేవిధముగ ప్రజలనుండి వసూలుచేయవలయునో, ఆదాయము నేవిధము వ్యయపెట్టవలయునో, ఎవరు శిక్షాపాత్రులో, ఆస్తివిషయమై యెవరెవరి కెట్టిహక్కులును, ఎట్టిప్రతిబంధకములును గలవో, ప్రజలు తమలో తా మెట్టియొడంబడికల ( Contracts ) జేసికొనవచ్చునో, ఏయేపనులకై ప్రజలు సంఘములుగ నేర్పడి వారియుద్దేశముల నెరవేర్చుకొనవచ్చునో మున్నగువిషయములగురించి చట్టములీశాఖవారుచేయవలసియుందురు. కాలము మారుకొద్ది, ప్రజల వివేకము నాచారములు మారుకొద్ది చట్టములుగూడ మారుచుండవలసి యున్నది గనుక నీకాలమందు చట్టనిర్మాణశాఖవారిబాధ్యతయు హెచ్చగుచున్నది. ఇదిగాక చట్టనిర్మాణశాఖవారు గావించినశాసనముల నమలులో నుంచి పరిపాలన కార్యమును నిర్వహించు (నిర్వాహక) శాఖయే ప్రభుత్వవర్గములోని రెండవశాఖ. శాసనముల నతిక్రమించి నడచువారిని పట్టి శిక్షించుటయు, శాసనానుసారముగ పనులనడపించుటయు, ఈశాఖవారు చేయవలసినకార్యములలో ముఖ్యములైనవి. ప్రజలకష్టసుఖము లెల్లప్పుడీరెండుశాఖలవారికార్యోద్దేశముల ననుసరించియే యుండును. చట్టనిర్మాణశాఖలోనివారు చేయుచట్టములు ప్రజల కనుకూలముగ నున్న యెడల ప్రజలు బాగుపడగలరు; అట్లుకానినాడు కీడుజెందుదురు.

ఇదియేవిధముగ కార్యనిర్వాహశాఖవారు చట్టములను క్రమముగ నమలులోనుంచి, నిష్పక్షబుద్ధితో బ్రవర్తించిన ప్రజలు సుఖింతురు. లేనిచో దుఃఖములపాలగుదురు.

ప్రతిరాష్ట్రమందును పరిపాలకులు ప్రజలు అనురెండుపక్షములవారున్నారు. ప్రజల శాసించువారిని సన్మార్గప్రవర్తకులుగ జేయువారలు పరిపాలకులు; పరిపాలకులశాసనములకు బద్ధులై మెలగవలసినవారు ప్రజలు. ఈరెండుపక్షములవారికినిగల పరస్పరసంబంధమునుబట్టి ప్రభుత్వములు రెండువిధములని శాస్త్రజ్ఞులు పరిగణించియున్నారు. పరిపాలకుల యధికారమున కంతయు ప్రజలసమ్మతియే మూలకారణమైనయెడల అట్టిప్రభుత్వమునకు ప్రజాప్రభుత్వమనియు, అట్లుకానిదానికి నిరంకుశ (Despotic) ప్రభుత్వమనియు, వారు పేరిడియున్నారు. అనగా శాసననిర్మాణశాఖలోనిసభ్యులు ప్రజ లెన్నుకొనినవారై ప్రజలయిష్టమున్నంతవరకు సభయందుండి వారి కిష్టము లేనప్పుడు సభాచ్యుతు లగునప్పుడును; అదియేవిధముగ చట్టముల నమలులోనుంచుటకై వలయునేర్పాటుజేయు మంత్రివర్గములోనివారు ప్రజలయంగీకారమునకు బద్ధులై యుద్యోగముల జేయుచు. అట్టియంగీకారము లేనప్పుడు వారియుద్యోగముల మానుకొనుచుండునప్పుడును; ప్రభుత్వమునకు ప్రజాప్రభుత్వమని పేరుకలుగును. ప్రజాప్రభుత్వమనగా ప్రజలహితము ననుసరించియే జరుపబడుప్రభుత్వముగాదు. పూర్వకాలమందు మనదేశమును పరిపాలించినహిందూచక్రవర్తులేమి, తర్వాత విదేశములనుండి మనల నేలిన మహామ్మదీయప్రభువులలో ననేకులేమి; ప్రస్తుతము మనకు నధికారులుగనున్నఆంగ్లేయులేమి, మన దేశమున కెంతయో యుపకారమును, సౌఖ్యమును, లాభమును, కలుగజేసిరి. కాని వీరిప్రభుత్వమును ప్రజాప్రభుత్వమని

చెప్పుట శాస్త్రసమ్మతముకాదు. వీరిపరిపాలనము ప్రజానుకూలముగ నుండినను ప్రజలే మూలకారణముగ కలిగియుండలేదు. హిందూచక్రవర్తులు వారిమంత్రుల నేర్పాటుజేసికొనుటలో ప్రజలయిష్టానిష్టముల ననుసరించినవారుకారు. ఎవరిని వారు సమర్థులని యనుకొనిరో వారినే మంత్రులుగ నేర్పరచుకొని, వారిసలహాల ననుసరించియే చట్టనిర్మాణము జేయుచు, వారిసహాయముననే ప్రజలను దండించుచుండిరి. మంత్రిపదవికిగాని, శాసనసభ్యత్వమునకుగాని యర్హానర్హతల నిరూపించినవారు ప్రజలుకారు. కనుక శాసనాధికారులపైనను, కార్యనిర్వాహకసభ్యులమీదను, ప్రజల కెట్టియధికారమును లేకయుండెను. అమలులో నున్న శాసనముల విసుగుజెందక శిరసావహించుటయే ప్రజాధర్మముగ నెంచబడియుండెను. ఈకారణముచేత నట్టిప్రభుత్వములకు నిరంకుశప్రభుత్వములని నవీనశాస్త్రజ్ఞులు పేరిడిరి.

ప్రజాప్రభుత్వముగాక మరియెట్టిపరిపాలనముగాని యేదేశమందును, ఎట్టికాలమందును, నుండుటకు వీలులేదనియు, అందుచే ప్రభుత్వములన్నియు మొత్తముమీద ప్రజాప్రభుత్వములేయనియు మరియొకవాదము కలదు. “ప్రభుత్వవర్గములో చేరియుండువారిసంఖ్య బహుస్వల్పము. ప్రజలసంఖ్య దీనికంటె నెన్నియోరెట్లధికముగ ప్రభుత్వమువారు ప్రజలంగీకరించనికార్యము లేవైన జేసినయెడల నధికసంఖ్యగలప్రజలు వారిపై కలహించి వారిని వశపరచుకొనగలరు. ప్రజ లాలాగుచేయరేని, ప్రభుత్వమువారినిబంధన లన్నియు వారికి సమ్మతిగనున్నవనియే యూహింపవలయును. ప్రజానుకూలము లేక ప్రభువు లెంతకాలము రాజ్యముచేయగలరు? ప్రజలవిరోధమును సంపాదింప నెట్టిప్రభువులైన సాహసింతురా? కనుక, విచారించి చూడ, ఎంతనిరంకుశాధికారము వహించినప్రభువులుకూడ కొట్టకొనకు

ప్రజానుబద్ధములై యుండవలసియున్నది. ఈకారణముచే ప్రభుత్వము లన్నియు ప్రజాప్రభుత్వములు కాని తదితరములు కావు ” ఇది కొందరి యభిప్రాయమైనను విమర్శించిచూడ నిదిశాస్త్రసమ్మతము కాదనియు నహేతుకము కాదనియు విశదపడకమానదు. ప్రభుత్వమువారు స్వల్పసంఖ్యాకులగుట సత్యమే. కాని, సమస్తాధికారము వారియందుండుటచేతను సైన్య మంతయు వారిస్వాధీనమం దుండుటచేతను, అధిక సంఖ్యాకులైనప్రజలు తమకిష్టమున్నను లేకయున్నను పరిపాలకులకు వ్యతిరిక్తముగ నడచుకొనునంతటిశక్తి గలిగియుండరు. ధైర్యసాహసములుగాని, యుద్ధముచేయుటయం దనుభవముగాని, జయహేతువగు నైకమత్యముగాని ప్రజలయందు లేకపోవుటచేతను ; కలహించుటవలనకలుగు తాత్కాలికకష్టముల ననుభవించుటకన్న ప్రభుత్వమువారి శాసనములవలన జనించినబాధల నోర్చుట మేలని ప్రజలభిప్రాయపడుటచేతను; ప్రజలు కలహించకయుండవచ్చును. ఆకారణముచే పరిపాలకులు చేయునదియంతయు ప్రజలసమ్మతి బడయుచున్నదనికాని, ప్రజల కనిష్టముగ, ప్రభువులెప్పుడు ప్రవర్తింప రనిగాని చెప్పుట సమంజసముకాదు.

ప్రజలకు హిత మొనరించుటమాత్రముచేతనే ప్రభుత్వము ప్రజాప్రభుత్వము కాజాలదనియు ; ప్రజానురంజకము గాని ప్రభుత్వములు శాశ్వతముగ నుండజాలవు కావున ప్రభుత్వములన్నియు ప్రజాప్రభుత్వములె యని చెప్పుటకు వీలులేదనియు ; దీనినిబట్టి తెలియుచున్నది. ఏదిప్రజాప్రభుత్వముకాదో యిప్పటికి తెలిసినది గనుక ప్రజాప్రభుత్వధర్మముల నుదహరింపగలకొన్ని ప్రభుత్వములవిమర్శనకు మన మిప్పుడు ప్రారంభింపవచ్చును. ప్రభుత్వవర్గమును నియమించుట యందును తొలగించుటయందును ప్రజల కెక్కడయధికార ముండు

నో అదియే ప్రజాప్రభుత్వమని యిదివరలో జెప్పియుంటిని. దీనికి ప్రధానమైనయుదాహరణము మనఆంగ్లేయదేశములోనిప్రభుత్వమే.

ఇంగ్లండునం దిప్పుడు శాసననిర్మాణముచేయు నధికార మొక పార్లమెంటుసభకుమాత్రమే యున్నది. ఈసభవారు నిర్మించినట్టియు, వీరియనుమతిని బొందినవారు గావించినట్టియు, చట్టములకుమాత్రము ప్రజలు బద్ధులై యున్నారుగాని, మరియేచట్టములును వారిని బంధింపజాలవు. ఈసభకును దేశములోనిప్రజలకును గలసంబంధము మనము తెలిసికొనినయెడల ఇంగ్లండునందు ప్రజాప్రభుత్వ మెంతస్థిరముగ నాటుకొనియున్నదో మనకుస్పష్టపడగలదు. పార్లమెంటుయొక్కయధికారమును చెల్లించుటలోముగ్గురుభాగస్థులున్నారని చెప్పవచ్చును. అందులో మొదటివారు దేశమునకంత ప్రభువగుచక్రవర్తిగారు. కాని చట్టనిర్మాణమందుమాత్రము వీరికి స్వతంత్రాధికార మేమియు లేదు. మంత్రులేసలహానిచ్చిన దానికి బద్ధులై వీరుండవలసినవారలే కాని, దానికి విరుద్ధముగ నడచుకొనుట కెంతమాత్రమును సాహసింపరు. రెండువందలసంవత్సరములనుండియు ఇంగ్లండులోనిరాజు లిట్టి స్థితియందున్నారు. పార్లమెంటులోని యితర రెండుశాఖలవారును కలసి గావించినచట్టముల నిరాకరించుటకు రాజగారి కెంతమాత్రము స్వతంత్రములేదు. వారికసమ్మతమైనశాసనమునుకూడ వారంగీకరించుటయే విధియైయున్నది. అనేకసంవత్సరములనుండి జరుగుచున్నమామూ లిట్టిదియే. పార్లమెంటులోని రెండవశాఖకు ప్రభువుల సభయనిపేరిడవచ్చును. దీనియందు సుమారు 650 సభ్యులున్నారు. వీనిలో చాలమందికి గౌరవము వంశపరంపరగ వచ్చుచున్నది. ఈ కారణముచే నిజముగ సమర్థతగలవా రీసభలో చాలతక్కువ. ఇందుచే వారియభిప్రాయముల ప్రజలంతగా గౌరవించుటలేదు. ఇది

గాక చట్టనిర్మాణమందు వారికిగల యధికారము బహుస్వల్పము. వారియంగీకారము లేకయే పార్లమెంటులోనిమూడవశాఖవారు ప్రజలపై పన్నుల విధించుటకును, ఆదాయమును ఇష్టమువచ్చినట్లు ఖర్చిడుటకును స్వాతంత్ర్యము కలిగియున్నారు. పన్నులతో సంబంధములేని యితరశాసనములనుకూడ ప్రభువులసభయనుమతిని పొందకయె కొన్ని సందర్భములయందు మూడవశాఖవా రమలులో నుంచవచ్చును కనుక శాసననిర్మాణాధికార మంతయు ప్రజాప్రతినిధిసభయగు మూడవశాఖయందు నిలిచియున్నది.

పార్లమెంటులోని మూడవశాఖకు ప్రజాప్రతినిధిసభ యని పేరు ఇందులోనిప్పుడు 670 సభ్యులున్నారు. వీరిని సభ్యులుగ నియమించువారు దేశములోనిప్రజలే. వీరి నెన్నుకొనుటకై దేశమంతయు 670 భాగములుగ విభజింపబడియున్నది. ఒక్కొకభాగమందలిస్త్రీపురుషు లందరు కలిసి వారి కిష్టమైనవాని నొకని వారితరఫున నాసభకు పంపుదరు. ఇట్లు వెళ్ళినవా రైదుసంవత్సరములకంటె నెక్కువకాల మాసభలో సభ్యులుగ నుండకూడదు. అయిదుసంవత్సరములు ముగియగనె తిరిగి ప్రతిజిల్లాలోనిస్త్రీపురుషులు చేరి, యిదివరకు తామెన్నుకొనినసభ్యుడు తనకార్యమును సమర్థతతో నిర్వహించెనని యనుకొనిన, వానినే తిరిగి తమప్రతినిధిగ పంపుకొనెదరు; లేనిపక్షమున మరియొకని నియమించుకొనెదరు. ఈవిధముగ నప్పుడప్పుడు ప్రజాప్రతినిధి సభ్యులయెన్నికలు జరుగుచుండుటవలనను; ఒకమారు తాము సభ్యులుగ నియమించినవారిని మరుసటిసమయమున తొలగించి క్రొత్తవారి నెన్నుకొనుటకు ప్రజలకు హక్కుండుటవలనను; ప్రజాప్రతినిధిశాఖాసభ్యు లెల్లప్పుడు ప్రజలకు జబాబు చెప్పవలసియుందురు. ఈకారణముచేత వారు ప్రజలసమ్మతికిని ప్రజాభిప్రాయమునకును వ్యతిరి

క్తముగా నడుచుకొనుట సంభవించదు. అట్లు నడచుకొనినయెడల తమసభ్యత్వమునకెక్కడభంగమువచ్చునో యన్నభయము వారిమనస్సునం దెప్పుడు వ్యాపించియే యుండును; అందుచేత వారెల్లప్పుడు జాగరూకులై ప్రజాభిప్రాయము ననుసరించి, ప్రజల కిష్టముగనుండుచట్టములను మాత్రము చేయుచు, వారి కిష్టములేనివానిని తలపెట్టక, ప్రవర్తించుచుందురు. ఇట్టిసభ్యులుగల ప్రజాప్రతినిధిశాఖయే పార్లమెంటుశాఖ లన్నిటిలో ప్రధానమైనదిగ నున్నది. ప్రజలపై పన్నులవిధించుటయందును, వసూలైనపన్నుల ఖర్చిడుటయందును, ఈసభ కున్నంతయధికారము మరి ప్రభుశాఖవారికిగాని చక్రవర్తిగారికిగాని లేదు. ప్రభుశాఖవారియుద్దేశములకు విరోధమైన శాసనముల చేయుటకుకూడ వీరికి స్వతంత్రము కలదు. ప్రజలయభిప్రాయము లెట్లున్నవనువిషయ మొక్కదానినేవీరెల్లప్పుడు జాగ్రతతో కనుగొనుచుందురు. కనుక పార్లమెంటువారు చేయునట్టియు, ప్రజలు శిరసావహించునట్టియు, శాసనములన్నియు ప్రజాప్రతినిధులే చేయుచుండుటచేత ప్రజలే ఇంగ్లండుదేశమందు ప్రభువులనుటయం దాశ్చర్యముకాని యసత్యముకాని యించుకంతకూడ లేదు. ప్రజాప్రభుత్వముగలదేశములన్నిటిలో నింగ్లండు ప్రాచీనమైనది. ఈదేశమునుండియే మిగిలినవారీప్రభుత్వరహస్యములను మర్యాదలను నేర్చికొనిరి.

సశేషము.

35608

# ఆంధ్రసేవాకార్యస్థానమున వెలకుదొరకు గ్రంథములు.

1. పురాణపఠనము. శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారు. జాతీయ విద్యను బోధించుమార్గ మిందు దెలుపఁబడినది. P 10 రు 0-1-0
2. స్వప్నకావ్యము. ఆంధ్రభాషనుగుఱించిన వివాదములను చమత్కారముగ నిరసించును. P 28 రు 0-2-0
3. తెలుఁగుక్లాసుతమాషా. తెలుఁగుభాషను బోధించునుపాధ్యాయులయొక్క చిక్కులను దెలుపును. (మిక్కిలి నవ్వుబుట్టించును.) P 10 రు 0-1-0
4. మహావాక్యప్రసంగప్రహసనము. బ్ర॥ కూచి నరసింహంపంతులుగారు బి. యె. ప్రస్తుతవిద్యార్థులయొక్క దురలవాటులను సూచించి వారికి మంచిమార్గమును బోధించును. P 10 రు 0-1-0
5. కృష్ణకుమారి. నందూరి మూర్తిరాజుగారు బి. ఏ. వంగదేశములోని యొక స్త్రీరత్నముయొక్క చరిత్ర. పద్యకావ్యము. P 10 రు 0-1-0
6. వెనిసు. ఇటలీదేశములోని నగరచరిత్రము. P 8 రు 0-1-0
7. ఫ్లారెన్సు. డిటో. P 18 రు 0-1-6
8. జలాపాతము (Water Fall) P 10 రు 0-1-0
9. జలోత్ప్రపాతము (Artesian well) P 12 రు 0-1-0
10. హిమప్రవాహములు (Glaciers) P 18 రు 0-1-6
11. చంద్రగ్రహణము. P 10 రు 0-1-0

పైనాలుగుగ్రంథములు చక్కనియలంకారములు మున్నగువానితో నొప్పుభాషయందుఁ బాశ్చాత్యశాస్త్రజ్ఞానమును దెలుపునవి.

## నోటీసు.

బ్రహ్మశ్రీ సత్తెనపల్లి సోమయాజులుగారిచే సుప్రశస్తముగా తయారుచేయబడినవి. వసంతకుసుమాకరం తు 1 కి రు 16-0-0. పూర్ణచంద్రోదయము తు 1 కి రు 12-0-0. సువర్ణసహితవాతరాక్షసము తు 1 కి రు 8-0-0. కాంతవల్లభరసము ప్రతాపలంకేశ్వరము మున్నగు నౌషధములు క్రయమునకు దొరకును.

వలయువారు—ఆంధ్రసేవాపత్రికాస్థానము,

పిఠాపురము, అనివ్రాయవలెను.

# Wanted.

Agents to "**ANDHRASEVA**" a Telugu Educational Monthly Journal. Liberal commission paid.

Apply with a half-anna postage stamp to:—

The Editor "ANDHRASEVA"

**PITHAPURAM,**

*Godavari Dt.*

# Wanted.

Every businessman to have his advertisement made in this Journal. For particulars, apply with half anna postage stamp to:—

The Editor "ANDHRASEVA"

Pithapuram, *Godavari Dt.*

ఆర్. సి. హెచ్. హైస్కూలు ప్రధానోపాధ్యాయులగు మ. రా. రా. శ్రీ కూచి నరసింహముపంతులు బి. ఏ. గారిచే రచింపఁబడిన యీక్రిందిగ్రంథములు మాకార్యాలయమున దొరకును. పోస్టేజీ కొనువారే భరించవలెను.

1. శ్రీరామకృష్ణపరమహంసచరిత్రయు, దద్బోధములును.
   పేజీలు 170, 2 వకూర్పు. వెల రు 0-10-0

2. శ్రీగౌరాంగ (చైతన్యస్వామి) చరిత్రము.
   1 వ భాగము పుటలు 373 — 1-4-0
   2 వ భాగము పుటలు 3 7 — 1-4-0

వలయువారు, "ఆంధ్రసేవాపత్రికాధిపతిగారు,

పిఠాపురము, గోదావరిజిల్లా"

అని వ్రాయవలెను.

మరి యే కారణములవలన గాకపోయినను ఈ కారణమువల్లనే టీకాలువేయించు అభ్యాసము నూతనజాతివారికి మాష్యమైయున్నది.

భావిజనాంగమున విషాదుల ప్రయోగమువలన లేక జంతుదేహ సారమును మనుజుని దేహములో సూదులగుండ జేర్చుటవలన వ్యాధులను గుణముచేయుట లేదు. అయితే వివేకయుక్తమైన యారోగ్య నియమములచేతను, ఆహార శుద్ధిచేతను, క్రియల శుద్ధిచేతను, సంకల్ప శుద్ధిచేతను, వ్యాధులు లేకుండచేయుదురు. వేయేల? కేవలము పరిశుద్ధతవలననే నిరోగస్థితిని కలిగించెదరు.

మతిహీనులై మీరు పై జెప్పిన చెడ్డవాడుకలకు అవకాశమిచ్చియున్నారు. నాటివలన మీ జీవితమునకు విషమెక్కె దాని నైజ సుఖము పాడైనది.

ఆలోచనలేక చేసికొనిన యీ దురభ్యాసములనుండి మీ దేహముల కేమేమియో యాశలను కలుగజేసి యున్నారు. ఆ యాశలచే మిమ్ముల నా దేహములు తమవశము జేసికొనియున్నవి. మీ యదృష్టమునకు మీరే కారణకర్తలై యుండుటకు మారుగా మీరు దేహముల దురభ్యాసములకు బానిసలై యున్నారు.

మీ రిపు డాచరించుచున్న దంతయు మీ యభ్యాస ఫలమనియే తెలియుడు. పరిశుద్ధత, ఆశారాహిత్యమువలన లభించు స్వాతంత్ర్యము— ఈ రెంటినుండి సంప్రాప్తమగు శాశ్వతానందమును పొంద యత్నించుటకు మారుగా మీరు మీ దురభ్యాసములవలన నశ్వరసుఖములను పొందుచు జీవిత సోపానమున యవనతిని చెందుచున్నారు.

వృద్ధికి కుందకములై, తమకు బంధకములైయున్న యిట్టి దురభ్యాసములకు నా జాతివారు, లోబడక స్వతంత్రులై వర్తించెదరు.

(అనువాదకుడు)

మొళకాల్మూరు వెంకట్రావు

# సమాజవృత్తాంతములు

శ్రీ కృష్ణాజీగారు జనవరి తే 27 ది రాత్రి అడయారునుండివెడలి, బొంబైనగరమున కొద్దిదినములుండి, యట్నుటనుండి ఫిబ్రవరి తే 2 ది నాడు నావయెక్కి ఐరోపాకు విజయంచేయుదురు.

*　　*　　*　　*

శ్రీ శ్రీ సి. జినరాజదాసగారు దక్షిణ అమెరికాలో దివ్యజ్ఞాన ప్రచారముచేయుచు సంచారము చేయుచున్నారు. వీ రచ్చటికిపోయిన పిదప, నా ఖండమున సమాజశాఖలు వృద్ధియై యొక క్రొత్తజనాంగ శాఖ స్థాపించఁబడెననియును విని సంతసించుచున్నాము.

*　　*　　*　　*

డాక్టరు అరండేలుగారును, వారి సతీమణి శ్రీమతి రుక్మిణీదేవి యును, జనవరి తే 9 దిన అడయారువిడిచి చెన్నపురమున నే నావ యెక్కి జావా, ఆస్ట్రేలియా, అమెరికా ఖండములలో సంచారము చేయఁ బోయియున్నారు.

జనవరి తే 11 ది మొదలు తే 16 ది వరకు అడయారు, సెండ్రీ కళాశాల ఆవరణమున " తారకశిబిరము " చాల వైభవముతోఁ జరిగెను. ఏడువందలమంది సంఘసోదరులు రిజస్టరుచేసికొని సమావేశ మునకు వచ్చియుండిరి. కొద్దిమంది సమాజమునకు చేరనివారును వచ్చి యుండిరి. సమావేశములలో రమారమి వేయిమంది జనమువచ్చి శ్రీ కృష్ణాజీగారి యుపన్యాసములను వినుచుండిరి. అన్ని దిక్కులనుండియు పెక్కండ్రు సోదరీమణులు, వచ్చి శిబిరమున పాల్గొనిరి. ప్రతిదిన మును :—

ప్రాతఃకాలమున నొక యుపన్యాసమును, మధ్యాహ్నము మీద నొక ప్రశ్నోత్తర సభయు, సాయం సంధ్యాకాలమున "శిబిరజ్యోతి" యు, ఉపన్యాసము—ఇవి ముఖ్యాంశములు. ప్రాతఃకాల ఉపన్యాసములలో ఒక దినముమాత్రము మాతుః శ్రీ ఆనీబెసెంటమ్మగారును, ఒకనాడు హాలెండు దేశసుధును, ప్రస్తుతము ఆస్ట్రేలియానుండి వచ్చియుండిన డాక్టరు వాన్‌డర్ లేయుగారును ఉపన్యసించిరి. తక్కిన నాలుగు దినములు శ్రీ కృష్ణాజీగా రుపన్యసించిరి. ప్రశ్నోత్తర సభలన్నియును శ్రీ కృష్ణాజీగారే జరిపిరి.

ఉపన్యాసములును, ప్రశ్నోత్తరములును ముగియగనే శ్రీయుత చిట్టమూరు రామయ్యగారు వానిని ఆంధ్రమున చెప్పుచుండిరి.

ఈ "తారకశిబిర" ఉపన్యాసముల సంగ్రహము రాబోవు సంచికలో విస్తారముగ ముద్రింతుము. ఈ సంచికలో కాశీక్షేత్రమున జరిగిన దివ్యజ్ఞానసమాజ తారకసంఘ వార్షికోత్సవములం జరిగిన యుపన్యాసముల చాల మట్టుకు విస్తారముగనే ముద్రించితిమి. ఈ ఫిబ్రవరి సంచిక కన్వెన్షన్ స్పెషల్ సంచిక. రాబోవుసంచిక "తారకశిబిర" పు స్పెషల్ సంచిక యగును. సం ॥

## ఆంధ్ర దివ్యజ్ఞాన సమ్మేళన వృత్తాంతములు

### దివ్యజ్ఞాన సేవాసమితి (Theosophical Order of Service)

ఈ సమితి మన ఇండియా దేశములోకూడ వ్యాప్తి చెందుచున్నది. ఇది దివ్యజ్ఞాన సమాజము చాటుచున్న యాదర్శమును ఆచరించి చూపుచున్నది. అనగా సోదరభావమును వివిధ సేవలద్వారా ప్రకటింపుచున్నది. ఈ సమితి చేయుసేవ ఏడు విధములుగనున్నది. అవి యేవి యనిన:—

1. సంఘ సేవ :—బిడ్డలను కాపాడుట, నిరుపేదలకు అన్నదానము వస్త్రదానము, రోగులకు వృద్ధులకు ఖైదీలకు సేవ మొదలుగా గలవి.
2. జంతు సేవ :—పశుసంరక్షణ, పక్షుల సంరక్షణ, జంతుబలుల నాపుచేయుట, జంతువుల వేట ఆపుజేయుట, పక్షుల వేటాడకుండజేయుట, పశు పక్ష్యాదులకుఁగూడ సుఖ మొనగూర్చుట.
3. లోకశాంతి :—శాంతి జపములు—లోకమందు శాంతిగలుగు మార్గములు జూచుట.
4. హెచ్చరిక :—లోక కల్యాణమునకై ఏవిధమైన సేవనైనను చేయుటకు ఎల్లప్పుడు సిద్ధముగా మెలకువతో నుండుట.
5. ప్రకృతిచికిత్స—ఆహార విహారములయందు కృత్రిమమార్గములు గాక ప్రకృతిజీవనము పద్ధతులు బోధించుట.
6. రోగ నివారణ :—ధ్యానాదులవలన రోగ నివారణ విధానము.
7. చిత్రకళలు :—సౌందర్యము, సంగీతము, సాహిత్యము, నాటకములద్వారా ఆత్మతత్త్వము నెఱుగుమార్గము సూచించుట.

వీని నన్నింటినిగూర్చి సవిస్తరముగా తెలియగోరువారు తన్నిమిత్తికి మన దేశమున ప్రధానసోదరులగు శ్రీమతి భాగీరతీ శ్రీరాం గారికి, అడయారు, మదరాసు అను చిరునామాకు వ్రాసి తెలిసికొనదగు. ఆంధ్రదేశములోని సమాజశాఖలవారందరు నీ సేవావిధానములలో కొన్నిటినిగాని అన్నింటినిగాని చేకొని ఈ సమితిపక్షమున నొక శాఖ నేర్పరచి పనిచేయుచు మన యున్నతాదర్శమును లోకమునకు వెల్లడి చేయుదురని మరి మరి వేడుచున్నాము.